
5-8-66



ఆంధ్రసచిత్రవార

పత్రిక


బాబూమూవీస్
కన్నెమనసులు
దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు నిర్మాత: సి. సుందరం సంగీతం: మహదేవన్


PHILIPS
ఫిలిప్స్ నోవోసోనిక్ రేడియోలు
★ అసామాన్య శబ్దగ్రహణము
★ అధునాతనమైన సాంకేతికాలు
★ సొమ్ముకు తగిన కొత్త రకములు
B6CA37A/01 PHILIPS MAESTRO రూ. 896/-
B5CA37A PHILIPS MAJOR రూ. 645/-
B4CA39T PHILIPS TRANSISTOR MINOR రూ. 485/- 4 బ్యాండులు
4BCA57A PHILIPS MINOR రూ. 485/- 4 బ్యాండులు – 6 వాల్వులు
B3CA47U PHILIPS PHILETTA SUPER రూ. 325/- 3 బ్యాండులు – 5 వాల్వులు
L4CA38T/01 PHILIPS TRANSISTOR PORTABLE రూ. 485/- 3 బ్యాండులు లెదరు బ్యాగు ఎక్స్‌ట్రా రు. 30
అనుమతి పొందిన సబ్ డీలర్లు:
1. విజయ ఎలక్ట్రోనిక్స్, విజయనగరం.
2. వాణి రేడియో హోమ్, అనకాపల్లి.
3. శ్రీ వెంకటేశ్వర రేడియో హౌస్, నరసిపట్నం.
4. సరస్వతీ మ్యూజికల్ అండ్ ఎలెక్ట్రికల్స్, పార్వతీపురం.
5. నయ్యుడు రేడియో హౌస్, ఇచ్ఛాపురం
(పన్నులు అదనము.)
విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలకు అనుమతి పొందిన డీలర్లు:
టెలిగ్రాం: 'సౌండ్'
వైజాగు రేడియో కో.,
విశాఖపట్టణం – శ్రీకాకుళం.
ఫోన్స్: 120 42


Roopkala
సీతారామాంజనేయ పిక్చర్స్ వారి
సంగీతలక్ష్మి
ఆంధ్ర/ రాయల్ ఫిలిమ్స్
సీడెడ్/ జయలక్ష్మి పిక్చర్స్
నైజాం/ యస్.యస్.ఎ.పి
మైసూర్/ R.S. పిక్చర్స్
కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం
గిడుతూరి సూర్యం
నిర్మాతలు
పి.నరసింగరావు-అమరా రామసుబ్బారావు
సంగీతం: యస్.రాజేశ్వరరావు
రచన/ ఆత్రేయ/ కెమెరా/ అన్నయ్య/ కళ/ రాజేంద్రకుమార్. B.A., / నృత్యం/ K.S. రెడ్డి/ కూర్పు/ M.S.N. మూర్తి
VIJAYA

ఉత్తరాలు

కథలు

"చిత్రహింస", "సర్కారు ఎక్స్‌ప్రెస్" అను రెండు కథలు చాలా బావున్నాయి.

విజయ (తాడేపల్లిగూడెం)

* * *

శ్రీ గొర్తి విష్ణుప్రియగారి "శేష మ్మత్తయ్య" కథ వన్నెంతో ఆకర్షిం చింది. రెండుసార్లు చదివాను. "శేష మ్మత్తయ్య" గారి చిత్రం ఎంతోబాగున్నది.

ఆర్. రాధాకృష్ణ. (కాకినాడ)

సీరియల్

ఆంధ్రసచిత్రవారపత్రికలో ప్రచురిత మవుతున్న భారత(దేశం)లోని నిరుద్యోగపర్వం చూస్తూంటె నాకో అనుమానం వచ్చింది. భూలోకవాసులకు దేవుడంటే భయం భక్తి పోతున్నాయని బ్రహ్మకి సూర్యుడు కంప్లెయింట్ చేశాడు. కాని ఈ కలియు గంలో సాష్టాంగ ప్రణామాలకి సాక్షాత్క రించని పరలోక పరమాత్మలకి బదులు భక్తితో సమర్పించుకునే తీర్థప్రసాదాలకి ప్రసన్నులయ్యే ఇహలోక (డబ్బింగ్) దేవుళ్లు వెలిశారు. ఆనాడు హిరణ్యక శిపుడు "గాలిం గుంభిని నగ్నినంబువుల నాకాశ స్థలిన్ దిక్కులన్" అంటూ కోరిన వరా లకు బ్రహ్మ 'యస్' అంటూసైన్‌చేశాడు. దానికి శ్రీమన్నారాయణుడు ఓ టెక్నిక్ కని పెట్టి హిరణ్యకశిపుడి అంతుతేల్చాడు. ఈనాడు భూలోక వాసులపై నిరుద్యో గులు ఆగ్రహించి సూర్యుడిని కన్సల్టు చేసి చదువులు—ఉద్యోగాలు రోడ్డుమీద గొయ్యి కాస్త పెద్దదే త్రవ్వితే— మేము అంతకంటే పెద్దవాళ్లం అంటూచాలీ చాలని గోతుల్లో తాముదిగి తమభక్తుల్ని అవలికి చేరవేస్తున్నారీ డబ్బింగ్ దేవుళ్లు. పాపం బ్రహ్మకి అప్పుడూ ఇప్పుడు కూడ అన్యాయం జరుగుతునే వుంటోంది. అదీగాక ఆనాడు "లావొక్కింతయులేదు. ధైర్యము విలోలంబయ్యె, ప్రాణంబులున్ ఠావుల్దప్పెను" అంటూ గజేంద్రుడు ప్రయా సతో ప్రాసయతులు కూర్చి పాతికపద్యాలు పాడగా "సిరికింజెప్పడు శంఖచక్రయుగ ముం జేదోయిసంధింప"కుండా ప్రత్యక్ష మైనాడు పరమాత్ముడు .... కానీ ఈ భూలోకదేవుళ్లు పద్యాలతో పనిలేకుండానే ప్రసాదాలకు ప్రసన్నులయి అభీష్టాలు నెరవేరుస్తున్నారు. బహుశః ఇది నిజమై వుంటుంది.

రాము మాచిరాజు (నిడుమోలు)

* * *

కొన్నేళ్ళక్రితం మీ పత్రికలో ముళ్ల పూడి వెంకటరమణగారి కథలు చదివిన మాకు యిన్నాళ్లకు ఒకటికి రెండు సార్లు చదివింపజేసే సీరియల్ 'నిరుద్యోగ పర్వం' మీ పత్రికలో వెలువడడం, సంతో షంగావుంది. నాలుగైదు వారాల్లోనేముగు స్తుందన్న మీ హెచ్చరిక మాకుకొంచెం నిరాశకలిగించిందని చెప్పాలి!

నిరుద్యోగి యింటర్ వ్యూకి వెళ్తున్నా డంటే కాఫీతో బాటు టిఫిన్‌కూడాయిస్తా రుట! నిరుద్యోగిమీదసానుభూతి పార్వతీ దేవితోబాటు మనకీ కలుగుతుంది! పాపం, ఏం చేస్తాం? పరమేశ్వరుడే ఏమీ చేయ లేనపుడు!

రచయితగారు యిలాంటి హ్యూమరస్ కథలు మీపత్రికద్వారా మరికొన్ని త్వర లోనే అందిస్తారని ఆశిస్తాము.

వి. కాశీనాథ్ (విజయవాడ)

* * *

''భూపతి'గారు రచించిన "మద్దమం దార" కథచాలాబాగుగావున్నది. వాసుజీవితము లోని ఘట్టాలు చాలా అద్భుతంగా వున్నవి కాని ముగింపు అంత సంతోషకరంగాలేదు. వాసు అనుకున్న నిజం బయట పెట్టలేక పోయినాడు. అసలువిషయం రమణకు తెలియలేదు కావున ముగింపు సమం జసముగా లేదు.

చిట్టూరి జగన్నాధరావు (జాలూరుపహాడ్)

* * *

భూపతిగారు వ్రాసిన, ముద్దమందార సీరియల్ ఇంతవరకు చాలా బాగా తీసుకు వచ్చేరు. ప్రజలకు చాల ఆతృతగాఉండేది, కాని రామంని రచయితగారు చంపి వేశారు. రమణను, రామంను కలిపితే చాలా బాగుండును.

కుమారి.బి. అనంతలక్ష్మి సత్యవతీదేవి.

(అమలాపురం)

వ్యాసాలు

"సమాజంలో గ్రామసేవిక ఎదుర్కొనే సమస్యలు" చదువుతుంటేనే చాల బాధ అనిపించింది. నిజంగా ఎదుర్కొనేవారెంత గుండెనిబ్బరం గలవారో వూహించలేక పోతున్నాను.

వి. సుజాత (ఒరిస్సా)

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం : 5—8—'66
పరాభవనామ సం॥ అధిక శ్రావణ మాసం బ॥ చవితి
సంపుటము : 58 సంచిక : 49
స్థాపితము :
1908

*

ముఖ్య సంపాదకుడు :
శివలెంక శంభుప్రసాద్

*

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీధి, మద్రాసు-1

క్రొత్తరేట్ల ననుసరించి 14—1—1966 మొదలు ఆంధ్రసచిత్ర వారపత్రిక చందా వివరాలు.

భారతదేశం

	పోస్టుద్వారా రూ. పై.
సంవత్సర చందా	19.25
6 మాసముల చందా	9.62
3 మాసముల చందా	4.80

ఇతరదేశాలకు
ఓడమీద (Sea Mail)

సంవత్సర చందా	32.00
అర్ధసంవత్సర చందా	16.00

రచయితలకు మనవి

మా కార్యాలయం చేరే ప్రతిరచనతోనూ దానిరచయిత గాని, రచయిత్రిగాని అది తమ స్వంతరచనేననీ, దేనికీ అనుకరణ కాదనీ హామీ వ్రాసి పంపాలి. ఇటువంటి హామీలేని రచనలను ప్రచురణకి స్వీకరించలేము.

సంపాదకుడు
ఆంధ్రసచిత్రవారపత్రిక

మన లో మాట

దక్షిణాది వనితలని గురించి మరాఠీ రచయిత శ్రీ సుక్తాంకర్ తమ అభిప్రాయాలు తెలిపారు. వీటితో దక్షిణాదివారందరూ కూడా ఏకీభవించక పోవచ్చు !

* * *

'నిరుద్యోగపర్వం' ఈవారంతో అయిపోయింది. నిజంగానే నిరుద్యోగ పర్వా లెన్నో ముగిసి ఉండగలవని ఆశిస్తున్నాము !

* * *

అనిలాఖన్నాని గురించి శ్రీమతి ఉషారాణి భాటియా రాసి పంపిన వ్యాసం మాకు తెలుగులోనే అందింది...

* * *

1930—40 ప్రాంతాలలో మద్రాసులో తెలుగు సినిమాలు కొన్ని వారాలపాటు ప్రదర్శింపబడుతూ ఉండేవి. అప్పుడు మద్రాసులో విడుదలైన 'బాలనాగమ్మ' చిత్రం కొన్ని వారాలపాటు విజయవంతంగా ప్రదర్శింపబడింది. ఆ తర్వాత మద్రాసులో తెలుగు సినిమాల ప్రదర్శన బాగా తగ్గిపోయింది. మళ్ళీ యిప్పుడిప్పుడే తెలుగు సినిమాలను మద్రాసులో కొన్నివారాలపాటు ప్రదర్శించటం ప్రారంభమైంది. మద్రాసులో తెలుగు సినిమా ప్రదర్శనకు గల అవకాశాలను వివరిస్తూ శ్రీ మోహన్‌కుమార్ వ్రాసిన వ్యాసాన్ని ఈ సంచిక 51 వ పేజీలో చూడవచ్చు...

* * *

ఉత్తరాల శీర్షికకి రాసేవారు తమ పేర్లు, చిరునామా తెలుగు లిపిలోనే రాయాలని మనవి చేస్తున్నాము...

విషయానుక్రమణిక

ముఖచిత్రం : నటి కల్పన



పైకి పోయేందుకు నిచ్చెనలు
సంధిగ్ధావస్థ
కాంగ్రెస్ పార్టీ
అలాగా అమెరికాతో మంత్రాంత్రి సంప్రదింపులు జరపం
ఉత్తర వియత్నాం
చైనా
మీకు ఏటానికూడా అవసరం లేదు. ఆరోగ్యం గానే ఉన్నారు
చలనచిత్ర నిర్మాతలు
చలన చిత్ర నిర్మాతల రక్షణకైనది ఏర్పాటు చేయాలన్న కోర్కెకు ఆర్థిక మంత్రి సమాధానం
OOMMEN

కాంగ్రెస్‌పార్టీలో కనుమరుగైపోతున్న అయికమత్యం

ఈవారం కాంగ్రెస్‌పార్టీ అంతానికి ఆరంభంతో ప్రారంభం అయిందా అన్నట్లనిపిస్తున్నది. రాష్ట్ర రాజకీయాల్లో తల ఎత్తిన విధానమే కేంద్రానికి కూడా పాకింది. కేంద్రంలో ప్రధాని ముగ్గురి పార్టీ, కేంద్ర మంత్రివర్గంలోనూ, కాంగ్రెస్ పార్లమెంటురీ పార్టీలోనూ అసంతృప్తివర్గాలు ఏర్పడ్డాయి. 1947 ఆగస్టు 15 నుంచీ కేంద్ర మంత్రివర్గంలో అభిప్రాయ భేదాలున్నాయి. కానీ అవి కేంద్ర మంత్రివర్గంలోని 'పాత కాపుల' స్వయం క్రమశిక్షణవల్ల కీర్తిశేషులైన పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ విశిష్ట వ్యక్తిత్వంవల్ల అదుపులో ఉండేవి. సర్దార్ పటేల్ పార్టీనాయకుడు. ఆయనకు కాంగ్రెస్ పాలన ప్రారంభమైన మొదటిరోజుల్లో మంత్రివర్గంలో మెజారిటీ ఉండేది. ప్రధాని నెహ్రూ కాశ్మీర్ విధానాన్ని ఆయన ప్రతిఘటించే వారన్న విషయం అందరికీ తెలిసిందే. నిజానికి ఆయన భారత సంస్థానాలశాఖను నిర్వహించేమంత్రిగా ఉండేవారు. కానీ ఆయన కాంగ్రెస్‌అంటే ఎంతో భక్తిశ్రద్ధలు కలవారవటంచేత కాశ్మీర్ విషయంలోగానీ, తర్వాత హైద్రాబాద్ విషయంలోగానీ నెహ్రూతో ఘర్షణపడలేదు. నిజానికి కేంద్రప్రభుత్వం తన అయికమత్యాన్ని పరిరక్షించుకుంది. లాల్ బహదూర్‌శాస్త్రిగారికి నెహ్రూ వ్యక్తిత్వం లేకపోయినా, మంత్రుల ప్రమాణంలోనూ ఎన్నో మార్పులు జరిగినా ఆఖరువరకూ అయికమత్యాన్ని పైకి భద్రపరచటం జరిగింది.

ప్రధానికీ, కాంగ్రెస్ అధ్యక్షునికీ మధ్య ముఖ్యమంత్రులకూ ప్రదేశ్ కాంగ్రెస్ సంఘాధ్యక్షులకూ అధికారంకోసం అభిప్రాయ భేదాలు ఏర్పడుతున్న విషయం యిక్కడ వప్పుకోవాల్సి ఉంటుంది. కేంద్రానికి సంబంధించినంత వరకూ నెహ్రూదే పైచేయిగా ఉండేది. ఆయన అప్పటి కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తమ్‌దాస్ టాండన్‌తో బసా పైసా తేల్చుకోవల్సి వచ్చింది. శ్రీ టాండన్ గద్దె దిగకతప్పిందికాదు. తర్వాత వచ్చిన ఆచార్య కృపలానీతోకూడా నెహ్రూ ఘర్షణపడ్డారు. కృపలానీ కూడా అధ్యక్ష పీఠంనుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ అధ్యక్షులు నెహ్రూకు అనుకూలురైన తోటి మంత్రులు. వారు నెహ్రూ భావాలకు అనుగుణంగా తమ భావాలను మలుచుకుని పనిచేసేవారు. ప్రభుత్వ విధానాలలో వారెప్పుడూ జోక్యం కల్పించుకోలేదు. నెహ్రూ స్వయంగా వోట్లు సంపాదించుకోగల సమర్థుడు. ఎన్నికలలో గెలుపొందడానికి, ప్రధానమంత్రిగా ఎన్నికవడానికీ ఆయనకి కాంగ్రెస్ అధ్యక్షుని సహాయం అనవసరం. అసలు విషయం కాంగ్రెస్ అధ్యక్షుడు నెహ్రూ నియమించిన వ్యక్తి. అంతేకానీ ప్రధానిని కాంగ్రెస్ అధ్యక్షుడు నియమించేవారు కాదు.

నెహ్రూతర్వాత పెద్దమార్పు వచ్చింది. శ్రీ శాస్త్రి నెహ్రూ వారసుడైనప్పటికీ ప్రధాని పదవికి పోటీదారులు కొంతమంది ఏర్పడ్డారు. నెహ్రూ మరణంవల్ల దేశానికి కలిగిన హఠాదాఘాతం, వూగిసలాడుతున్న క్రమశిక్షణలే శ్రీ కామరాజ్‌కు ప్రధానమంత్రిగా శ్రీ శాస్త్రిని తీసుకు వెళ్లడానికి అవకాశాన్ని కల్పించాయి. పరిపాలనా వ్యవహారాలు శాస్త్రిగారికి కొత్తవేమీకావు. నెహ్రూగారి హయాంలో ఆయన వివిధ స్థాయిలలో ఎంతో అనుభవాన్ని సంపాదించుకొన్నారు. అందుకనే ఆయన తన విషయంలో తన ప్రభుత్వ విధానాల విషయంలో శ్రీకామరాజ్ జోక్యం కలిగించుకోడానికి అవకాశం యివ్వకుండా ఆయనతో మైత్రీ భావంతోనే వ్యవహరించారు. భారత పాకిస్తాన్ సంఘర్షణ ఆయినను వీరుడ్ని చేసింది. శ్రీ శాస్త్రి హఠాన్మరణంతో అధికారంకోసం కుమ్ములాట తిరిగీ ప్రారంభం అయింది. శ్రీ కామరాజ్ కూడా ప్రధాని పదవికి పోటీ లేకుండా చేయలేకపోయారు. శ్రీ మొరార్జీ కానీ, శ్రీ జగ్‌జీవన్‌రాంగానీ ప్రధానికావటం తన కిష్టం లేనట్లు స్పష్టంగా చెప్పారాయన. శ్రీయుతులు చవాన్, నందాలు పోటీలో నెగ్గలేకపోయారు. అందువల్ల నెగ్గుకు వచ్చిన వ్యక్తి శ్రీమతి ఇందిరాగాంధి. ఆమె అధికార అభ్యర్థినిగా ఎన్నుకోబడ్డారు. శ్రీమతి ఇందిరాగాంధి విజయాన్ని సాధించారు—కానీ అంతస్తు, హోదా మాత్రం వేరు—కామరాజ్ ముఖ్యమంత్రులను కూడగట్టుకొని రావటంద్వారా.

ముఖ్యమంత్రులను ఎన్నుకునేవారు ప్రధాని అయినంతవరకూ ముఖ్యమంత్రులు తమ పదవి కొనసాగడం నిమిత్తం ప్రధానిపై ఆధారపడవలసి వచ్చేది. కానీ ప్రస్తుతం పరిస్థితి తారుమారైంది. మనవల్ల ప్రధాని పదవికి వచ్చిన వ్యక్తి అనే భావం ముఖ్యమంత్రులకు ఏర్పడింది. రెండోది, భారతీయులకు బ్రిటీష్‌వారి క్రమశిక్షణ, చిత్తశుద్ధి యింతవరకూ అలవడలేదు. ప్రస్తుత బ్రిటీష్‌రాణి సర్ విన్‌స్టన్ చర్చిల్ మంత్రిగా ఉన్నప్పుడు పుట్టారు. అయినప్పటికీ ఆమెను ఆయన రాణిగా గౌరవిస్తున్నాడే తప్ప చిన్న పిల్లగా చూడటంలేదు. కానీ మనవారి విషయంవేరు. కేంద్రమంత్రులలో చాలామంది ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధిని ఎప్పుడో శ్రీ నెహ్రూ యింట్లో మసలుతున్న చిన్నపిల్లగానే నేటికీ చూస్తున్నారు. ఇకమూడ

న్యూఢిల్లీ లేఖ

వది ఏమంటే శ్రీయుతులు అశోకమెహతా సుబ్రహ్మణ్యంలు తాము సంయుక్త ఉప ప్రధానులైనట్లు ఒత్తిడి తెస్తున్నారు. దీని వల్ల తక్కిన మంత్రులు శ్రీమతి ఇందిరా గాంధికి దూరమయ్యారు. ఇక మిగిలిం దేమంటే ప్రధానికి కాంగ్రెస్ అధ్యక్షునికీ మధ్య ఘర్షణ పునఃప్రారంభమైంది. శ్రీమతి ఇందిరాగాంధికి కాంగ్రెస్ అధ్యక్షునికి ప్రతి కూలంగా వ్యవహరించడానికి తగిన అను భవమూ, అంగబలమూ లేవు.

ఇటీవలి కాంగ్రెస్ కార్యవర్గంలో జరి గిన ముసుగులో గుద్దులాటకు యిదే పూర్వరంగం. కార్యవర్గంలో జరిగిన చర్చ రూపాయి విలువ తగ్గించడం, తద్వారా ఏర్పడ్డ ఆర్థిక పరిణామాలని సరిదిద్దటం ఎలాగా అని కాకుండా శవ పరీక్షలా ఉంది. మొదటి విషయం ఆర్థికమంత్రి మినహా ఒక్క కేంద్రమంత్రికూడా ప్రధానికి అండగా నిలవలేదు. ఆర్థికమంత్రిమాత్రం తన చర్యను చక్కగా సమర్థించుకున్నారు. తర్వాత శ్రీ మొరార్జీదేశాయ్ ఒక్కరే నిర్మాణాత్మకమైన సూచనలు చేశారు. వేతన స్థంభన విధానాన్ని శ్రీ మొరార్జీ సమర్థించినందుకు కార్మిక మంత్రికి బదులు దేశీయాంగ శాఖా మాత్యులు శ్రీ నందా మందలించారు. సోష లిస్టు—కార్మిక ప్రభుత్వం బ్రిటన్‌లో వేతన స్థంభన పద్ధతిని అమలు జరపటం అంద రికీ తెలిసిందే. మరొక విషయమేమంటే ప్రస్తుతం విదేశీ సహాయాన్ని నిరసించడం ఫాషన్ అయిపోయింది. శ్రీ కృష్ణమీనన్ విదేశీసహాయాన్ని ముఖ్యంగా అమెరికాసహాయం ఏదైనాసరే తన అనర్గళమైన వాక్చా తుర్యంతో విమర్శిస్తున్నారు. శ్రీ టి. టి. కృష్ణమాచారి ఆయనను యిటీవల జరిగిన కార్యవర్గ సమావేశంలో సమర్థించారు.

మూడవ ప్రణాళికలో విదేశీ సహాయా నికి సంబంధించిన పరిశీలనలు క్రింద యివ్వ బడ్డాయి.

"ఇతర దేశాలనుంచి కావలసినంత సహా యాన్ని పొందటానికి సహాయంపొందే దేశా నికీ, యిచ్చే దేశానికీ ఉపయోగకరంగా ఉండే పద్ధతిలో మూడవ ప్రణాళికా రూపకల్పన జరిగింది. ఈ సందర్భంలో తేట తెల్లం అవు తున్నదేమంటే విదేశీ మారకం అవసరం—విదేశీ సహాయం అవసరం—మూడవ ప్రణా ళికలో కావల్సినంత ఉందని. మూడవ ప్రణాళికలో విదేశీ సహాయం 2600 కోట్ల రూపాయలు ఉందని తేల్చారు. నాలుగవ ప్రణాళికలో భారీ ఎత్తున ఉండే పెట్టు బడులను తట్టుకునేందుకు యింకా పెద్ద మొత్తంలో విదేశీ సహాయం కావాల్సివస్తుం దనికూడా మూడవ ప్రణాళిక తేటతెల్లం చేసింది.

అప్పుడు రక్షణమంత్రిగాఉన్న శ్రీ కృష్ణ మీననే మూడవ ప్రణాళికపై సంతకం చేసిన వ్యక్తి.

అసలు కేంద్రంలోని ప్రభుత్వపార్టీపై కాంగ్రెస్ క్యారవర్గం అభిప్రాయం ఏమిటి? ముగ్గురి సహచరులతో కలసి తనతో సంప్ర దించకుండా రూపాయి విలువ తగ్గించి నందుకు కాంగ్రెస్‌కార్యవర్గం శ్రీమతి ఇందిరా గాంధిని శపిస్తున్నది. అది ఆమె 'తెలివి తక్కువతనం' అని దుయ్యబట్టటమేకాకుండా దేశంలోని ఆర్థిక స్తోమతును పెంచ డానికి సహాయపడటానికి కూడా నిరాకరిస్తు న్నది కాంగ్రెస్ కార్యవర్గం.

కాంగ్రెస్ పాలకులు ఈమధ్య న్యూఢిల్లీ లో సమావేశమైనారు. ఆర్థికంగా దిగజారి పోతున్న దేశాన్ని రక్షించే ప్రయత్నం ఏదీ వారు చేయలేదు. ముఖ్యమంత్రులంతా దేశం లోని క్రమశిక్షణా రాహిత్యాన్ని ఎదుర్కొన టానికి యింకా ఎక్కువ అధికారాలు కావా లని కోరారు. కానీ కాంగ్రెస్ పార్టీలోని వ్యక్తులలో క్రమశిక్షణను పాదుకొల్పడానికి తగిన ప్రయత్నమే కన్పించలేదు. ప్రతిపక్షాల వారు మాట్లాడేందుకు అవకాశంయిచ్చే అంశాలను మాత్రం శక్తివంచన లేకుండా అందించారు. అది కాంగ్రెస్ మంత్రులే తమ ప్రభుత్వాన్ని దుయ్యబట్టటానికి బాహాటంగా పురికొల్పింది. ఇంకోవిధంగా చెప్పాలంటే అలా చేయడం శ్రీమతి ఇందిరాగాంధిపై మోయ లేని భారాన్ని వేసింది. ఆమె పని మరింత యిరకాటంలో పడేట్లు చేయటంలో శాయ శక్తులా వినియోగపడింది. శ్రీమతి ఇందిరా గాంధి నిర్ణయాలు తీసుకోడంలో ధైర్యాన్ని, దృఢ నిశ్చయాన్ని, అధికారాన్ని ప్రదర్శిం చారు. కానీ ఎవరి ఓర్పుకైనా ఓ హద్దంటూ ఉంటుందికదా! భారతదేశం చరిత్రలో ఎటు వంటి విపరీత పరిణామాలు ఏర్పడతాయో భవిష్యత్తే ఋజువు చేస్తుంది. ●



'అదనపు
తెలుపుదనము
ఎక్కడ నుంచి
వస్తుంది?'
Tinopal

మోహన్ రామ్

అపసరణ సిద్ధాంత స్వరూపం


రాజకీయాలలో 1952 తరవాత ద్రా.ము.క. సాధించినటువంటి అభివృద్ధిని పోలినవి చాలా అరుదేమో. కాంగ్రెసు, కమ్యూనిస్టులు, షెడ్యూల్డ్ కాస్ట్స్ ఫెడరేషన్ (తర్వాత రిపబ్లికన్ పార్టీ అయింది), స్వతంత్రపార్టీ—ఇవన్నీ ఎప్పుడో ఒకప్పుడు, రహస్యంగానో, బహిరంగంగానో ద్రా.ము.క.న్ని ప్రోత్సహించాయి. విచ్ఛిన్న శక్తులని పెంచటానికి తోడ్పడ్డాయి.

1952 తర్వాత ద్రా.ము.క. ఇక కోలుకోలేదను కున్నారు. నిజానికి కమ్యూనిస్టు అవకాశవాదులు కొందరు దానిని పునరుద్ధరించే దాకా ద్రా. ము. క. బాగా నీరసించి పోయిఉందనే చెప్పాలి.

మొదటి ఎన్నికలలో ద్రా. క. కమ్యూనిస్టులకి దగ్గిర అయింది, అసలుకమ్యూనిస్టు పార్టీలోనే చేరిపోతుందా అనిపించేది. ఈసాన్నిహిత్యంగనుక మరికొంత కాలం కొనసాగితే ద్రా ము. క. క్షీణించేదేమో కాని కమ్యూనిస్టులు పొరపాటు చేశారు. మున్సిపల్ ఎన్నికలముందు ద్రా.ము.క. ని వదిలి శ్రీ ఎస్. బి. ఆదిత్యన్ నాయకత్వం కింద నడుస్తున్న 'కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ' లో ఒకచీలిక వర్గం (ఇందులో ద్రా. ము. క. వారు కూడా కొందరు చేరారు) తో కలిశారు. అంటే, మొదటిసారిగా ద్రా.ము.క. పరోక్షంగా, 'జాయింట్ ఫ్రంట్' ద్వారా కొన్ని సీట్లకి పోటీ చేసి మున్సిపల్ కవున్సిల్ లలో స్థానాలు సంపాదించు కున్నదన్న మాట.

ఆంధ్ర రాష్ట్రావతరణం

మద్రాసురాష్ట్రంలోని కొన్ని తెలుగు జిల్లాలు విడిపోయి ఆంధ్రరాష్ట్రంగా అవతరించటానికి ద్రా. ము. క. అభివృద్ధికీ చాలా సంబంధం ఉంది. 1952 లో శ్రీ కామరాజ్, ఆయన అనుచరులు శ్రీ సి. రాజగోపాలాచారిని ముఖ్యమంత్రి చేశారు. అప్పటి మద్రాసు శాసనసభలో ఆంధ్ర, మలబారు ప్రాంతాలలో కమ్యూనిస్టులు బాగా గెలవటంవల్ల కాంగ్రెసు పరిస్థితి కొంచెం బలహీనంగానే ఉండేది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడగానే తమిళనాడులో కాంగ్రెసుబలం అధికం అయి శ్రీ కామరాజ్ వర్గంవారికి రాజాజీ మీద ఆధారపడే అవసరం లేకపోయింది. శ్రీ కామరాజ్ శ్రీ రాజగోపాలాచారిని ముఖ్యమంత్రి పదవినుంచి తొలగించారు. కుల వృత్తిమీద విద్యాభ్యాసం ఆధారపడాలని రాజాజీ ఏర్పరచిన ప్రణాళికని సాకుగా తీసుకుని శ్రీ కామరాజ్ వర్గం—ద్రా. క., ద్రా. ము. క. ల సహాయంతో—ఆ ప్రణాళిక మీద ఒక పెద్ద ఉద్యమం లేవదీయించారు. తిరుప్పరకున్రమ్ సమావేశంలో తమిళనాడు కాంగ్రెసు ప్రముఖులు కొందరు ద్రా. ము. క., ఫార్వర్డ్ బ్లాక్ సహాయంతో



శుద్ధతమిళుడు

రాజాజీని 'అనారోగ్యంవల్ల' రాజీనామా ఇచ్చేట్లు చేశారు. శ్రీ కామరాజ్ పదవిలోకి వచ్చారు.

శుద్ధ తమిళుడు

దీనితో తమిళనాడులో ఒక కొత్త రాజకీయ మైత్రి ఏర్పడింది. ద్రావిడ కజగం పెద్ద శ్రీ ఇ. వి. రామస్వామినాయకర్, ఒక 'శుద్ధ తమిళుడు' రాష్ట్ర ముఖ్యమంత్రి అయినందుకు తమహర్షాన్ని తెలియబుచ్చారు! అరవవారికి ఎలాగయితేనేమిటి ఒక శుద్ధ ద్రావిడ ముఖ్యమంత్రి దొరికాడు. మంత్రి వర్గం బ్రాహ్మణులనుంచి విముక్తిపొందింది!

కాంగ్రెసులో అధికారవర్గం మారింది. అన్ని స్థాయిలలోనూ ద్ర. క. నాయకులు, సభ్యులు కాంగ్రెసువారిగా అవతరించారు. ద్రా. ము. క. కొంచెం చిన్నబుచ్చుకుంది కాని, ఆలస్యంగా నయినా పరిస్థితిని అర్థం చేసుకుని ఒక కమ్యూనిస్టు ప్రతినిధికి ఎదురుగా శ్రీ కామరాజ్ ని బలపరచటానికి నిశ్చయించుకుంది.

కాంగ్రెసులో ద్రా. క. చేరిన తర్వాత దాని 'జాతీయవాదం జోరు' కొంచెం తగ్గినదనే చెప్పాలి. పైన పాత కాంగ్రెసు నాయకులే ఉన్నప్పటికీ, కింద మాత్రం 'నల్ల చొక్కా' నమ్మకాలు కలవారే ఎక్కువ మంది అయ్యారు. తమిళ భాషాభిమానం (లేక తమిళ భాషా దురభిమానం), కుల తత్వాలూ, తీవ్ర బ్రాహ్మణ ద్వేషం బాగా రెచ్చగొట్టారు. జాతీయ వాదాలకి ప్రతికూలంగా ఉండే పాఠ్య పుస్తకాలు ఎన్నో ప్రభుత్వం ఆమోద ముద్ర సంపాదించు కున్నాయి.

ఇక ప్రభుత్వంలో ద్రా. క. పలుకుబడి పెరిగిందనటానికి నిదర్శనం ఎన్నో పదవులలో ఎందరినో 'సీనియారిటీ'మీద కాక శ్రీ ఇ. వి. రామస్వామి నాయకర్ సిఫార్సుల మీద నియమించటమే. ఈ సంగతిని ఆయనే తన బహిరంగోపన్యాసాలలో చెప్పుకున్నారు. అప్పుడు 'డయిరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్' గా నియమితు డయిన వ్యక్తి ఒకప్పుడు ద్రా. క. నికి చెందిన మనిషే. అలాగే, 'డయిరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్' గా కూడా ఎందరో బ్రాహ్మణులని వదిలి, ఒక బ్రాహ్మణేతరుడిని నియమించారు. 'ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్' విషయంలోనూ ఇదే విధానాన్ని అవలంబించారు. ఈ హడావుడిలో ఎందరో ద్రా. ము. క. సభ్యులు తెలివిగా ద్రా. క. సభ్యుల కింద చెలామణి అయి పదవులని సంపాదించుకున్నారు. ద్రా. క. సభ్యుడనిపించుకున్న ఒక పోలీసు డిప్యూటీ కమిషనర్ నిజానికి ద్రా. ము. క. నికి చెందిన వ్యక్తి. స్కూళ్ళలో, పోలీసు కాన్‌స్టేబుల్ దశాలలో ద్రా. ము. క. పలుకుబడి ఇంతా అంతాకాదు. ఈ పోలీసువారందరూ ప్రభు

ద్రావిడ మున్నేట్ర కజగం అభివృద్ధి

త్వంలోని ద్రా.ము. క. వర్గాలని రక్షిస్తూ వస్తున్నారు— ఒకపక్క కమ్యూనిస్టులని వెతికి పట్టుకుంటూవుంటే.

జాతీయ దృక్పథంకల కాంగ్రెసువాదు లెందరో తమ ప్రాముఖ్యతని కోల్పోయారు. శ్రీ రామస్వామినాయకర్ అనుచరులు విచ్చల విడిగా బ్రాహ్మణులని హింసించటమే కాక, ఆయన బహిరంగంగా ఒకే వేదికమీద శ్రీ కామరాజ్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తూ భారత రాజ్యాంగాన్ని తగలపెట్టగలిగారు.

ద్రా. క. సహాయంతో కాంగ్రెసుబలం అధికం కాజొచ్చింది. కాని, ఇది ద్రా. ము. క. అధిక్యంతో పోల్చదగినదికాదు. అపసరణ సిద్ధాంతానికి అనుకూలమయిన వాతావరణం ఏర్పడటంతో ద్రా. ము. క. నికి ప్రజా బాహుళ్యంలో స్వతంత్రమయిన ఆధారం ఒకటి దొరికింది. ద్రా. క. నికీ, ద్రా.ము.క. నికీ సిద్ధాంత విరోధాలు చాలా తక్కువ. ద్రావిడ కజగం మధ్యలో 'ద్రావిడనాడు' వివాదాన్ని వదులుకుని 'స్వతంత్ర తమిళ రాజ్యం' కావాలనటం మొదలు పెట్టింది. ఇది అపసరణ సిద్ధాంతానికి విరుద్ధం కదా?

శ్రీ కామరాజ్‌ని బలపరచినకొద్దీ తమ పార్టీ ద్రా. క. లో కలిసిపోవచ్చుననే ప్రమాదాన్ని గుర్తించిన ద్రా. ము. క. నాయకులు ఆయనని బలపరచటం మానుకున్నారు.

తిరుచినాపల్లిలో ద్రా. ము క. సమావేశం జరిగిన సమయంలో ఒక నవ్వులు పుట్టించే పద్ధతిని అవలంబించారు — వచ్చినవారందరినీ ద్రా. ము. క. ఎన్నికలలో పాల్గొనాలా వద్దా అనే అడిగారు.

1957 లో ఎన్నికల సమయానికి పరిస్థితి ఇది: కాంగ్రెసు వారికి ద్రా. క. సహాయంవుంది. (నిజానికి ద్రా. క. నాడూ, నేడూ కూడా కాంగ్రెసులో ఒక విభాగమే.) కమ్యూనిస్టులు, ప్రజాసోషలిస్టులు సీట్ల విషయంలో ఒక ఒప్పందానికి వచ్చారు.

కాని నామినేషన్లు దాఖలాచేసే కొన్ని రోజులముందు కాంగ్రెసులో అల్లరి బయలుదేరింది. కొందరు 'కాంగ్రెసు రిఫారం కమిటీ' ఏర్పరచి కాంగ్రెసు ప్రతినిధులని ఎన్నికలలో ఎదిరించటానికి ప్రత్యర్థులని నెలకొల్పారు.

పోలింగ్ దగ్గిరకి వచ్చినకొద్దీ కాంగ్రెసుకి మెజారిటీ రాకపోవచ్చుననీ, ద్రా.ము.క. 'కాంగ్రెసు సంస్కరణవర్గం' తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పరచగలదనీ, రాజాజీ దాని నాయకుడు కావచ్చుననీ కొందరు వూహించారు. రాజాజీ కూడా ఈ వూహలు నిజం కావచ్చుననుకున్నట్లు కనిపిస్తుంది.



శాసనసభ నాయకుడు

ద్రా. ము. క. అవకాశవాదం

ద్రా. ము. క. లోని అవకాశవాదులు విజృంభించారు. శ్రీ అన్నాదురయి రాజాజీని కలుసుకున్నారు. ఆయన ఒకవైపు కాంగ్రెసుని ఖండిస్తూ మరొకవైపు ద్రా.ము.క.న్ని సూక్ష్మంగా పొగడటం మొదలు పెట్టారు.

ఫలితాలుమాత్రం ద్రా. ము. క. ఆశలని భగ్నం చేశాయి. కాంగ్రెసు సంస్కరణవర్గం ముఖ్య ప్రతిపక్షంగా వచ్చినా (21 సీట్లతో) ద్రా. ము. క. 15 సీట్లు గెలుచుకున్నా కాంగ్రెసుకే మెజారిటీ వచ్చింది. కమ్యూనిస్టులు తమ 14 సీట్లలో 10 వోడిపోయారు.

ద్రా. ము. క. నికి 17 లక్షల వోట్లు పడ్డాయి. వీటిలో అధికభాగం కాంగ్రెసు ద్వేషులవే.

ద్రా. ము. క. విజయాలలో చాలా వరకు మద్రాసునగరం, ఉత్తర, దక్షిణ ఆర్కాట్, చెంగల్పట్, సేలం జిల్లాలలోనే వచ్చాయని గుర్తించాలి. నగరం బయట వారికి వణ్ణియ, మొదలియార్ కులాల వోట్లు బాగా పడ్డాయి. వారు వెనుకబడిన ప్రాంతాలలో బాగా గెలిచారు.

ద్రా. ము. క. విజృంభణని చూసి కాంగ్రెసువారు బెదరలేదు. లేదుకదా, అపసరణ సిద్ధాంతవాదులని చూపించి కేంద్ర ప్రభుత్వాన్ని బెదరగొట్టేవారు. ధనికవర్గాలు ద్రా. ము. క. తో కమ్యూనిస్టులకి మంచి ప్రతికూలపక్షమే దొరికిందని సంతోషించాయి.

ద్రా. ము. క. కి మంచి దశ పట్టింది. ఆ పార్టీలోని కృత్రిమ మేధావుల వింత ధోరణులు ఒకతరం చిన్నవారికీ, వారిలోని యువ నేరస్థులకీ ఆదర్శాలయిపోయాయి. కమ్యూనిస్టులకి సంయితం ద్రా. ము. క.ని ఆశ్రయించటం అవసరం అయింది.

చారిత్రిక ఘట్టం

ఇదంతా ఇలా ఉన్నా ద్రా. ము. క. చరిత్రలో ముఖ్యఘట్టం ఇంకా రానున్నది. 1959 లో ఈ పార్టీ మద్రాసు నగరం కార్పొరేషన్‌ని కైవశం చేసుకుంది, కమ్యూనిస్టు సహాయంతో.

కాంగ్రెసులో దాగివున్న అపసరణసిద్ధాంత స్వరూపం బయటికిరావటం మొదలు పెట్టింది. 1962 ఎన్నికలలో ద్రా. ము. క. కి ముందుకన్నా రెండు రెట్లు వోట్లు పడ్డాయి. శాసనసభలో (ఎసెంబ్లీ) లో ప్రాతినిధ్యం మూడురెట్లు అయింది. మిగిలిన పార్టీలందరూ నష్టపోయారు.

ఎన్నికలముందు కమ్యూనిస్టు—స్వతంత్ర—ద్రా. ము. క. ఒప్పందం సాధ్యంఅనిపించింది కాని ఆతర్వాత ద్రా. ము. క. కమ్యూనిస్టులని వదిలి స్వతంత్రపార్టీతో మంతనాలు

'మెయిన్‌స్ట్రీమ్' నుంచి ప్రచురిస్తున్న వ్యాసాలలో యిది మూడవది



గొడ్డళ్ళా-గొడ్డళ్ళా

మౌల్వీ నసిరుద్దీన్ — కథలు

*మహీధర్ నళినీ మోహన్

ఒకరోజున కత్తిమొలలో దోపుకుని మౌల్వీ నసీరుద్దీన్ బజారువెంట నడుస్తున్నాడు. ఆరోజులలో ప్రభుత్వం వారి అనుమతిలేనిదే ఎవ్వరూ ఆయుధాలు ధరించకూడదు. దాచకూడదు. రాజభటులు మౌల్వీని పట్టుకుని తైమూరు దగ్గరకు తీసుకుపోయారు.

"మా అనుమతి లేకుండా ఆయుధాలు దగ్గర ఉంచుకోకూడదని నీకు తెలుసునా?"—రాజు ప్రశ్నించాడు.

"తెలుసుదేవర! కాని, ఇది నాకు చాలా అవసరం" అని మౌల్వీ జవాబు.

"ఏమిటో ఆ అవసరం?"

"మదరసా (మత పాఠశాల) లో చదువుకుంటున్నాను గనక దీని అవసరం అంతా ఇంతా కాదు"

"మత గ్రంథాలు చదువుకునే నీకు కత్తి ఎందుకూ?"

"ఆ పుస్తకాలలోఉండే తప్పులుసవరించడానికి."

ఆ పెడసరపు సమాధానం విని రాజు ఉగ్రుడయ్యాడు.

"పుస్తకాలలో ఉన్న తప్పులు కత్తితో దిద్దుతావూ? ఏ మాటలకి అర్థం ఏమైనా ఉందా?"

మౌల్వీ నిట్టూర్పు విడిచి ఇల్లా అన్నాడు.

"ప్రభువులు చిత్తగించాలి. మత గ్రంధాలలో ఉన్న అవక తవకలు చూస్తూవుంటే, వాటిని సవరించడానికి కత్తులుకాదుకదా, ఆఖరికి గొడ్డళ్ళా కూడా సరిపోవు అనిపిస్తోంది." ●

అపసరణ

ప్రారంభించింది. ద్రా. ము. క. 'దక్షిణ పార్శ్వానికి' జరిగినా ఈ మంతనాలు ఫలించ లేదు.

ద్రా. ము. క. కి మిత్రులు లేరనికాదు—ముస్లింలీగ్, రిపబ్లికన్‌పార్టీవారు సన్నిహితు లయ్యారు.

1962 ఎన్నికలలో పడిన వోట్లు లెక్కలని అనుశీలిస్తే ద్రా. ము. క. తెచ్చుకున్న వోట్లు 'ద్రావిడనాడు' సిద్ధాంతాన్ని బలపరచటానికిపడిన వోట్లు కావని తెలుస్తుంది. ఇవి ఎక్కువగా కాంగ్రెసుపట్ల అసంతృప్తులయినవారి వోట్లు. ఇవి కులతత్వాలనీ, ధన బలాన్నీ ఉపయోగించుకొనగా పడిన వోట్లు. ఎన్నికలలో 'ద్రావిడనాడు' నినాదాన్ని జాగ్రత్తగా తగ్గించుకున్నారు.

ద్రా. ము. క. మిత్రులు, ఆ పార్టీవారు, 'బొమ్మయితేనే గెలుస్తాం, బొరుసయితే మువ్వోడిపోయా'మని చేసిన ఒప్పందాల ఫలితంగా బాగా వోడిపోయారు. వీరి అపజయాలన్నీ ద్రా.ము.క.కి కలిసివచ్చాయి. ప్రాంతీయ విభేదాలు, కులతత్వాలూ, కొందరు కాంగ్రెసు నాయకులపట్ల వోటర్ల అసంతృప్తి — ఇవన్నీ కలిసి ద్రా. ము. క. ఎదురుచూడని చోట్లనుంచి వోట్లుపడేట్లు చేశాయి. ముస్లింలు, హరిజనులు, క్రైస్తవులు (ఏ కారణాలవల్లనో ఇంకా సరిగా తెలియదుకాని) కాంగ్రెసుకి తమ వోట్లు వెయ్యలేదు. స్వతంత్రపార్టీ తన అభ్యర్థులు లేనిచోట్లల్లా ద్రా. ము. క. ని బలపరిచింది.

అయినా ఈసారికూడా ద్రా. ము. క. విజయాలు సేలం, ఆర్కాట్, తిరుచినాపల్లి జిల్లాలలోని వణ్ణియప్రాంతాలకీ, తంజావూరు, మధుర జిల్లాలలోని వెనుకబడిన ప్రాంతాలకీ పరిమితం అయ్యాయి. ప్రజల అసంతృప్తిని వీరు వాడుకున్నారు. అంతే.

ఈ గెలుపులుమాత్రం అన్ని పార్టీలవారికీ కనువిప్పు కలిగించాయి. ద్రా. ము. క. రైతులకోసం, పారిశ్రామికులకోసం కృషి చేసిందని ఎవరూ అనలేరు. పార్టీ నాయకులు తాము వీరి ప్రతినిధులమని చెప్పుకున్నప్పటికీ, దాని ఆదర్శాలు స్వతంత్ర పార్టీ ఆదర్శాలకి దగ్గరగా ఉంటాయి. కుల మత దురభిమానాలని రెచ్చగొట్టే తిరోగమనవర్గాలతో సంబంధాలు పెట్టుకొనటానికి ఎన్నడూ ద్రా. ము. క. సందేహించ లేదు. అయినా, వామపక్ష నినాదాలని చాటుతూ ప్రజాదరణని సంపాదించుకొనగలిగేది. తంజావూరు రైతాంగంలో ఎంతో కృషి చేసి ఆధారం కల్పించుకున్న కమ్యూనిస్టులు వోడిపోయారు.

ద్రా.ము.క. అభిమానం అన ప్రవాహం ముందు కమ్యూనిస్టు, కాంగ్రెసు, ప్రజా సోషలిస్టు పార్టీల పలుకుబడి తట్టుకో లేకపోయింది.


తన పుట్టుపూర్వోత్తరాలపట్ల అభిమానమూ, సంతతిపట్ల ఆశలేని ఒక పార్టీ కాంగ్రెసుకి ప్రత్యామ్నాయంగా నిలవగలగటమేకాక మధ్యనున్న ఇతర పార్టీలని రూపుమాపగలుగుతున్నది. ద్రావిడ మున్నేట్ర కజగం విజయాల అర్థం ఇందులోనే దాగి ఉంది.

(సశేషం)

నాకు ఏమయింది చెప్మా?

నేను రోజంతా అలసిపోయి ఉండేదాన్ని. ఆ విరాకుతో కస్సుబుస్సుమని అపర కాళిలా ఉంటే నా దగ్గరకు ఎవరూ చేరేవారుకాదు.

నా అలసటకు కారణము మా డాక్టరు కనిపెట్టేరు. సరియైన పోషణ లేకపోతే యిలాగే అవుతుందన్నారు. నన్ను హార్లిక్స్ త్రాగమన్నారు.





హార్లిక్స్ నాకు శక్తి ఉత్సాహములను కలిగించింది. నేను మళ్లీ మామూలు దాన్ని అయేను. హార్లిక్స్ చేసిన మేలు మరవలేను!

పూర్తిగా పోషణలేక నిరుత్సాహముగా ఉంటే డాక్టర్లు హార్లిక్స్‌ను సిఫార్సు చేస్తారు పూర్తి మీగడగల పాలకుతోడు గోధుమపిండి, మాల్టెడ్ బార్లీల సారములుగల రుచియైన హార్లిక్స్ త్వరలోనే శక్తి నిస్తుంది.

హార్లిక్స్


అదనపు శక్తిని కలిగించును!





మితభాషి

* బాబూశీలం



లాక్ కుంజితో తాళం తీసాడు ప్రసన్న.

విసురుగా తోసిన తోపుకు తలుపు పోయి గోడకు కొట్టుకుంది. గోడసున్నం కాస్తగారి క్రింద పడింది.

గడపదాటి లోపల అడుగు పెట్టాడు ప్రసన్న. మట్టికొట్టుకున్న అతని బూట్లకు ఏదో మెల్లగా తగిలింది. ముందుకు వంగి దాన్ని తీసాడు.

కవరు!!

పురంధరదాసు స్మృతిచిహ్నంగా విడుదల చేసిన స్టాంపు కవరుమీద అతికించుంది. మధ్యాహ్నం మూడింటికి పోస్టుమాన్ పారేసి పోయాడల్లే వుందనుకున్నాడు. దానిలోని వార్తలకంటే ముందు వేడికాఫీ త్రాగాలనుకున్నాడు. ఆఫీసు నుండి వచ్చిన అలసట కారణంగా.

హెడ్డాఫీసులో హే చిన్నకారకుమస్తాగిరి చేస్తున్నాడు—ప్రసన్న! ఈ మధ్యనే ఎపాయింట్ అయిన కారణంగా కాస్త క్రొత్తగానేవుంది ఆఫీసు లైఫ్—

అసలు కారణం—

ఒమ్మూరిడిసి!.... సొంతూరిడిసి!!.... సింగరేణికిరావడం !!

స్టౌ ఆన్‌చేసి గ్లాసెళ్ళోట్టాడు. స్టౌకు దగ్గరగా స్టూలేసు కూర్చున్నాడు.

పోస్టులో వచ్చిన కవరు చించి చదవడం మొదలు పెట్టాడు—

"చిరంజీవి ప్రసూకు తల్లి దీవించి వ్రాయుట. మేమంతా క్షేమము. నీక్షేమము తెలుపు. నీవు అక్కడ ఒంటరిగా ఎలా వుంటున్నావు. మరీ ఒంటరిగావుండకు. నలుగురితో కలసి మాట్లాడుతూవుండు. నీవు బిడియంగా తలవంచుకు పోయినా అది అందరూ బిడియంగా గ్రహించరు. అక్కడెవరో లోకనాధంగారి కుటుంబం, నీకిచ్చిన క్వార్టర్ కివతలగా వుంటున్నారని వ్రాశావు గదూ?.... వాళ్లకు ఇద్దరాడపిల్లలూ, ముగ్గురు మగపిల్లలూనా. సరే!.... మంచిది. నీవు కనీసం వాళ్ల మగ పిల్లలతో నన్నా మాట్లాడుతూ వుండు. ....."

ప్రసన్న నెవరో పట్టి పిండినట్టుయింది— పదంతస్థుల భవంతిపైనుండి ఎవరో క్రిందికి గుంజినట్టయింది—తనున్న క్వార్టర్ కప్పుతో సహా పాతాళానికి పోతున్నట్టయింది.

తల్లి వ్రాసిన మాటలు బాకుల్లా గుచ్చుకున్నయి ప్రసన్న హృదయానికి. 'కనీసం వాళ్ల మగ పిల్లలతో నన్నా మాట్లాడుతూ వుండు.....' అవేమాటలు మరోసారి చాటాయి అతని మదిలో పాతుకు పోయిన పిరికితనాన్ని.

చీకటి రాత్రిలో రేడియంలా అగుపిస్తున్నయి— కాదు, వెక్కిరిస్తున్నయి అవేమాటలు. 'పోస్టుమాన్ పుణ్యమాఅని ఇది నాచేతికే చిక్కింది. ఇదే గనుక ఇతరులు చదివుంటే?....' ఇంక ఆలోచించ లేక పోయాడు ప్రసన్న. బెదురు బెదురుగా బయటకు చూశాడు. బడినుంచి అలసిన ముఖాలతో ఇళ్లకు పోతున్న ఆడపిల్లలు ప్రసన్న క్వార్టర్ కేసి చూస్తూ పోతున్నారు. 'ఆడాళ్లు సిగ్గుపడే రోజులు పోయాయి!' అనుకున్నాడు ప్రసన్న!

*　　*　　*

చిన్న నాటి నుండి మితభాషిగా వున్న ప్రసన్న నిజం చెప్పాలంటే పెరిగినకొద్దీ పిరికివాడయి పోయాడు. ఆ పిరికితనం ఎలాంటిదీ అంటే.... తారస పడినవాళ్లను తలెత్తి చూళ్లేడు. ఖర్మవశాన తలెత్తినా తప్పుకు పోతాడు. అంటే!.... కేవలం

ఆడాళ్లు తారసపడితేనే తలెత్తక పోవడం కాదు. మగాళ్లయినా అంతే?....

కొందరు కుర్రాళ్లకు ప్రసన్నను పలుకరించడం హాబీగా వుండేది చదువుకునే రోజుల్లో. పోతున్న ప్రసన్నను పనిగట్టుకొని ఆపి పలుకరించేవారు, "ప్రసన్నా!.... విశాఖపట్నం తెలుసా నీకు?" అని. తెలుసన్నట్టు తలవూపే వాడు ప్రసన్న అమాయకంగా.

"ఆ వూళ్లో వో ముఖ్యమయిన ఆస్పత్రి వుంది చూశావా?" అంటూ అడిగే వాడొకడు.

"చూసుండడులే. చూస్తే ఎంచక్కా అక్కడనే ట్రీట్‌మెంట్ తీసుకొనేవాడు.." అనే వాడు వేరొకడు.

"మెంటల్ ఎఫెక్టే నంటావా ?" మరొకడు ఇంచక్కా శృతి కలిపేవాడు.

"మరి కాకుంటే?" ఘొల్లున నవ్వుతూ పొయ్యేవాళ్లు కుర్రాళ్లంతా.

ఇక ఇంటికివస్తే సరేసరి—

పెట్టి పిలిస్తే సరి. లేకుంటే అమ్మనయినా సరే ఆకలని అన్నం అడిగేవాడు కాదు. ప్రసన్నకన్నం వడ్డించి ఎదురుగా కూర్చునేది వాళ్లమ్మ—తాయారమ్మ! .... "అదేవిటిరా? అంత తడిపొడిగా తింటావు. వంకాయకూర నీకిష్టమేగా వత్తుగా కలుపుకో!..... ఆపచ్చడిలో ఇంత నేతి చుక్క వేయనీ!.... మరీ ఇంత మలివురు పేవిటి. మజ్జిగన్నం తినకుండా చేయి కడుక్కు చక్కాపోతావు. సరే!....గ్లాసులో పోసిస్తా కాస్తాగు" అలా అతని ప్రతి కదలికా గమనిస్తుండేది.

ఏదేనారోజు పనిమీదవుండి 'అన్న కన్నం పెట్టమ్మా' అని కూతురు కమలకు పురమాయించిందంటే, నవలాలోకంలో వున్న కమల చదివిన మట్టుకు చాలి స్తానికి మనసొప్పక చదువుతూనే వంట గదిలో కొచ్చేది, "రాధ కృష్ణుడిలో భాగం, కృష్ణుడు రాధలో రూపం, అబ్బ! ఏం రాసిందిరా, లత! అ .... ఏది, ఆకంచమిలా అందుకో— అన్నం వడ్డిస్తా"

'ఇదోపుస్తకాల పురుగు!' షెల్ఫ్‌లో వున్న కంచం తెచ్చి చెల్లెలి కిచ్చేవాడు ప్రసన్న, చేసేదిలేక.

అన్నం వడ్డించేసి "మళ్లీ కోపా ఏ మందుకుంటావులే గాని, కంచంలోనే వేసేస్తున్నాను కూరగూడా!" జవాబుకన్నా ఎదురు చూడకుండా ఆ కూర కాస్తా కంచంలోనే వడ్డించి, "గ్లాసెక్కడపెట్టాలో కిట్టమ్మాకో, గొంతు పట్టేను. మారన్నానికి అమ్మని పిలువు" అంటూ లతలో లీనమయి పోయేది కమల.

కంచం దగ్గరకు తీసుకొని, నాలుగు మెతుకులు కతికి, లేచక్కా పోయేవాడు ప్రసన్న!

తాయారమ్మ వచ్చి కంచంలో కూడు కంచంలోనే వుండటం, ప్రసన్న చేయి కడుక్కు చక్కాపోవడం చూసి విస్తుపోయేది.

'పిచ్చి ప్రసు!' అనుకుంటూ కమల దగ్గర కెళ్లి, "ఏమే కమల! ఎప్పుడూ పుస్తకాల లోకమేనా. వాడిక్కాస్త అన్నం పెట్టమంటే ఏవిటే పెడసరం?" కమల చేతిలో పుస్తకంలాగి ప్రక్కకు విసిరేది తాయారమ్మ.

కమ్మని కల చెదరి పోయినట్టు ఉలిక్కి పడి లేచేది కమల. ప్రక్కకు విసరిన పుస్తకాన్ని తీసి పైటకొంగుతో దులుపుతూ, 'అన్న కన్నం వడ్డించే వచ్చాను. నీలా వాడు తినేదాకా ఎదురుగ్గా కూర్చోవాలేం?.... అలా నాతరం కాదు—పార్వతి లాంటి పిల్లనొకదాన్ని చూసి మూడు ముళ్లేయించు. ఈయన గారి కెదురుగ్గా, ఆవిడగారే కూర్చుంటుంది ఏప్రొద్దూ కోడలొస్తే నీక్కాస్త శ్రమా తగ్గుతుంది,' మళ్లీ పుస్తకంలో పడేది కమల.

"ఆ పుస్తకాలు అఘోరించ బట్టే ఇన్నిన్ని మాటలు. అసలు వాడిక్కాదే! ఆమూడు ముళ్లూ ముందు నీకేయించాలి."

'పార్వ' తన్న పదం వినగానే తాయారమ్మ మదిలో ఒక్కసారి మెరుపు మెరిసినట్టు మెరిసేది— పార్వతి! తాయారమ్మ అన్న శంకరం గారి కూతురు పార్వతి— చిన్నప్పటి నుండీ ప్రసన్నకు పార్వతినిచ్చి చెయ్యాలని తాయారమ్మ తహ తహలాడేది— పార్వతంటే పడిచచ్చేది. పుత్తడి బొమ్మలా వుండే పార్వతిని 'ఏమే పారూ బావను చేసుకుంటావా?' అంటే 'పో అత్తయ్యా!' అంటూ సిగ్గుతో ప్రక్క గదిలోకి పారిపోయేది. సిగ్గుపడ్డ పార్వతి ముఖం 'ప్రసూ బావనిడిసి పరాయోణ్ణి చేపడతానా' అన్నట్టుండేది తాయారమ్మకు.

ప్రసన్న, పార్వతి చేయి చేయి పట్టి ఇల్లంతా తిరుగుతుంటే మురిసిపోయేది— తాయారమ్మ! ముచ్చటే పడి వో రోజున ఫోటో కూడా తీయించింది— వాళ్లిద్దరినీ కలిపి. చిరునవ్వు లొలక బోస్తున్న పార్వతి ప్రసన్నలను చూసి "పార్వతి పరమేశ్వరుల్లా వున్నార్రా!" అనేది అన్న శంకరం గారితో. "కాదని ఎవరన్నారే?" అనేవారు శంకరం గారు నవ్వుతూ.

ప్రమోషన్‌తో బాటు శంకరంగారికి హైదరాబాదు బదిలీ అయ్యేసరికి, కలిసివున్న కుటుంబాలు విడిపోతున్నట్టే బాధపడ్డారు తాయారమ్మగారు. పార్వతి తల్లి నాగమ్మగారిని కూడా ప్రమోషన్ వచ్చిందన్న సంతోషం వోప్రక్క, బదిలీ అయిందన్న బాధ మరో ప్రక్క కలచివేశాయి.

శంకరం గారిని బండి ఎక్కించడానికి స్టేషన్ వరకూ వచ్చారు ప్రసన్న, తాయారమ్మ.

నేరుగా హైదరాబాదు పోయే కంపార్ట్‌మెంట్‌లో ఎక్కి కూర్చున్నారు శంకరం గారు, నాగమ్మ, పార్వతి. కిటికీకి దగ్గరగా ప్లాట్‌ఫామ్ మీద నిలుచున్నారు తాయారమ్మ, ప్రసన్న.

"పొంగానే వో వుత్తరం వ్రాయండి! క్రొత్తప్రదేశం— అమ్మాయి జాగ్రత్త!!" కళ్లల్లో నీళ్లు పైటకొంగుతో ఒత్తుకొంటూ, "పారూ! అత్తయ్య కొక ముద్దివ్వవూ?" కిటికీ లోపలకు చేతులు జాచి అంతలోకే వెనక్కు తీసుకుంది గార్డ్ విజిల్ శబ్దం విని, తాయారమ్మ.

రైలు కదిలింది—

కదులుతున్న రైలు కిటికీలోనుండీ చేయూపింది— పార్వతి!.... అప్రయత్నంగా చేయూపాడు-- ప్రసన్న!.....

తూలి పడబోయిన తాయారమ్మ ప్రసన్నను ఆసరాగాచేసుకు తేరుకుంది.

రైలు స్టేషన్ దాటింది—పార్వతితో పాటు తాయారమ్మ సర్వస్వాన్నీ తీసుకుపోయింది— రైలు! పలుచబడి పోయింది ప్లాట్‌ఫామ్!!

"అమ్మా! ఇక ఇంటికి పోదాం" ప్రసన్న తల్లిముఖంకేసి చూళ్లేక పోయాడు.

బిక్కు బిక్కు మంటున్న బంధరు స్టేషన్ విడిచి భాస్కరపురంలో ఇంటికి చేరారు వాళ్లిరువురూ రిక్షామీద.

కళ కళ లాడుతూండే ఆ ఇంట్లో కారుచీకట్లు అలముకున్నాయి. ప్రతి వస్తువు పార్వతినే జ్ఞప్తికి తెస్తుంది. తోడు లేని పక్షిలా ఒంటరివాడయి పోయాడు

ప్రసన్న. "ఈ వేళప్పుడు అక్కడ పార్వతి ఏం చేస్తుందంటావు?" తాయారమ్మ గారు అడిగేది పచ్చడి అన్నంలో నేతిచుక్క వేస్తూ ప్రసన్నను. ప్రసన్న కెందుకో సిగ్గనిపించేది. తాయారమ్మ కేసి వోసారి చూసి తలదించుకునే వాడు.

"ప్రతిరాత్రి పార్వతి కలలో కనిపిస్తుందిరా! ఎలావుందో ఏమో? వాళ్ళు వెళ్ళింది లగాయితు ఉత్తరాలన్నా వ్రాయడం లేదేవిటి?" మారన్నం వడ్డించి మళ్ళీ అనేది తాయారమ్మ. "రేపు వో కవరు మీద మామయ్య వాళ్ల అడ్రస్ వ్రాసివ్వు. వాళ్ళకు తీరిక లేకుంటే పార్వతితో నన్నా వో ఉత్తరము వ్రాయించమని వ్రాస్తాను."

"అలాగే నమ్మా!" అనేవాడు ప్రసన్న మజ్జిగ అన్నం కలుపుతూ.

* * *

దినం మీద దినం దూకుడుగా దొర్లుకు పోతున్నయి! కాలండర్లలో కాగితాలతో పాటు కాలండర్లే మారి పోతున్నయి!! చిన్నవాళ్ళు పెద్దవాళ్లవు తున్నారు— పెద్దవాళ్ళు మరీ పెద్దవాళ్లవు తున్నారు— మరీ పెద్దవాళ్ళు మరో లోకానికి పోతున్నారు!!! హృదయం చుట్టూ స్పాట్ లైట్స్ వేసిచూసినా అణువంతయినా అనురాగం అగుపించని హృదయాలే అందలమెక్కి కూర్చుంటున్నయి.

వృత్తుల్లో హోదాలు పెరుగుతున్న కొద్దీ వ్యక్తుల్లో భావాలు మారుతూ వుంటాయి. ఆ భావాల కనుగుణంగా మసలు కుంటాడు మానవుడు. అలాంటి సమయంలోనే కొందరు ఆప్తుల్ని సైతం ఆదరించలేక పోతారు. ఆదరించిన వారిని విస్మరిస్తుంటారు. మాయలు—మంత్రాలు— మోసాలు — మరెన్నో కుతంత్రాల కాలవాలం, ఆ హోదా!

శంకరంగారికి, తాయారమ్మకు ఎలాంటి రాక పోకలు గాని, ఉత్తర ప్రత్యుత్తరాలు గాని లేవు. అన్నింటికీ అనకట్ట కట్టింది శంకరంగారి— హోదా!

ఎన్ని ఉత్తరాలు వ్రాసినా శంకరం గారి దగ్గర నుండి జవాబురాకుండే సరికి విసుగుపుట్టి ఉత్తరాలు వ్రాయటం చాలించింది. ఇక అన్న శంకరం గారు తాయారమ్మ స్మృతిపథం నుండి తొలగి పోయారనే చెప్పచ్చు.

గతంలో తగిలిన గాయం మాసి పోయి చర్మంతో కలిసి పోతుంది.

మితభాషి

కమల మెట్రిక్ పూర్తిచేసి షార్కీ స్కూల్లో సెకండరీ ట్రెయినింగ్ చదువుతుంది. ఇక ప్రసన్న కాలేజీ చదువు ముగించబోతున్నాడు.

"అమ్మా !" కాలేజీనుండీ పరుగు పరుగున వచ్చాడు ప్రసన్న: "రేపు మామయ్య మన వూరు వస్తున్నారమ్మా. ఇదిగో చూడు!" ఏదో కాగితం చూపించాడు తాయారమ్మకు.

"ఎవరు? .... శంకరం మామయ్య, నిజంగా? ఏది, మనకే రాశాడా?" నమ్మనట్టు ప్రశ్నించింది తాయారమ్మ కొడుకు చేతిలో కాగితాన్నందుకొంటూ.

ప్రసన్న ముఖం ప్రక్కకు త్రిప్పు కున్నాడు, "మనకెందుకు వ్రాస్తారమ్మా. రేపు జిల్లా పరిషత్ ఆడిటోరియంలో మీటింగుందట, దానిలో మామయ్య ప్రసంగిస్తారట. కాలేజిలో వో కుర్రాడి దగ్గర ఈ ఆహ్వాన పత్రికవుంటే నీకు చూపుదామని తెచ్చాను" అన్నాడు బాధగా.

"అంటే!..... పార్వతీ, నాగమ్మ కూడా వస్తున్నారా ?" ఆత్రుతగా అడిగింది తాయారమ్మ. 'ఇప్పుడెంత పెద్దదయి పోయిందో పార్వతి.'

"ఏమో?" ప్రక్క గదిలోకి పోతూ అన్నాడు ప్రసన్న "రేపు టి. బి. కెళ్ళి కనుక్కుంటేగాని తెలీదు."

ఆరాత్రి తాయారమ్మకు కంటిమీద కునుకేలేదు. శంకరంగారు, నాగమ్మ, మళ్ళీ చేరువవుతున్నట్టే సంబరపడి పోయింది. పార్వతే కళ్లల్లో మెదిలింది.

పార్వతీ, ప్రసన్నా కలిసి దిగిన చిన్నప్పటి ఫోటోతీసి లాంతరు వెలుతురులో చూసింది. కల్లాకపటం ఎరుగని పార్వతి కళ్లల్లోకి చూస్తుంటే ఆమె కళ్ళు చెమర్చాయి. చెమర్చిన ఆమె కళ్ళు వో కన్నీటి చుక్కను ఆ ఫోటోపై రాల్చాయి. లాంతరు వెలుతురులో తళుక్కుమంది ఆ కన్నీటి చుక్క! ఆమె కన్నీటిని చూసి ఆమే తొట్రుపడింది— తొట్రుపడ్డ తాయారమ్మ మదిలో కలవరం మొదలయింది.

తన అంతర్వాణి అంటుంది, "ఇప్పుడు నీ అన్న వో ఉన్నతాధికారి. అందలమెక్కిన నీ అన్న నీకందుతాడను కున్నావా?..... పార్వతిని నీ ప్రసన్నకిచ్చి కట్టబెడతాడను కున్నావా?..... పేరాసకు పోకు పిచ్చిదానా!"

తన నీడ తనకే నాగుపాములా అగుపడింది, "నా అన్న కూతుర్ని నా కొడుక్కిమ్మనడం పేరాసా?" తనలో తనే గొణుక్కుంది.

కలక్టరేట్ లో నాలుగ్గంటలు కొట్టారు!.. గొంతంతా చించుకుంటూ అరుస్తుంది రైలుకట్ట కవతలగా వో నక్క. గొంతెత్తి కూయబోయిన కోడిపుంజా కిమ్మనకుండా నక్కింది—ఆనక్క అరుపుకు. షార్కీ స్కూల్ హాస్టల్ పిల్లల్ని లెగ్గొట్టేస్తుంది మ్యాటినమ్మ గంటలు మ్రోగిస్తూ.

తాయారమ్మ లేచి మధ్య గదిలో కొచ్చేసరికి, ప్రసన్న పుస్తకం పుచ్చుకు కూర్చుండటం చూసి, కమలను కూడా లేపి తను పొయ్యి రాజబెట్టడానికి వంట గదిలోకి పోయింది.

ఆరోజు ఉదయం టి. బి. కెళ్ళి కనుక్కున్నాడు ప్రసన్న— శంకరం గారి విషయం. శంకరంగారు కుటుంబంతో సహా వచ్చినట్టు, తెల్లారగట్టే సముద్ర స్నానానికి వెళ్ళినట్టూ తెలిసింది అక్కడి పని వాడి ద్వారా. ఆరోజు కాలేజీకెగనామం పెట్టి జిల్లాపరిషత్ ఆడిటోరియం వద్దకెళ్ళాడు ప్రసన్న.

అధునాతనంగావున్న ఆడిటోరియం; పగలే వెన్నెలలా ఆయిల్ పెయింట్స్ తో ముచ్చటగా వుంది— మెర్క్యురీ దీపాలతో మెరిసి పోతుంది. శబ్దం చేయకుండా తమపని తాము నిర్వహిస్తున్నయి పకడ్బందీగా— పంకాలన్నీ. కుషన్ కుర్చీల్లో కూర్చుంటున్నారు ఆహ్వాన పత్రిక లందు కున్న ఆఫీసర్లంతా.

ఆహ్వాన పత్రికల్లేని వాళ్ళు కిటికీల కివతలగా నిలుచున్నారు. వాళ్ళల్లో కలిసి పోయాడు ప్రసన్న.

స్టేజిమీదికి వచ్చాడు సభాధ్యక్షుడు! పూల మాలలతో ముంచెత్తారు పుర ప్రముఖులు!!

చప్పట్లు చరిచారు అంతా—

"ఇప్పుడు సభాధ్యక్షుడు శంకరంగారు మాట్లాడుతారు." ఎవరో చెప్పారు కాదు, అరిచారు మైక్ లో, మూడూళ్ళకి వినిపించేలా.

"లేడీస్ అండ్ జంటిల్ మన్!" పూల మాలలు ప్రక్కకు పెట్టి ప్రసంగిస్తున్నాడు శంకరంగారు. బహుశాంతంగా వుంది ఆయన కంఠం. అంతవరకు

పూల మాలలో మునిగిన వ్యక్తి వాళ్ల శంకరం మామయ్యేనని గుర్తించని ప్రసన్న తెలిసి ప్రాణ్నడి పోయాడు. మరి కొంత సేపటికి తేరుకొని తిన్నగా ఇంటిదారి పట్టాడు. 'మారి పోయిన మామయ్యను చూశానని అమ్మకుచెప్పాలి' అనుకుంటూ.

ప్రసన్న వాళ్ల ఇంటి ముందు ఆగున్న కారును చూసి కొంచెం సందిగ్ధంలో పడ్డాడు. 'ఎవరు చెప్మా!' అను కుంటూ లోపలకు పోబోతుండగా, గుమ్మందాటిన ప్రసన్న గుండెలు గుబేలు మన్నయి.

గుమ్మానికెదురుగ్గా కుర్చీలో కూర్చొనుంది, తొలియవ్వనంలో వున్న వో తరుణి! పదిహేడేళ్ల ప్రాయంలో వుంది, పలుచగా కేశాల్ని నొసటిపై కొదిలి పాపిడిలేకుండా పైకి దువ్విన శిరోజాలు, అలంకరించుకొన్న తీరు చూస్తుంటే ఎవరో హిందీ తారను జ్ఞప్తికి తెస్తుంది!! ఎర్రని విశాలమయిన నొసటి మీద, ముంగురుల మధ్యనుండే, నల్లటిరంగు తిలకం ఇట్టే అగుపిస్తుంది!..... ముచ్చటయిన ఆమెడలో తెల్లటి పూసలదండ అందమయిన ఆ వక్షంమీద అల్లనల్లన నర్తిస్తుంది. జిగేల్‌మంటున్న జార్జెట్ చీర జారిపోతుందేమో నన్నట్టుంది. జారుతున్న జిలుగు పైటను సదరుకో లేక సత మత మవుతుంది. తెల్లని రవిక గుండా బ్రాస్‌రేడియంలా అగుపిస్తున్నయి. అబ్బ!...... అందానికి అందంగావున్న అలాంటి అమ్మాయి ప్రసన్నకు తారస పడడం అదే ప్రథమం గాని, 'అంత అందాన్ని కళ్లారా చూశాడా?' అన్నదే అపనమ్మకం.

వెనక్కు మళ్లటానికి మన సొప్పక ముందుకు పోవడానికి ధైర్యంచాలక, అక్కడే నిలుచుండి పోయాడు తల దించుకుని ప్రసన్న.

"హల్లో ప్రసన్నా! హౌ అర్ యూ?"

పాలనురగలాంటి ఆ పడతి పలుకులకు పిచ్చెక్కి పోయింది ప్రసన్నకు. గిరుక్కున వెనక్కు తిరిగ డు గుండెలు బిగబట్టి.

"ప్రసూ!" తాయారమ్మ పిలుపుకు ఇటుగా తిరిగాడు ప్రసన్న. అంతవరకు ఆ అమ్మాయి ప్రక్కన తాయారమ్మ, కమల వున్నట్టే తెలీలేదు ప్రసన్నకు. "గుమ్మం దగ్గరే ఆగావేం?.... గుర్తించలా?..... మన పారురా!... ఇప్పుడే వచ్చింది." తల్లి మొఖంలో ఏదో క్రొత్త కళ ద్యోతక మయింది ప్రసన్నకు.

"పార్వతా?" తలఎత్తి ఆ మూర్తి కేసి వోసారి చూసి తలదించుకొని తల్లి ప్రక్కకెళ్లి నిలుచున్నాడు ప్రసన్న, 'అత్తయ్య రాలేదా పార్వతీ?" తల దించుకొనే అడిగాడు తిరిగి.

"అదేరా ప్రసూ!.... నేనూ అడుగుతూంట!" తాయారమ్మ ప్రసన్నకు చెప్పుతూండగానే పార్వతి అందుకుని, "ఉదయం సముద్రస్నానానికి వెళ్లి అలసిపోయారు మమ్మీ. అందుకనే నేనొక్కర్తినీ ఇలా రావల సొచ్చింది" అంటూ ప్రసన్న కేసి పరీక్షగా చూసింది. అతని అమాయకతకు లోలోన నవ్వుకుంది.

తాయారమ్మ, కమల, ప్రసన్న ముగ్గురూ మవునంగానే వింటున్నారు.

"అత్తయ్యా!" పార్వతి మెడలో పూసల మాలను కుడిచేతి చూపుడ్రవేలితో త్రిప్పుతూ, "ప్రసన్న నింత పిచ్చివాడిగా పెంచావేం?.... ఇంటిలోనే ఇంతబిడియంగా వుంటే ఇక బయటకుపోతే ఏంచేసా డు?" అంది.

కొడుకును 'బావా!' అని పిలిచే పార్వతి, ఇప్పుడు 'ప్రసన్న!' అని సంబోధిస్తుంటే వినలేక విస్తుపోయింది ఆ పిలుపుకు తాయారమ్మ.


"కమలా! ఇప్పుడు మవ్వేం చేస్తున్నావు?" పార్వతి ప్రశ్నించింది మవునంగా వున్న ఆముగ్గురి మొఖాలకేసి మార్చి మార్చి చూస్తూ— కమలను

కమల కళ్లింతచేస్తూ, "సెకండరీ ట్రెయినింగ్ చదువు తున్నాను. సెకండియరిది" అంది, మావూను సెకెందుకన్నట్టు ముక్తసరిగా.

"డామిట్!.... సెకండియరయి పోగానే స్కూళ్లల్లో కెళ్లి 'అ, ఆ' లు నేర్పుతావా! డర్టీ కీచర్!!" ఆవేశంగా అంది పార్వతి ఆవిడ పామ్మేదో ఒరిగి పోతున్నట్టు.

ప్రసన్న విషయం కూడా అడిగి తెలుసుకుంది. "ప్రసన్నా! మీ కాలేజీలో కూడా ఇలా బిడియంగానే మసలుతావా?..... అసలు నీకు నామకా వోగరల్ ఫ్రెండయినా వుంది?.... ఆ .... ఎలా వుంటారులే. నీకు మరదల్ని చూట్టానికే సిగ్గాయె! పైగా పరాయి పిల్లలతో, అందునా కాలేజీ పిల్లలతో స్నేహమంటే, కడలి ఈదడమే నన్నట్టుంటుంది— నీకైతే!" మళ్లీ తాయారమ్మ కేసి చూస్తూ ఇలా అంది "నాకొక అనుమానం అత్తయ్యా!.... ప్రసన్న ఇలా బిడియంగానే పెరుగుతూంటే— కాదు, నీవు పెంచుతూంటే, పెళ్ళికో కాబోయే పెళ్లానికి కట్టవలసిన తాళి ప్రక్కనే వున్న పురోహితుడి మెళ్లో కడతాడేమోనని......" ఏదో అర్ధోక్తిలో ఆపింది, మురిపెంగా నవ్వుతూ పార్వతి! టూత్ పేస్టు ఎడ్వర్టయిజు మెంట్‌లో అందమయిన అమ్మాయి పలువరస ప్రకాశిస్తున్నయి— పార్వతి పళ్లు!! ఆ గదిలో వ్యాపిస్తున్న గాలంతటిలో కలిసిపోయి మత్తెక్కిస్తుంది, ఆమె బట్టల గుండావస్తున్న ఖరీదయిన సెంట్ వాసన!!!

మిగిలిన ముగ్గురికీ కొంచెం ఇష్టం కలిగించినా, పార్వతి తృప్తికన్నా పై మాటలకు నవ్వకుండ వుండలేకపోయారు.



పార్వతి చేతికున్న బుల్లివాచ్‌లో ముళ్ళు చూసుకొని, వెళ్తానంటూ లేచింది.

పార్వతితో పాటు తాయారమ్మ, కమల, ప్రసన్న, కారు దగ్గర కొచ్చారు.

పార్వతి చుట్టూ కలియ జూస్తూ, "అత్తయ్యా! ఇది వరలో ఇదంతా పచ్చగా వుండేది. ఇప్పుడు పుట్ట గొడుగుల్లా పుట్టుకొచ్చా ఏం, బుల్లి బుల్లి డాబా లివ్వన్ని. ప్చ్.... ఒక్క దానికీ షేపుం డదు" అంటూ కారులోకెక్కి కూర్చుంది. డోర్ తెరచి డ్రైవర్ కూడా ఎక్కాడు

కారు కదిలింది—

ముగ్గురికేసి చూస్తూ నుచ్చటగా నవ్వింది పార్వతి. నిలుచున్న ముగ్గురూ చిత్ర ముగ్గుల్లా నిలుచున్నారు, కళ్ళా ర్పకుండా కారు, క్రిందనున్న దుమ్ము పార్వతి కేసి చూస్తున్న ముగ్గురి మొఖాల మీదా కురిపించి, ముందుకు దొచ్చుకు పోయింది.

అప్పటిగ్గాని రెప్పవేయలేదు - ఆ ఆరు కళ్ళూ!!!

మానుతున్న గాయం మళ్ళీరేగింది

బంగాళాఖాతంలో వాయుగుండం బహు వేగంగా ప్రయాణిస్తున్నట్టు, తాయా రమ్మ ఎదలో తీరని తృష్ణ పురకలు వేస్తుంది.

ఎట్టకేలకు రానే వచ్చింది—

తుఫాను!

తాయారమ్మ ఎదలో!!

తాయారమ్మ మంచం పట్టింది. తారు మారయ్యాయి పరిస్థితులు.

కమల సెకండరీ సెకండియర్ ముగి సింది. పేపరులో తన నంబరు చూసి మురిసింది. కమల మీద వున్న మక్కువ కొద్దీ, అదే స్కూల్లో ఎపాయింట్ చేశారు హెడ్మిస్ట్రస్.

ప్రసన్న పరీక్షలయి పోయాయి. ఫస్ట్ క్లాస్ రాకున్నా 'పాస్' అని పించు కున్నాడు. అన్ని ఆఫీసులకు ఎప్లయి చేస్తూ సింగరేణి కాలరీస్‌కు కూడా ఒక అప్లికేషన్ పంపాడు. అదృష్టం కలిసొచ్చి క్రొత్తగూడెం హెడ్డాఫీసులోన హో గుమస్తా గిరి దొరికింది.

క్రొత్త ప్రదేశం, భోజనానికి బాధ పడతావన్నా కాదూ కూడదని తల్లిని ఒప్పించి ఈ వూరు చేరాడు ప్రసన్న.

* * *

పొంగిన నీళ్ళలో చెంచాడు 'నెస్‌కేఫ్' కాఫీ పొడరు వేసి కలిపాడు ప్రసన్న.

వింతభాపి

స్టౌ ఆఫ్ చేసి కాఫీ త్రాగాడు!!

తలుపుకు తాళంవేసి బయటకు వచ్చాడు!!!

అలసి పోయిన భానుడు పశ్చిమానికి పరుగు లిడు తున్నాడు. ఒ క్షణంకోసం పొంచి కూర్చున్న కలువ ప్రియుడు వేడెక్కిన యీ ప్రకృతికి వెన్నెల నంది స్తున్నాడు వెన్నెల చల్లదనానికి ప్రకృతి ప్రియురాలు పరదా తొలగిస్తుంది.

హోటల్ భోజనం ముగించి క్వార్టర్‌కు వస్తున్నాడు ప్రసన్న.

'స్పెషల్' బస్సులో 'భద్రాచలం' పోతున్న భక్తులు 'దేవుడి దర్శనాని కింకెంత దూరం?' అన్నట్టు చూస్తు న్నారు, దూరాన అగుపిస్తున్న దీపాలకేసి. స్టేషన్‌లో టిక్కెట్టు కోసం రైలాట ఆడుతున్న ఆసామి, 'కవుంటర్ దర్శ నాని కింకెంత దూరం?' అన్నట్టు ముం దున్న ప్రయాణీకుల 'క్యూ' కేసి చూస్తు న్నాడు చర్చిపైన శిలువ నరుని మూర్ఖ త్వానికి ముద్రగా నవ్వుతుంది. క్రొత్తగా కడుతున్న వాటర్‌టాంకు దగ్గర రాత్రిళ్ళు కూడా పనిచేయిస్తున్నారు లంబాడీ లేబర్‌తో కంట్రాక్టర్లు. పోలీస్ స్టేషన్‌లో నిజం చెప్పని దొంగను మధ్య నిలుచుండ బెట్టి, చుట్టూ నిలుచున్న పోలీసులు చితుక్కింద తంతున్నారు. దెబ్బలకు తాళలేక దొంగ అరుస్తున్న అరుపులకు బాబూ క్యాంప్‌లో జనం బెంబేలయి పోతున్నారు!!..... దూరాన కొండల మీద అర్ధాంతరంగా రేగిన అగ్నికి అడవంతా ఆహుతయి పోతుంది— ఆమంట లిక్కడి కగపిస్తున్నయి!!..... శ్మశాన వాటికలో శవాల్ని కాల్చుతున్నట్టు సున్నపుబట్టీలు రగులుకుంటున్నయి—పొగ లు గ్రక్కుతూ. ... 'మావ్‌లాంటి కవిగనక ఈ పొగల కేసి వోసారి చూస్తే ఎలాంటి కవిత వ్రాసేవాడో?...... నిజం!.... హో కళా ఖండాన్నే సృష్టించి తీరేవాడు. అవును! కాలిపోతున్న ఇళ్ళ పొగలకేసి చూస్తూ కవిత వ్రాస్తా' నని మావ్మెగా ఉన్నాడు. ఆ పైకెగబ్రాకుతున్న పొగల అందాన్ని ఎందుకూ పనికిరాని వాళ్ళు ఎప్పిసార్లు చూస్తే ఏం?.... ఉద్ద వేస్ట్.... !!'

మావ్ కవితను గూర్చి ఆలోచిస్తూ నడుస్తున్న ప్రసన్న క్వార్టర్‌కు చేరే సరికి, చేతికున్న స్క్వేర్ వాచ్‌లో ముళ్ళు రెండూ తొమ్మిది మీద కలిశాయి.

గుమ్మం ముందు ఆగి జేబులు తడువు కున్నాడు ప్రసన్న! ఖాళీగా వున్న జేబులలో చేతులుంచి జేబుగుడ్డను బయటకు లాగి మరీ చూసుకున్నాడు— చాకిరేవులో ఇసకరాలిందే గాని తాళాం చేతులు మాత్రం అగుపళ్ళేదు.

దారితప్పిన బాటసారిలా బిత్తరపో యాడు ప్రసన్న. ప్రక్కనున్న లోక నాథంగారి క్వార్టర్ కేసి చూశాడు. 'బిత్తర పోతావు దేనికే వో పిల్లా.....!' తెలుగు పాటలు వినుపిస్తున్నయి, వాళ్ళ రేడియోలో నుండే చిన్నగా.

వాళ్ళ తాళాలేవయినా సరిపోతవేమో చూద్దాం! అనుకుంటూ.... వెళ్దామా? వద్దా?..... అనే సందిగ్ధంలో పడ్డాడు ప్రసన్న.

లోకనాథంగారు తప్పించి ఆ ఇంట్లో మరే పురుగూ పరిచయం లేదాయె. తీరా పోయి పిలిచాక ఆయన కాస్తా ఇంట్లో లేకుంటే?...... 'కనీసం వాళ్ళ నుగ పిల్లలతోనన్నా మాట్లాడుతూవుండు' తాయారమ్మ వ్రాసిన మాటలు రేడియంలా వెలిగాయి అతని మస్తిష్కంలో. ప్రసన్న మనస్సు పరి పరి విధాలా పోయింది.

అప్రయత్నంగా అతని కాళ్ళు లోక నాథంగారి లోగిలికేసి దారి తీసాయి—

తెలుగు పాటలనేమో సౌండ్ కాస్త పెంచారు.

గేటు ముందు ఆగిన ప్రసన్నకు చంద్రకాంతం పూలవాసన గుప్పున కొట్టింది.

పూలమొక్కలున్న ఇల్లూ, ఆడపిల్ల లున్న ఇల్లూ ఆకర్షణంగా వుంటా యట......?? పై రెండూ ఒకే చోట తారస పడితే వేరే చెప్పాలా......???

నుదుటిపై చమటను అరిచేతితో తుడుచుకొంటూ, 'సార్!' సాధ్యమయి నంతవరకూ సభ్యతగానే పిలిసాడు. ఎదురు చూస్తూ నిలుచున్నాడు— ఎవరూ రాలేదు బయటకు—

పవర్ హౌస్ సైరన్ తొమ్మిదయిం దంటూ గోదచేస్తుంది!

మళ్ళీ పిలిచాడు— ప్రసన్న!

మారేం లాభంలేక పోయింది.

గేటుతడుతూ పిలిచాడు ధైర్యంగా—

అప్పటికి వినిపించిందిగామోసు వురు కుతూ వచ్చింది గేటు దగ్గరకు— వాళ్ళ బొచ్చు కుక్క!

వచ్చిందే లగాయితు, ఎవడో వీపున మోదు తున్నట్టు మొరగడం మొదలు పెట్టింది.

'వెధవ కుక్క! ఎప్పుడూ అరవగా నయినా వినలేదు. ఈ రోజేం దాపురిం చిందో దీనికి?' విసుక్కోయి వెనక్కు మళ్ల బోతున్న ప్రసన్న, "ఎవరండీ?" అన్న పిలుపువిని అటుగా చూశాడు గేటుదరికి వస్తున్న మనిషిని.

అనుకున్నంత పనీ అయింది. ప్రసన్న ప్రాణాలు పైకే పోయాయి! లోకనాథం గారి పెద్దమ్మాయి— కృష్ణవేణి!..... "మీరా?" ఎన్నాళ్ల బట్టో పరిచయ మున్న వ్యక్తిని పలుకరించినట్టు పలుక రించింది గేటు కొక్కెం తీస్తూ, "నాన్న గారు భోంచేస్తున్నారు, లోపలకు రండి" కృష్ణవేణి ననుసరిస్తూ లోపలకు వెళ్లాడు ప్రసన్న.

"కూర్చొండి!" కేన్ కుర్చీ చూపిం చింది కృష్ణవేణి. చేసేదిలేక కూర్చు న్నాడు ప్రసన్న— గోడలకు తగిలించిన ఫోటోలకేసి చూస్తూ.

'టామీ' గామోసు ఆ బొచ్చు కుక్క ప్రసన్న కుడికాలికి చేరువగా చేరి కాస్త వాలికతో నాకేసరికి దిగ్గున లేచి నిలు చున్నాడు. ఫక్కున నవ్వింది కృష్ణవేణి, "ఏం ఫరవాలేదు లెండి! పెంపుడు కుక్క కదూ, పొరుగింటారే గదా అని మీ ప్రక్కకు చేరింది— అంతే!!"

కృష్ణవేణి మాటలు పరీక్షగా వింటు న్నాడు ప్రసన్న.

బొచ్చు కుక్క పోయి కృష్ణవేణి కాళ్లదగ్గరకెళ్లి కూర్చుంటూ 'ఎవరీ పిరికి వెధవ?' అన్నట్టు చూస్తుంది, బొచ్చులో దాగిన బుల్లి కళ్లతో. కృష్ణ వేణి కళ్ళు రెండూ 'దోవతప్పివచ్చారా?' అన్నట్టు చూస్తున్నయి, ప్రసన్న కేసి. బొచ్చు కుక్క నాకిపోయిన కాలికేసి చూసుకుంటున్నయి ప్రసన్న రెండుకళ్ళూ!!

"ఏం బాబూ నిలుచొనే వున్నావేం.....? కూర్చో!"

ఆ ఆరు కళ్ళూ అటుగాతిరిగాయి—

మీది తువ్వాలుతో మూతి తుడుచు కుంటూ లోకనాథంగారు వచ్చారు. ఆయన వెనుకనే సతీమణి రాజమ్మగారు, రెండవ అమ్మాయి రోజారాణి వచ్చారు.

ప్రసన్నను వాళ్లకు పరిచయం చేశారు లోకనాథం గారు.

"హోటల్‌కు భోజనానికి పోతే తాళాం చేతులు ఎక్కడో జారిపోయాయి సార్. మీవేవయినా పట్టొచ్చేమో చూద్దామని...." పరిచయ వాక్యాలు పూర్తికాకముందే వచ్చిన పని తేల్చి చెప్పాడు ప్రసన్న.

"అర్రె! అన్నయ్యా వాళ్లన్నారేరే సమయానికి" అంది కృష్ణవేణి సాలో చనగా.

"ఏం?...... మీ అన్నయ్యలుంటే అట్ల తెడ్లతో తీసే వాళ్లేం" అందామను కున్నాడు ప్రసన్న. అంత ధైర్యంలేక అలా నవ్వి పూరుకున్నాడు. కృష్ణవేణి దగ్గరనుండే రోజారాణి దగ్గరకురికింది తోకాడిస్తూ బొచ్చుకుక్క. రోజారాణి దానిని రెండు చేతులతో పైకెత్తి, ముద్దుల కానించుకొంది.

'ఏవిటి..... కుంజి పోగొట్టుకొన్నావా? ఆడ కుంజినా లేక మగ కుంజి?" ఆత్రు తగా అన్నారు లోకనాథంగారు.

కాస్త సందిగ్ధంలో పడ్డాడు ప్రసన్న. నీళ్ళు నములుతూనే అన్నాడు, "నాకా కుంజిల్లో రకాలు తెలియవు గాని అది మాత్రం 'క్లిక్' కుంజి" అని.

రాజమ్మగారు ప్రక్క గదిలో కెళ్లి వో తాళాల గుత్తి తెచ్చి ప్రసన్న కిచ్చింది. "వీటిలో ఏదేనా చాలుతుందేమో చూడు బాబూ!" అంటూ.

ప్రసన్న అవి పుచ్చుకు ముందుకు పోబోయి "కాస్త ఆగండి!" అన్న పిలుపు విని ఇటుగా తిరిగాడు. కృష్ణవేణి రేడియో బల్లవద్దనున్న టార్చితెచ్చి ప్రసన్న కిస్తూ, "చీకట్లో ఏం చూస్తారు. ఈ టార్చికూడా తీసుకెళ్లండి!" అంది.

టార్చి తీసకుంటున్న ప్రసన్నకు కృష్ణవేణి వేళ్ళు తాకేసరికి ఏదో తెలియని అనుభూతి కలిగింది. అర క్షణం ఆమెకేసి చూసి ముందుకు నడిచాడు.

ప్రసన్న జీవిత పుటల్లో ప్రథమ ప్రకరణం ముగిసింది!

ఏనాడూ పరాయి ఆడ పిల్లలతో పరిచయం లేని ప్రసన్నకు, ఈ నాటికి పరిచయస్తులంటూ లభించారు.

ద్వితీయ ప్రకరణలో పడ్డాడు ప్రసన్న!!

'అందరకూ లభించదు ఆమెని తాకేంత అదృష్టం' ప్రేమలో పడి పోయాడు ప్రసన్న— పాపం పసివాడు!!!


అలా ఇలా చేసి గుత్తిలోవున్న మొత్తం తాళాలు పెట్టి చూశాడు ప్చ్.... లాభం లేక పోయింది. చివరకు విసుగు చెంది తాళం కప్పను పొందికగా పట్టి, ఒక్క గంజా గుంజాడు విసురుగా—

విడిపోయింది బంధం!

వచ్చేసింది తాళం!!

తిరిగి లోకనాథం గారింటికి వెళ్ళాడు. టార్చి తాళాల గుత్తి బల్లపై నుంచి 'థాంక్స్' చెప్పాడు. ఎదురుగా లోక నాథంగారు చూపించిన కుర్చీలో కూర్చు న్నాడు. రాజమ్మగారు, కూతుళ్ళూ ప్రక్క గదిలోకి వెళ్లినట్టున్నారు. ఒక్కరే కూర్చొని ఆలోచిస్తున్నారు, భరిణలో వక్కపొడి నములుతూ, "ఆ .... మీ స్వగ్రామం బందరన్నావు గదూ!" వక్కపొడి

(42 వ పేజీ చూడండి)







వారఫలం

5-8-1966 శుక్రవారం మొదలు
11-8-1966 గురువారం వరకు.

మేషం : భారీయెత్తున చేసే వ్యాపారాల్లో చికాకులు వస్తాయి. ప్రయత్నించిన పనులకు ఆటంకాలు రావడం అనుకోని వ్యవహారాలు నెరవేరడం వంటి సంఘటనలు జరుగుతాయి ప్రయాణాల్లో శ్రమ అధికంగా ఉంటుంది వారాంతంలో అన్నివ్యవహారాల్ను బాగా ఉంటాయి సజ్జనసాంగత్యం లభిస్తుంది. స్త్రీలకు- విలాస వస్తువులు కొంటారు. పుణ్య కార్యాలు చేస్తారు.

వృషభం : వృత్తిలో కొంతమంది వ్యక్తులు మిమ్మల్నినమ్మించిమోసంచేయడానికిప్రయత్నిస్తారు. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది వ్యాపారంలో కొత్తవారి పోటీని యెదుర్కోవలసి వస్తుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభించలేదు. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

మిధునం : ఈ వారం శుభాశుభ మిశ్రమంగా ఉంటుంది రావలసిన డబ్బు సమయానికి అందకపోవడంవలన లాభించేవ్యవహారాలను కూడా వాయిదావేయవలసి వస్తుంది. వృత్తిలో ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. ఆరోగ్యం బాగా ఉంటుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. అనుకూల వార్తలను వింటారు.

కర్కాటకం: వృత్తి వ్యాపారాల్లో యిదివరకున్న చికాకులు తొలగిపోతాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాల్లో అనుకూలత లభిస్తుంది. బంధువుల వ్యవహారాల్లో కొత్తసమస్యలు తలయెత్తవచ్చును. విద్యావైజ్ఞానికరంగాల్లో మీ కృషి రాణించగలదు. స్త్రీలకు—స్వల్ప అనారోగ్యం చేయవచ్చును. బంధుమిత్రులను కల్సుకొంటారు.

సింహం : వారం ప్రారంభంలో వృత్తివ్యాపారాల్లో అవస్థ మీది అనుభవం మరొకరిది కాగల పరిస్థితి యేర్పడుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో జోక్యం చేసికోవడం తగదు వారాంతంలో అనుకూల పరిస్థితులు యేర్పడతాయి ఆర్థికవ్యవహారాలు బాగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబవ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది.

కన్య: వ్యాపారంలో కొంతమంది మిత్రుల వ్యవహారాల్లో జోక్యం చేసికోవలసి వస్తుంది వృత్తిలో మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది ఉద్యోగంలో ముఖ్యమైన వ్యవహారాలు మీరు స్వయముగా చూడడం మంచిది. రాజకీయ వ్యవహారాల్లో ప్రతిపక్షాలు బలహీనపడతాయి. స్త్రీలకు—ఆరోగ్యం సామాన్యంగా ఉంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

తుల : వృత్తి వ్యాపారాల్లో ఆదాయం కంటే అడవుడి అధికంగా ఉంటుంది. వ్యాపారంలో యిదివరకు చేజారిపోయిన అవకాశాలు తిరిగి లాభించవచ్చును. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలకు లొంగి పోవడం తగదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరుతాయి. విలాస వస్తువులు కొంటారు.

వృశ్చికం : వృత్తి వ్యాపారాల్లో అనుకూలమైన మార్పులు వస్తాయి. నూతన వ్యవహారాలు కొంచెం శ్రమ మీద లాభిస్తాయి సమయానికి యేదో ఒకవిధంగా డబ్బు చేతికి వస్తుంది. ఉద్యోగంలో అధికారుల ఆదరాభిమానాలను పొందగలరు. కుటుంబ సంతోషం లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. వినోద కాలక్షేపాలో పాల్గొంటారు.

ధనుస్సు : వృత్తి వ్యాపారాల్లో మీరు అనుకొనేది ఒకటి. జరిగేది మరొకటి కావచ్చును. ముఖ్యమైన వ్యవహారాలు భాగస్వాముల నిర్ణయానికి వదలి వేయడం మంచిది. ఆర్థికవ్యవహారాల్లో యితరుల నిమిత్తం ఒత్తిడికి గురి కావలసి వస్తుంది. ప్రయాణాలు ప్రయోజనకరంగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో అధికవ్యయం జరుగుతుంది.

మకరం : సామాన్యమైన వ్యవహారాలకు కూడా, విశేషమైన కృషి చేయవలసి వస్తుంది. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు మాత్రం బాగా ఉంటాయి. వృత్తిలో ప్రయోజనం గల వార్తలను వింటారు. సాంఘిక వ్యవహారాల్లో మెప్పుకురాని కార్యభారాన్ని వహిస్తారు. స్త్రీలకు—ఆరోగ్యం బాగానే ఉంటుంది సంతానానికి సౌఖ్యసంతోషాలు లభిస్తాయి.

కుంభం: వ్యాపారంలో సమయానికి కొంతమంది మిత్రుల సహకారం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు కొంతవరకు లాభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. స్థిరాస్థి వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—కుటుంబ కార్యక్రమాలు కొంచెం శ్రమ మీద నెరవేరుతాయి.

మీనం : వృత్తి వ్యాపారాల్లో చికాకులు వచ్చేటట్లు కన్పిస్తాయి గాని మీ చాకచక్యమే అనుకూలతను సాధించగలదు. ఆర్థిక వ్యవహారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి. దైవకార్యాలు నెరవేరుతాయి స్త్రీలకు—ఆరోగ్యం బాగా ఉంటుంది. నూతన విషయాలను తెల్సుకుంటారు.

—మహేష్

సీరియల్

అర్ధాంగి



2

పుస్తక పఠనంలో మునిగివున్న పద్మావతి కొడుకుమాట వినబడి తలెత్తి చూసింది.

"ఈవిడ సుదర్శనంగారి మేనగోడలు మంజుల" హరీష్ గుమ్మంలోనే నిలబడి ప్రక్కనున్న మంజులని తల్లికి పరిచయం చేశాడు.

"నమస్కారం" అంటూ రెండు చేతులూ జోడించింది మంజుల.

ఎంతో సంతోషంగా, చిరునవ్వుతో ఆ అమ్మాయిని పలకరించి లోపలికి తీసుకు వెడుతుంది, అనుకున్న పద్మావతి, కళ్లు రెండూ వెడల్పు చేసుకుని ఆశ్చర్యంగా ఆ అమ్మాయిని నఖశిఖపర్యంతం వీక్షిస్తూ నిలబడిపోయింది.

అలాంటి పరిస్థితిని ఎదురుచూడని హరీష్, తల్లి అభిప్రాయాన్ని అర్థం చేసుకుని, అవమానం పొందినట్లు బాధపడుతూ,

"ఈవిడ బస్సుకోసం నిలబడివుంటే, మన కారులో దిగబెడతానని నేనే తీసుకొచ్చాను. నేను పేషెంట్సుని చూసుకుని వచ్చేదాకా ఈవిడ ఇక్కడ కూర్చుంటే మీ ఇద్దరికీ కాలక్షేపం అవుతుందని ఇలా తీసుకొచ్చాను." అనేసి తల్లి సమాధానానికి కూడా ఎదురు చూడకుండా వెళ్లిపోయాడు.

"ఛీ, ఛీ. ఎంత పొరబాటు చేశాను? ఆయన రమ్మంటేమాత్రం, నాక్కాస్తయినా జ్ఞానం వుండఖ్ఖర్లేదూ? బుద్ధిలేక వచ్చినందుకు మంచి శాస్తి అయింది. ఈ తల్లిని గురించేనా ఆయన అంత గొప్పగా చెప్పుకుని మురిసిపోయారు! ఈవిడతో ఒక్క నిమిషం మాట్లాడితే నా చికాకు, కోపం అన్నీ ఎగిరిపోతాయిట! కాని ఈవిడ వాలకం చూస్తే, ఒక్క అరనిముషం మాట్లాడితే వున్న మతేపోయేలావుంది. ఇంక పది నిమిషాలు కూర్చుంటే ఏం జరుగుతుందో చెప్పక్కర్లేదు. అసలు అంతసేపు కూర్చునే ఓర్పుగాని, ఆవిడ వాగ్బాణాలని ఎదుర్కొనే అవసరంగాని నాకులేదు. ఇప్పుడే వెళ్లిపోవడం మంచిది." స్థాణువులా నిలబడిపోయిన మంజుల,

"రామ్మా. లోపలికి రా" అంటూ అప్యాయంగా తన చేతిని అందుకున్న చేతిని, ఆ చేయితాలూకు మనిషిని ఒకసారి బెదురుగా చూసి కళ్లు వాల్చేసుకుంది. ఏదో కారణంచెప్పి వెళ్లిపోవాలని చూసింది. కాని స్నేహ వాత్సల్యాలతో పెన వేసుకున్న ఆచేయి మాత్రం ఆమెని వదలలేదు.

* * *

"ఎవరామ్మాయి?" రాత్రి కొడుక్కి అన్నం వడ్డిస్తున్న పద్మావతి యధాలాపంగా అడిగినట్లే అడిగింది.

విసుగుదల వ్యక్తం కాకుండా ఒక్కసారి కళ్లు పైకెత్తి చూశాడు హరీష్ ఏవిటన్నట్లు.

"అదే. ఇందాకా వచ్చిన మంజుల ఎవరి అమ్మాయి?"

"సుదర్శనంగారని— ఈమధ్యే వో నెలరోజులనించి ట్రీట్ చేస్తున్నాను— ఆయన మేనగోడలు."

"ఏ సుదర్శనంగారు? మన కింతకుముందు పరిచయం లేదనుకుంటానుకదూ"

"అవును. వాళ్లు ఉద్యోగరీత్యా ఈ వూరొచ్చి రెండు సంవత్సరాలయిందను

కుంటాను. మన గోపాలంగారి ఇంటి ప్రక్కనే ఉంటున్నారు. ఆయనకి జబ్బుగా వుందని గోపాలంవచ్చి చెప్తే వెళ్ళి చూసి ట్రీట్‌మెంటు మొదలుపెట్టాను. వాళ్ళని గురించిన వివరాలేం నాకు తెలియవు వాళ్ళింటి పేరేమిటో కూడ తెలియదు వి. సుదర్శనం అని బోర్డుమాత్రం చూశాను. ఎంత మామూలుగా వుందామనుకున్నా అతని మాటల్లో కాస్త చిరాకు తొంగి చూస్తోంది. అది గమనించనట్లు, "ఏమిటి సుస్తీ?" అని అడిగింది.

"పక్షవాతం."

ఇంక మాటలు పెంచకుండా గిన్నెలు లోపల పెట్టి రావడానికి వెళ్ళింది పద్మావతి. తల్లి ముభావంగా ఉందని గ్రహించిన హరీష్ మవునంగానే భోజనం ముగించి చెయ్యి కడుక్కున్నాడు.

"మనస్సంతా చికాగ్గావుంది. ఎంతమరిచిపోదామనుకున్నా అంతకుముందు జరిగిందే గుర్తువచ్చి తనలో అణు వణువూ సిగ్గుతో, అవమానంతో కుంచించుకుపోయేలాచేస్తోంది. ....వయస్సులోవున్న ఆడ మగా కాస్త స్నేహంగా ఉంటేచాలు బోలెడన్ని అర్థాలు కలిపిస్తుందీ పాడులోకం. అమ్మ సంస్కారం గొప్పదని ఆమె ఆలోచనలు స్వార్థంలోనే ఉంటాయని, ఇలాంటి సంకుచిత భావాలు ఆమెకి రానేరావని తనిన్నాళ్ళు గర్వపడుతూవుండేవాడు. కాని అది పొరబాటు. అమ్మ కూడ అలాంటివాటికి అతీతురాలేం కాదు. మంజులని చూడగానే ఆవిడలో కలిగిన మార్పునిబట్టి ఎవరైనా ఆసంగతి ఇట్టే గ్రహిస్తారు. పాపం ఆ అమ్మాయిని పిలిచి ఇంటికి తీసుకొచ్చి, అవమానించినట్లయిందని బాధపడుతూ, తను వచ్చేసరికి ఇద్దరూ ఎంతో సరదాగా మాట్లాడుకుంటున్నారు.....ఆవిడ కెలాంటి దురభిప్రాయంలేదుకదాఅని వాళ్ళ సంగతులన్నీ చెప్పాలనుకునేంతలోనే మళ్ళీయిప్పుడు అమ్మ మాటలధోరణిమారిపోయింది. హు. మర్యాద కోసం ఆ అమ్మాయివున్న కాస్సేపుతీయగా మాట్లాడిందన్నమాట. పోనీ అదీ కొంత నయమే. ఏమిటో, మంజులని తలుచుకుంటేనే, ఆనాడు దైన్యం మూర్తీభవించిన మంజుల అశ్రుతప్తనయనాలతో తనకు వీడ్కోలిస్తున్న దృశ్యమే కళ్ళల్లో మెదులుతుంది. అప్పుడు ఇంటికి తిరిగివస్తున్నంతసేపూ ఆ సుదర్శనంగారు, ఆయన భార్యా, మంజుల, వాళ్ళే తన మనసుని ఆలోచనలని ఆక్రమించుకున్నారు. ఆ ఇంట్లో మనుష్యులు ప్రవర్తన ముఖ్యంగా ఆయన భార్య మనస్తత్వం గురించి వెంటనే అమ్మకి చెప్పాలనిపించింది కాని రాగానే, శరణాలయంలోనూ, డిస్పెన్సరీలోనూ కూడ అర్జెంటు కేసులుండడంచేత ఆనాడు ఒక్క క్షణం అయినా తీరుబడిగా అమ్మతో మాట్లాడే అవకాశం కలగలేదు తరువాత ఏమిటో అశ్రద్ధ అయిపోయింది. మళ్ళీ ఈనాడు అనుకోకుండా మంజులని ఇంటికి తీసుకురావటం తటస్థపడడంతో ఆమెని అమ్మకి పరిచయం చేసి వాళ్ళ విషయాలన్నీ చెప్పాలనుకున్నాడు ...... కాని..... అమ్మ చూపులు, మాటలు తనకా అవకాశం కలిగించలేదు.' అప్పటికే చాలా రాత్రి గడిచిపోవడంతో చికాగ్గా ఇటునించి అటు ఒత్తిగిల్లిదుప్పటి పైకి లాక్కుని కప్పుకుంటూ, బలవంతాన నిద్ర పట్టించుకునే ప్రయత్నంలో కళ్ళు మూసుకున్నాడు.

* * *

సోఫాలో వెనక్కివాలి కూర్చుని, చేతిలో వున్న పెయింటింగ్ నిమగ్నుడై చూస్తున్నాడు హరీష్.

"మొదట చెప్పగానే ధర ఎక్కువేమోననిపించిందికాని, ఇప్పుడు చూస్తుంటే వాళ్ళ శ్రమకి, పనితనానికి తగిన ప్రతిఫలం ఇవ్వలేదేమోననిపిస్తోంది.....చూడగానే అమ్మ ఎంత సంతోషిస్తుందో. ఆవిడే అన్నమాటేమిటి చూసిన వాళ్ళంతా మురిసిపోయి దీన్ని ఎక్కడ కొన్నారు. ఎంతకి కొన్నారు. అంటూ ప్రశ్నలవర్షం కురిపిస్తారు. వచ్చిన వాళ్ళందరికీ కనిపించేలా ఈ గదిలోనే పెట్టాలి" అనుకుంటూ ఏ ప్రక్క తగిలిస్తే బాగుంటుందోనని చుట్టూచూస్తుంటే చూస్తుంటే.

"చూడు హరీ, ఎవరొచ్చారో" అన్న తల్లి మాటలు వినిపించాయి.

దృష్టిని గోడలమీదనుంచి గుమ్మం వైపుకి తిప్పాడు. నవ్వుతూ నిలబడిన తల్లి ప్రక్కన మంజుల. అతను తనవైపు చూడగానే గౌరవ పూర్వకంగా కొద్దిగా తల వంచి కళ్ళతోనే పలకరించింది. నో సన్నని చిరునవ్వు మధురంగా ఆమె అధరాలపై మెరిసి మాయమయింది.

వాళ్ళిద్దరూ లోపలికివస్తూ[illegible] సర్దుకుని సరిగ్గా కూర్చున్నాడు తల్లి తనంత తాను మంజులని వెంటబెట్టుకుని వచ్చినందుకు ఆశ్చర్యంతో తల మునకలౌతున్న అతనికి ఏం మాట్లాడాలో, ఎలా పలకరించాలో తెలియలేదు. అయినా అతి ప్రయత్నంమీద ఆ ఆశ్చర్యాన్ని అణచుకుని, "ఈవి డెక్కడ కలిశారమ్మా" అన్నాడు తల్లితో. ప్రసన్నత నింపుకున్న కళ్ళతో మంజులనిచూస్తూ.

"నేను గుడికి వెళ్ళానుకదూ. తనూ అక్కడికి వచ్చింది. కాస్సేపు మనింట్లో కూర్చుని వెళ్ళమని నేనే బలవంతంచేసి తీసుకొచ్చాను."

"ఉహూ! మీకు గుడికి వెళ్ళే అలవాటుకూడ వుందన్నమాట." చిత్రంగా చూస్తూ అడిగాడు మంజులని.

"ఏం? మీరునాస్తికులా?" ఎదురు ప్రశ్న అడిగింది ఆమె, అంతకన్నా చిత్రంగా కళ్ళు తిప్పుతూ.

"అబ్బె అంతదుర్మార్గుడిని కాదు. కాని ప్రత్యేకంగా గుడికి వెళ్ళాలంటేనే ఏమిటో ఏమిటో........"

"అశ్రద్ధ అయిపోతుంది బద్ధకం వస్తుంది. అంతేనా, హరీ?" ముచ్చటగా ఆ సంభాషణవింటున్న పద్మావతే పూర్తిచేసింది

"అశ్రద్ధకాదమ్మా.... నేనిలా అంటున్నానని మీకు కోపంవస్తుందేమోకాని—మీరింత భక్తిశ్రద్ధలతో ఇంతదూరంనుంచి వెళ్తున్నారుకదా, కనీసం ఒక్క నిమిషం అయినా ప్రశాంతంగా మిమ్మల్ని దైవదర్శనం చేసుకోనిస్తున్నాడా ఆపూజారి?"

"బాగుంది. ఒక్కొక్కళ్ళు గంటల తరబడి నిలబడిపోతే వెనకవాళ్ళేమైపోతారు?" సమర్థించబోయింది మంజుల

"ఎంతసేపు ఉన్నాము అనికాదు నేను చెప్పేది. ఉన్న ఒక్క క్షణం అయినా ప్రశాంతంగా కళ్ళుమూసుకు నిలబడనివ్వరు. వాళ్ళ డబ్బు లాలసతో మన నిశ్చలతని చెదరగొట్టేస్తారు.

నా కింకా బాగా జ్ఞాపకంవుంది. ఏడాది క్రిందట, ఓసారి అమ్మ బలవంతంమీద గుడికి వెళ్ళాను. కొబ్బరికాయ పూజారి చేతికిచ్చి, ఒక్క క్షణం కళ్ళు మూసుకుని రెండు చేతులూ జోడించి నిలబడ్డాను. ఇంతలోనే నా చేతిని ఎవరో కుదిపినట్లయింది కళ్ళు తెరిచిచూస్తే ప్రక్కన పూజారి దక్షిణ అంటూ చెయ్యిజాచి నిలబడ్డాడు. చిరాగ్గా అటు తిరిగాను. ప్రసాదం ఇస్తున్న పూజారి దక్షిణ అంటూ గొణిగాడు. వినిపించుకోనట్టు, చేతిలోవున్న డబ్బుగల్లాలో వేసేయబోయాను. 'అందులోవద్దు. నా చేతికివ్వండి'

అని స్పష్టంగా ఎలాంటి మొహమ్మాటం లేకుండా, ప్రక్కవాళ్ళు వింటున్నారనే భయం అయినా లేకుండా అడిగాడు ఆ పూజారి. వాళ్ళవరస చూస్తే ఎంత అయినా అసహ్యంవేసింది. అయినా నిగ్రహించుకుని నాకు తోచింది వాళ్ళచేతిలోపెట్టి ముందుకు కదిలాను. నా దారిని అడ్డగిస్తూ మరో చెయ్యి ముందుకువచ్చి, ఉద్ధరిణెడు నీళ్ళు లయోహుయంగా చూస్తున్న నాచేతిలో పోసింది. నేను తేరుకుని అక్కడి విగ్రహాల కేసి చూడబోయేంతలో దక్షిణ అన్న మాటలు వినిపించాయి. ఇంకో క్షణం అక్కడ నిలబడితే ఇంకా ఎంతమంది నన్ను చుట్టు ముట్టుతారో అన్నభయంతో వెంటనే జేబులో చెయ్యిపెట్టి, చేతికి వచ్చినది తీసి అతని చేతిలో పడేసి కళ్ళు మూసుకుని పరుగెత్తుతూ అవతలకి వచ్చి పడ్డాను. ఇంటికివచ్చాక అమ్మ అడిగింది. "ఏమని దణ్ణం పెట్టుకున్నావు హరీ" అని అప్పుడు జ్ఞాపకం వచ్చింది నేను చేసిన పొరబాటు. ఆ పూజార్ల బారినుండి తప్పించుకునే హడావిడిలో నేను వెళ్ళినపనే మరిచిపోయాను. అందులో నా తప్పేం లేదు. నన్ను ఒక్క నిమిషం అయినా నిలబడి నా మొర ఆదైవానికి విన్నవించుకోనిస్తేనా ఆ పూజార్లు. ఆ సంగతే చెప్పాను అమ్మకి. కదమ్మా."

"వాళ్ళే హాస్యానికయినా సమయమూ సందర్భమూ ఉండాలి." చిరునవ్వుతోనే మందలించింది పద్మావతి.

"హాస్యంకాదమ్మా. నేను చెప్పింది నిజం. అందులో స్వానుభవంతో చెప్పింది కూడాను అయినా ఇది ఒక్క ఈ వూళ్ళో పరిస్థితే కాదు, ప్రతిచోట ఇదే పద్ధతి. అందులో కాస్త పేరు ప్రఖ్యాతులున్న పుణ్యక్షేత్రా లలో ఇలాంటివి మరీ విపరీతంగాఉంటాయి. ఈ దక్షిణ సాధించలేనిపని అంటూ ఉండదు. అందుకే కాస్త పలుకుబడీ పుష్క లంగా డబ్బూ వున్నవాళ్ళు ఎలాంటి ప్రయాస పడకుండా తిన్నగా ఆ దైవం దగ్గరికి వెళ్ళిపోయి తను గోడు వినిపించు కుని వచ్చేస్తారు. ఆ రెండూ లేనివాళ్ళు గంటల తరబడి పడిగాపులు పడితే అరక్షణం కూడ దైవ దర్శనంకాదు...... సరే ఈ గొడవకేంగాని....ఇంతకీ మీరు గుడికెందుకు వెళ్ళారో చెప్పలేదు. ఏమిటి విశేషం"

కొంగు నోటి కడ్డం పెట్టుకుని నవ్వు కుంటూ కూర్చున్న మంజుల ఏదో చెప్ప బోయేంతలో,

"బాగుంది దైవదర్శనానికి కూడ కారణం విశేషం కావాలా ఏమిటి? నే నెందుకు వెళ్ళా వనుకున్నావు?" పద్మావతి కొడుకునే ఎదురు అడిగింది.

"మీ సంగతి నాకు తెలియదుకాని, నేను విశేషంవుండే వెళ్ళాను. ఇవాళ నా పుట్టిన రోజు."

మంజుల మాటలు వింటూనే ఆదరంగా ఆమెని దగ్గరికితీసుకుంటూ, "అలాగామ్మా, సకల భాగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని నిండు మనస్సుతో ఆశీర్వదిస్తున్నాను" అంది పద్మావతి. అవ్యక్తమైన ఆనందాను భూతితో ఆమెకళ్ళు చెమ్మగిల్లాయి.

"నేను కూడ" తన దీవెనలని కూడ అందజేశాడు హరీష్!

"థ్యాంక్సు."

"ఒట్టి కృతజ్ఞతలేనా ? మరి పార్టీ లేదూ?"


"ఊహూ. నా కలవాటులేదు."

"పోనీలెండి. కలిసివచ్చే అలవాట్లే."

మంజుల చిన్నబుచ్చుకున్నట్లు మొహం దించేసుకుంటూంటే పద్మావతి కొడుకుని మందలించింది. అతి చనువు తీసుకున్నం దుకు అతనూ నొచ్చుకున్నాడు.

"అబ్బే. మీరు అడిగినందుకు నాకేం బాధగాలేదు—పాత సంగతులేవో జ్ఞాపకం వచ్చాయి. నాలుగైదు సంవత్సరాల్రకితం దాకా అంటే మా అమ్మమ్మా తాతయ్య గారూవున్న రోజులలో ఈ పుట్టినరోజు కాస్త సరదాగానే గడిచేది. నేను అశ్రద్ధ చేసినా, అమ్మమ్మ తెల్లవారగట్ల నన్ను నిద్రలేపి తలంటుపోసి కొత్త బట్టలు కట్టు కునేదాకా వదిలిపెట్టేదికాదు. నాలుగు రోజుల ముందునుంచీ 'ఏ పుట్టినరోజుకేం చెయ్యమంటావు' అంటూ అడుగుతూ, నేను చెప్పినవీ తను చేయాలనుకున్నవీ నో మూడు నాలుగు రకాల పిండివంటలు చేసి, నా స్నేహితులు పదిమందినీ పిలిచి పెట్టమనేది. నో ఏడుకోఏడు పెద్దదా వ్వుతూ ఇంకా ఈ పార్టీలేమిటి అమ్మమ్మా అన్నా ఆవిడ వినేదికాదు. నేను వద్దు అను కున్నా ఆరోజు ఎంతో హడావిడిగా సరదాగా గడిచిపోయేది. ఇప్పుడు కావాలనుకున్నా ఆ సంతోషండాదు. అసలు ఇవాళ నాపుట్టిన రోజు అన్న సంగతే మరిచిపోయాను. మధ్యా హ్నం ఎందుకో హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. ఏడాదికి ఒక్కసారి వచ్చే ఈ పుట్టినరోజు ఏ ప్రత్యేకతా లేకుండా అతి సామాన్యంగా గడిచిపోవడం ఇష్టంలేక ఆల యానికివెళ్ళి దైవదర్శనం చేసుకు వస్తు న్నాను." ఆరోజులు గుర్తు వచ్చి మంజుల కళ్ళు చెమ్మగిల్లాయి. గొంతు బొంగురు పోయింది. ఇంక మాట్లాడలేనట్లు తల వంచుకుని కూర్చుంది. వింటున్న పద్మావతి ఎలాగో అయిపోయింది.

"మరి మీ అమ్మమ్మా, తాతగారూ కూడ లేనప్పుడు మిమ్మెక్కడెందుకుంటు న్నావు? మీ అమ్మానాన్నా ఎక్కడున్నారు" అని అడగాలనిపించినా, ఈ కాస్త పరి



చేయడానికే వాళ్ల కుటుంబ విషయాలు అడగడం బాగుండదని, అందునా అవాళ్టి రోజున మంజుల మనస్సు కెలాంటి కష్టం కలిగించకూడదని నవ్వుతూ మంజుల గాజులు సవరిస్తూ కూర్చుంది పద్మావతి. ఒక్కసారిగా ఆ గదిలో అల్లుకుపోయిన నిశ్శబ్దాన్ని భరించలేక,—

"ఇదుగో నమ్మా నువ్వు మెచ్చుకుంటున్న పెయింటింగు ఎందాక వచ్చిందో మా హరి చెప్పాడు." అంటూ అంతక్రితం తను చూసి ప్రక్కన పెట్టిన నిర్మల్ పెయింటింగ్ తల్లి చేతికిచ్చాడు.

ప్రసంగప్పు ధోరణి మారినందుకు ఎంతో కృతజ్ఞతతో చేయిజాపి అందుకుని శ్రద్ధగా చూసింది. చూడగానే ఆమెకి అది బాగా నచ్చిందని సంతృప్తితో మెరుస్తున్న ఆమె కళ్లు చెప్తున్నాయి.

"చాలా బాగుంది" అంటూ మంజులకిచ్చింది.

కురుక్షేత్ర మహా సంగ్రామంలో పార్థునికి గీతోపదేశం చేస్తున్న కృష్ణపరమాత్మ మహోజ్జ్వలంగా ఉన్న ఆ చిత్రాన్ని ఎంతో ఆసక్తితో చూసి కళ్ళు చెమర్చగా చూసీ చూడగానే తన హృదయానికి హత్తుకున్న ఆ చిత్రాన్ని ఒకసారి గుండెకి హత్తుకుని, మరోసారి దూరంగా పెట్టుకుని వివిధకోణాల్లోంచి తనివితీరా చూసి, 'చాలా బాగుంది' అని మెచ్చుకుంటూ పద్మావతి కిచ్చింది.

మరి కాసేపు కూర్చుని, వెడతానని లేచిన మంజులని కూర్చోబెట్టి మరోసారి లోపలికివెళ్లివచ్చింది పద్మావతి. ఆమె వెనకే పనిపిల్ల ప్లేట్లలో టిఫిన్, కాఫీ తీసుకొచ్చాడు.

హరీష్ ఒక ప్లేటు అందుకుని, "తీసుకోండి" అన్నాడు మంజులతో.

"మరి మీరు?" అంటూ పద్మావతి వైపు చూసింది మంజుల.

"అమ్మకివాళ శుక్రవారం, రేపు శనివారం, ఎల్లుండి ఆదివారం, అవతలెల్లుండి సోమవారం—వారంలో అంతా మా అమ్మ లాంటివాళ్లు అయితే అసలు ఆహారమన్నదే ఉండదు. బలవంతాన హోటళ్లు మూయించే అవసరమూ రాదు."

"అయ్యబాబోయ్, అన్నీ ఉపవాసాలే. నే [illegible] ఒక్కరోజు [illegible]

[illegible]

ఆలస్యంఅయితే కళ్ళు తిరుగుతాయి" గుండెలమీద చెయ్యి వేసుకుని, కళ్ళు పెద్దవి చేసుకుని మరీ ఆశ్చర్యంతో తనని చూస్తున్న మంజుల మాటలకు చిరునవ్వు నవ్వి ఆప్యాయంగా దగ్గరికి తీసుకుంటూ,

"మా హరి మాటలన్నీ నిజం అనుకుంటున్నావా? నేనూ కటిక ఉపవాసాలు చెయ్యలేను. ఏదో ఒకటి తీసుకుంటూ వుంటాను" అంది పద్మావతి నవ్వుతూ.

కాఫీ అయినతరువాత, "ఇక వస్తానండి. చాలా ఆలస్యం అయిపోయింది. మావయ్య ఎదురుచూస్తూ వుంటాడు" అంటూ లేచింది మంజుల.

"ఉండు. బొట్టు పెడతాను" అని లోపలికివెళ్లి తెచ్చిన బొట్టు తాంబూలంతోపాటు "నీ పుట్టినరోజుకి ఇది నా బహుమతి" అంటూ ఆ పెయింటింగ్ కాగితం చుట్టి దారం కట్టి ఇచ్చింది.

"ఇదేమిటి? నా కొద్దండీ" మంజుల మొహమాటపడుతూ చెయ్యి వెనక్కి తీసుకుంది.

"అలా అనకూడదు. పుట్టినరోజునపూట ఇంటికి వచ్చిన అమ్మాయికి ఏమీ ఇవ్వకుండా వట్టి చేతులతో పంపించమంటావా?"

"ఏమీ ఇవ్వకపోవడం ఏమిటి? కడుపు నిండా ఫలహారాలు తినిపించి మరీ పంపిస్తున్నారు నేను పార్టీ ఇవ్వాల్సింది పోయి, దర్జాగా మీ ఇంట్లో ఆరగించి వెడుతున్నా"

"ఆ మాట అన్నావులే ఇదిమాత్రం నువ్వు తీసుకోక తప్పదు. ఈరోజు ఎవరు ఏ బహుమానమిచ్చినా నువ్వు తీసుకోవాలి అందులోనూ పెద్దదాన్ని నేను

అభిమానంతో ఆశీర్వదించి ఇస్తూంటే అసలు కాదనకూడదు" చనువుగా మంజులచేయి అందుకుని ఆ చిత్రం ఆమెచేతిలో పెట్టి పోతుంటే,


"తీసుకోండి. మీరు చాలా అదృష్టవంతులు. మా అమ్మ నా కెప్పుడూ అంత మంచి బహుమతి ఇవ్వలేదు" అన్నాడు హరీష్ హాస్యంగా.

కనురెప్పలెత్తి ఓసారి అతనివంక చూసి ఆ ప్యాకెట్ అందుకుని థాంక్స్ చెప్పింది.

గుమ్మందాకా కూడా వెళ్లిన పద్మావతి చనువుగా, "అప్పుడప్పుడు వస్తూ వుండమ్మా." అని, అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు,

"ఉండమ్మా ఎలా వెడతావు? హరీ, కారులో దిగబెట్టరాదా......" అంటూంటే, ఆవిడ మాటలు పూర్తికాకముందే,

"వద్దండి వద్దు. నేను రిక్షాలో వెళ్తాను" అంది మంజుల బింగారుగా. తెల్లబోతూ ఆమె ముఖంలోకి చూశాడు హరీష్. క్షణం వారి చూపులు కలుసుకున్నాయి. ఆమె కళ్లల్లో భావం అతనికి అర్థం అయింది. అతనికి అర్థం అయింది అని గ్రహించుకున్న మంజుల చటుక్కున కళ్ళు వాల్చేసుకుంది. ఆమె అంతరంగం సిగ్గుతో మెలికలు తిరిగి పోయింది అదేమీ గమనించని పద్మావతి, "చీకటిపడిపోయింది. ఒక్కదానివీ ఎలా వెడతావు? బయల్దేరితే నేనే యింత సేపు ఉంచేశాను నిన్ను—మనుగడ డ్రైవరు ఇంతకుముందే వెళ్లిపోయాడు. హరి దిగబెడతాడులే" అంది.



అరాంగి

"ఫర్వాలేదండి. ఏమంత పొద్దుపోయింది కనక. మా సరళా వాళ్లింటికి వెడితే ఇంత వేళదాకా కూర్చోడం నా కలవాటే" అని మరోసారి ఆమె దగ్గర శలవు తీసుకుని ముందుకు నడిచింది.

"నాకు వేరే పని ఉందమ్మా. లేకపోతే తీసుకు వెళ్లేవాడినే. రిక్షా ఎక్కించివస్తాను. చదువుకుంటున్న అమ్మాయికి ఆమాత్రం ధైర్యం లేకపోతే ఎలా?" అన్నాడు హరీష్ నవ్వు తెచ్చుకుంటూ.

"మీ కా శ్రమ కూడ ఎందుకు? నేను మాట్లాడుకోగలను" నవ్వుతూనే సమాధానంచెప్పి బయలుదేరింది.

రిక్షాలో కూర్చున్న మంజుల మనస్సు కొద్దిసేపటి క్రితం జరిగిందాన్ని గురించే ఆలోచిస్తోంది. "తను మరీ అంత ఖంగారు పడిపోకుండా వుండాల్సింది. ఆయన కళ్లల్లో లీలగా మెదిలిన భావం తనలో అణువణువు సిగ్గుతో అవమానంతో దహించుకుపోయేలా చేస్తోంది—అందులో ఆయన తప్పేమీ లేదు. సంకుచిత భావాలుగల బావ ప్రవర్తనే దీనికంతటికీ కారణం. ....ఆనాడు డాక్టరు గారింటికి వెళ్లినప్పుడు మొదట్లో ఆయన తల్లి యెలాగో ఉన్నట్లు అనిపించినా, తరువాత తనని లోపలికి తీసుకువెళ్లి ఎంతో అభిమానంగా, ఆదరంగా మాట్లాడింది. ఎన్నో రోజుల తరువాత మనస్సు విప్పి అంత ఆప్యాయంగా మాట్లాడేవాళ్లు దొరికినందుకు ఎంతో సంబరపడింది తను. ఆ సంతోషం తోటే, కారులో డాక్టరు ప్రక్కన కూర్చుని ఇంటికి వచ్చేదాకా ఎన్నో ఖబుర్లు తన కాలేజీని గురించీ, స్నేహితులని గురించీ చెప్పింది. అతనూ చాలా సరదాగా ఎప్పుడూ నవ్వుతూ ఎదుటివారిని నవ్విస్తూవుంటాడు. ఇద్దరూ నవ్వుకుంటూ కారు దిగేసరికి వీధి గుమ్మంలోనే ఎదురయాడు బావ. కనుబొమలు ముడిచి చిత్రంగా తననీ, డాక్టర్నీ మార్చి మార్చి చూస్తూ, 'ఎక్కడికి వెళ్లావు?' అన్నాడు. అసహ్యాన్ని దాచుకోలేక విసురుగా మొహం ప్రక్కకి తిప్పేసుకుని, సమాధానం చెప్పకుండా లోపలికి వెళ్లిపోయింది తను. వెళ్తూ వెళ్తూ అప్రయత్నంగానే గుమ్మం దగ్గర ఆగి వెనక్కి తిరిగి చూసింది. తన వెనకే వస్తున్న డాక్టరుకూడ తలెత్తి చూశాడు. అతని కళ్లల్లో సర్వం అర్థం చేసుకున్నభావం—సరిగ్గా ఇంతక్రితం కనిపించినలాంటిదే—మెదిలింది. తను పరుగు పరుగున లోపలికి వెళ్లిపోయింది. బావ ఏ కళనున్నాడో డాక్టరుగారుండగా మరింకెలాంటి గొడవా చెయ్యలేదు. కాని అతని కారు కదలగానే తన గదిలోకివచ్చి, "వీ డెక్కడ కలిశాడు నీకు?" అన్నాడు కాలుతున్న సిగరెట్ గాలిలోకి ఎత్తిపట్టుకుని.

"ఎవరు?" అంది తను ఏదో ఆలోచిస్తూ.

"చాల్లే నాటకం. వళ్లు తెలియకుండా విరగబడినవ్వుతూ వాడి ప్రక్కన కూర్చుని వచ్చిన దానివి, ఏమీ తెలియనట్లు ఎవరు అని అడుగుతున్నావా?" అంటూ కొంప మునిగిపోయినట్లు గొంతు చించుకుని అరిచాడు బావ.

"బాగుంది. బస్సుకోసం వైట్ చేస్తూంటే చూసి కారాపారు. వచ్చాను. ఇందులో తప్పేముంది?" అంది తను. ఎందుకో డాక్టరుగారింటికి వెళ్లానని చెప్పాలని పించలేదు.

"అవును నువ్వు చేసిన పనిలో తప్పేమీ లేదు. తప్పంతా నా చూపులోనేవుంది." కాలిపోయిన సిగరెట్ కిటికీలోంచి బయటికి విసిరేస్తూ అన్నాడు.


"నిజమే. ఆ తప్పంతా నీ చూపుదే. అదీ పైకి కనిపించే ఈ కళ్లదికాదు. కుళ్లిపోయిన నీ మనస్సు తాలూకుది. అయినా నామీద నీ కీ అర్థంలేని అధికారమేమిటి?" అనాలనిపించింది. తను నోరు విప్పేలోపలే అత్తయ్య రంగంలో ప్రవేశించి ఆ ఉద్రిక్త వాతావరణాన్ని కాస్త చల్లబరచడానికి ప్రయత్నించింది. ఎప్పుడూ కొడుకునే వెనవేసుకొచ్చి తనలో తనే తప్పులెంచే అత్తయ్య ఆవేళేమనుకుందో.

"ఏమిటి శంకరం ఇది? ఆలశ్యం అయిపోయింది. అమ్మాయి ఇంకా రాలేదేమా అని నేను ఖంగారుపడ్డాను. వెధవ బస్సులు ఒకంతట దొరకవు ఒక్కోసారి. సమయానికి ఆదారినే వస్తున్నాడేమో చూసి తీసుకొచ్చాడు పాపం అతను. అయినదానికీ కానిదానికీ రాద్ధాంతం చెయ్యడం నీ కలవాటయిపోయింది"అంటూ కొడుకునే మందలించింది.

"అంత భయపడినదానివి నాకెందుకు చెప్పలేదు. నేనే వెళ్ళి తీసుకువచ్చేవాడినిగా" ఎదురు తల్లినే అడిగాడు శంకరం.

"అన్నింటికీ అంత తొందర పడతావేం? వెంట పెట్టుకుని తిప్పే రోజులు. అధికారం చేసే రోజులు ముందు వస్తాయిలే. ఆరోజు వచ్చినప్పుడు మంజుకూడ బుద్ధిగాఉంటుంది... లేమ్మా. బట్టలు మార్చుకుని అన్నానికి రా." అంటూ కొడుకుని వెంట బెట్టుకుని వెళ్లిపోయింది.

(సశేషం)



వి. ఎస్. సుక్థాంకర్

దక్షిణాదివనితలు: నా అభిప్రాయాలు

"ఇక నేను వెళ్తాను." అన్నాడు మా స్నేహితుడు. ఇద్దరం లైబ్రరీలో ఉన్నాము. ఇంత తొందరగా గ్రంథాలయం వదలి వెళ్లే అలవాటు అతనికి లేదు.

"ఏమంత అవసరం?" అని అడిగాను.

"ఇవాళ గురువారం. మా ఇంట్లో వారందరూ కలిసి భజన చేస్తాము."

నా ఆశ్చర్యాన్ని కనిపెట్టి, "నమ్మకం లేదా? సరే నాతో వచ్చిచూడు!" అన్నాడు అతను.

ఈ స్నేహితుడు దక్షిణాదివాడు. బాగా చదువుకుని, ఆధునిక దృక్పథాన్ని అలవరచుకున్న ఒక పత్రికా రచయిత. అందుకనేనేమో ఆశ్చర్యపోయాను. ఇద్దరం అతని ఇంటికి వెళ్లాము. ఒక పదహారు, పదిహేడేళ్ల ఆడపిల్ల భజన కీర్తనలని తియ్యగా పాడుతోంది. కొందరు యువకులు ఆమెను అనుసరిస్తున్నారు. నా మిత్రుడూ సంగీతంలో పాల్గొన్నాడు. భజన అయిపోయిన తర్వాత అన్నాడు, "ఈ అమ్మాయి నా చెల్లెలు. తక్కిన వారంతా మాచుట్టాలూ, ఇరుగుపొరుగువారూ."

"మీ చెల్లెలేం చేస్తోంది?" అని అడిగాను.

"కాలేజిలో చదువుకుంటోంది."

"ఇక్కడ కాలేజి పిల్లలు భజన కీర్తనల్లోపాల్గొనటం పాత పద్ధతి అనుకోరా?"

"అనుకోరు. ఆధునిక విద్య ప్రభావం వల్ల కలిగే మంచి పరిణామం అనుకుంటారు. కాని ఒక నియమం పాటిస్తూ ఉంటాము. బయట వాళ్లని పిలవము. మీ సంగతి కాదనుకోండి..."అంటూ మా స్నేహితుడు వివరంగా చెప్పుకుపోయాడు.

నేను మొదటసారిగా మద్రాసు వచ్చినప్పుడు ఒక హోటల్లో దిగాను. ఇది ఒక చిన్న సందు చివర ఉండేది. సందు నిండా 'ప్లాట్‌ఫారం డ్వెల్లర్లు' రోడ్ల మీదనే జీవిస్తూ ఉండేవారు. వారి చుట్టూ వంటకి పనికి వచ్చే కుండలని చూసినప్పుడెల్లా, అందులోనూ వారిలోని ముదుసలి ఆడవారిని చూసినప్పుడెల్లా చాలా విచారంగా ఉండేది. ఉండేందుకు ఇల్లు కూడా లేని వీరి బతుకులు ఇంతే కదా, అనుకునే వాడిని.

ఒక సాయంకాలం గదికి తిరిగి వచ్చేసరికి ఆలస్యం అయింది. అప్పటికే దీపాలు వెలుగుతున్నాయి. ఒక వీధి దీపం కింద ఒక చిన్న అమ్మాయి ఒక అరవ పత్రిక చదువుతోంది. ఆమె చుట్టూ ఎందరో పోగయి ఉన్నారు. అందరూ ఆమె చదివే దాన్ని అత్యాసక్తితో, ఆనందంతో వింటున్నారు. ఈ దృశ్యం నన్ను చలింప చేసింది. "ఇలా రోడ్ల మీదనే బతుకుతూ పత్రికలు చదివేవారు భారతదేశంలో మరెక్కడయినా ఉంటారా?" అనుకున్నాను......

* * *

కొంతకాలం నేను ప్రతిరోజూ 10 గంటలకి బయలుదేరి బస్సు మీద గ్రంథాలయానికి వెళ్లి వస్తూ ఉండేవాడిని. ఒక రోజు కొందరు కాలేజి అమ్మాయిలు గుంపుగా బస్సు ఎక్కారు. కొన్నప్పుడు సగం సీట్లని వాళ్లే ఆక్రమించేసేవారు. కాని వారి సంయమనం, నాగరక ప్రవర్తన నన్ను చకితుడిని చేసేవి. మా వైపు ఆడపిల్లలు ఇంత నెమ్మదిగా ఉండరనిపించేది. ఈ నిలకడ గుణం చదువుకున్న వారిలోనే కాక మామూలు ఆడవారిలోనూ నేను గమనించాను. ఇన్ని ఏళ్లగా ఇక్కడ ఉంటున్నాను. ఒక సారయినా, ఒక దక్షిణాది వనిత బహిరంగ ప్రదేశాలలో గట్టిగా అరవటంకాని, 'క్యూ' లో తన స్థానాన్ని దాటి రావాలని ప్రయత్నించటంకాని, అందరూ చూసేట్లు చిరుతిండ్లు నమలటంగాని— చూడలేదు. చదువుకోని వారిని కానీయండి, చదువుకున్న వారిని కానీయండి.

* * *

అలాగని వారికి అనవసరమైన బిడియం ఉందని అనను. ఇతరులకి సాయపడటానికి ఎన్నడూ వెనుదీయరు. ఒకసారి మైలాపూర్‌లో ఒక మిత్రుడిని చూడవలసివచ్చింది. అప్పటికి ఇంకా ట్రామ్‌బళ్లు ఉన్నాయి. రాయపేట దగ్గిర పక్కనే ఉన్నాయనని దారి అడిగాను. ఆయన కొన్ని సూచనలు చేశాడు. "కాదు. ఇంకా పై 'స్టాప్'లో దిగితే దగ్గిర" అని ఒకావిడ కలగచేసుకుని చెప్పింది. నాకు మొదట సలహా ఇచ్చిన పెద్దమనిషి ఆమె చెప్పినదే సరి, అని అంగీకరించాడు!

"ఇక్కడ ఖద్దరు కావాలంటే మీరు వడికిన నూలు తీసుకురావాలి" అన్నాడు 1952 లో మద్రాసు ఖాదీ భాండార్ మేనేజరుగారు. అప్పటికి ఖద్దరు కొరత, బాగా ఉండేది. నూలు ఇవ్వకుండా ఖద్దరు ఎక్కడయినా దొరుకుతుందా అని నేనడిగాను. 'ఎక్కడా దొరక' దని మేనేజరుగారు చెప్పారు. నిరాశతో తిరిగి పోదామనుకుంటూ ఉండగా నా పక్కనే ఏదో కొంటున్న ఇద్దరు వనితలు నావైపుతిరిగి, 'ఈ ఊళ్లో మీకు కావలసిన అంగడి ఒకటి ఉంది', అని ఆ అంగడికి ఎలా వెళ్లాలో వివరంగా చెప్పారు...

* * *

ఒకసారి నేను మద్రాసుకి పక్కనే ఉన్న ఒకచిన్న గ్రామంలో ఒక చిన్న ఇల్లు అద్దెకి తీసుకుని కొన్నాళ్లపాటు అక్కడే ఉండ దలచాను. ఆ ఇంటి చుట్టూ చక్కటి తోట ఉండేది. ఎందరో మధ్యాహ్నాలలో చెట్లనీడ కింద పోగయి ఒకటే గొడవ చేస్తూ ఉండేవారు. నాకు ఇది చికాకు కలిగించింది. ఇంటి యజమానికి ఫిర్యాదు చెయ్యాలనుకున్నాను. అక్కడికి వెళ్లాను. ఒక తోటమాలి నన్ను సమీపించి, "అమ్మగారిని చూడటానికి వచ్చారా?" అని అడిగాడు. "లేదు అయ్యగారినే" అని జవాబు చెప్పాను. ఇంట్లో మగవారెవరూ లేరని అతను తిరిగి సమాధానం ఇవ్వటంతో మరొకసారి రావచ్చునని వెనక్కి తిరిగాను. కాని, మా మాటలు విన్న ఇంటి లోపలి ఆవిడ బయటికి వచ్చి, "కొత్తగా వచ్చినవారు మీరే అయి ఉండాలి. లోపలికి రండి." అని చిరునవ్వుతో ఆహ్వానించింది. ఇంత మర్యాదగా మాట్లాడుతున్న ఈ మధ్య వయస్కురాలితో ఫిర్యాదు చెయ్యటం ఎలా అని తికమక పడ్డాను. అయినా, ఆమె మాటని కాదనలేక లోపలికి వెళ్లాను. వచ్చిన పని చెప్పాను. ఆమె కొంచెం నొచ్చుకుని తగిన ఏర్పాట్లు చేస్తానన్నది. అంతేకాక, "మీరు మహారాష్ట్రులా? హిందీ చదవటం వచ్చునా? నా దగ్గిర ఆధ్యాత్మిక విషయాల మీద ఎన్నో హిందీ పుస్తకాలు ఉన్నాయి చదువుతారా?" అంటూ కొన్నిగ్రంథాలు తీసుకువచ్చింది. లోపలికి వెళ్లి మిఠాయి, షరబత్ తీసుకువచ్చి, "మధ్యాహ్నం కాబట్టి చల్లని పానీయం తీసుకువచ్చాను. కాఫీ ఇప్పుడు బాగుండదు", అన్నది. "మేమూ మద్రాసులోనే ఉంటూ ఉంటాము. అప్పుడప్పుడూ ఇక్కడికి వస్తూ వుంటాము మీకే ఇబ్బంది వచ్చినా సందేహించకుండా మా సహాయం కోసం అడగండి!"

1952 నుంచి మద్రాసుకి వచ్చి వెడుతున్న నాకు ఈ ప్రాంతం వనితలని గురించి ఎటువంటి అభిప్రాయం ఏర్పడిందో పై సంఘటనలు తెలుపుతాయి.



వేసవి గాడ్పుల ఉధృతం తగ్గి, ఆరోజే పడిన వర్షపు జల్లుకి భూమి పులకరించింది. వట్టివేళ్ల తడికెలు విప్పి కిటికీలు బాగా తెరిచి పడక కుర్చీలో కూర్చున్న సుమిత్ర అప్పుడే వాకిట్లో ఆగిన నల్లని ఏంబాసిడర్‌లోనుంచి ఎవరు దిగుతారో వని ఆత్రుతగా కళ్ళు పెద్దవి చేసి చూసింది.

ముందు సీట్లోనుంచి దిగిన యువకుడు టెరిలిన్ సూట్‌వేసుకుని కళ్ళకి నల్ల అద్దాలు పెట్టుకుని ఠీవిగా యింటివైపు చూశాడు. ఒంటిగంట మధ్యాహ్నం కూడా ఐదుగంటల సాయంత్రంలా వున్న ఆరోజు కళ్ళకి నల్ల అద్దాలు ఏమిటో అనుకుంది సుమిత్ర. అతను స్టయిల్‌గా నిలబడి వెనక డోర్ తీశాడు. పాలనురుగ లాంటి తెల్లని టెరిలిన్ చీరె కట్టి, అంతకన్నా తెల్లని సిల్కు జాకెట్టు వేసుకుని నొక్కుల జుత్తుపైకి దువ్వి 'వి' ఆకారంలో ముడి వేసిన అమ్మాయి నవ్వుతూ కారులోనుంచి బయట కాలుపెట్టింది. బొడ్డుమల్లె పువ్వులా బొద్దుగా వున్న ఆ అమ్మాయి. వకుళే నని పోల్చుకుని గబగబ వాకిట్లోకి పరిగెత్తింది సుమిత్ర.

డ్రయివర్ సీట్లోనుంచి దిగి, "చూశావా నీ ఫ్రెండ్‌ని పట్టుకొచ్చాను" అన్నాడు కృష్ణమూర్తి.

వకుళ సుమిత్ర చెయ్యి పట్టుకుని బలంగా వూపుతూ "ఎన్నాళ్ళకి కనిపించావ్!" అంది పొయెటిక్‌గా.

"ఈయన మా శ్రీవారు—మిస్టర్ శ్రీనివాసరావ్. శ్రీనివాస్ ఆటోస్టోర్స్‌కి ప్రొప్రయిటర్— మాదిపెద్ద బిజినెస్‌కన్సర్న్‌లే— అంతేకాదు ఆయన ఆటోమొబైల్ ఇంజినీర్ కూడా......" వకుళ పరిచయంచేస్తున్న ధోరణికి ఆమెభర్త సిగ్గుపడిపోవటం చూసి నవ్వుకుంది. సుమిత్ర— పిన్ని కూతురు పెళ్లికని కార్లో వస్తున్నారట హైదరాబాద్‌నుంచి. కృష్ణమూర్తి ఆఫీసుకు

వెడుతూ రిక్షాలో కనిపించాడట బస్ స్టాండ్ దగ్గర. ఇంటికి బలవంతపెట్టి తీసుకొచ్చాడట. వకుళ చెప్పింది. "అంత బలవంతపెడితేగాని రావన్నమాట మా యింటికి. ......" అన్నది సుమిత్ర నిష్ఠురంగా. వకుళ భర్త డ్రెస్ మార్చుకుని నిద్ర కుపక్రమించాడు. స్నేహితురాళ్లిద్దరూ మాటా మంతీ మొదలు పెట్టారు అవతల గదిలో కూర్చుని.

వకుళ చెవులకి గుత్తులుగుత్తులుగా వ్రేలాడుతున్న ముత్యాల సరాలను చూస్తూ కూర్చుంది సుమిత్ర. డబ్బుతోపాటు హుందాతనం, హోదాతోపాటు ఒకకొత్త అందం వస్తాయి కాబోలు! కాలేజీలో చదివే రోజుల్లో వకుళ సన్నగా, గాలివీస్తే పడిపోయేలా వుండేది. చురుకుదనం లేకుండా మందమతిలా వుండేది.ఆమె యిప్పుడు చాలా హుషారుగా మాట్లాడుతోంది. మధ్యమధ్య చమత్కారాలు, చెణుకులు విసురుతూ.....

"నువ్వేం మాట్లాడవేం.. మీగురించి చెప్పు—"అంది వకుళ ఉన్నట్లుండి. విజయవాడలో ఎండలని గురించి అక్కడ లారీల రొద గురించి, రోడ్లని గురించి, చెట్లు లేని పార్కులను గురించి ఇంకా ఎన్నింటినో గురించి చెప్పింది సుమిత్ర "ఇన్నింటి మధ్యా మేమింత వరకూ ప్రశాంతంగానే గడుపుతున్నాం" అని ముగించింది.

"నేనొచ్చేవరకూనా?" అని విరగబడి నవ్వింది వకుళ. సుమిత్ర సరళంగా నవ్వి వూరుకుంది.

సాయంత్రం వరండాలో కూర్చుని కబుర్లలోకి దిగారు నలుగురూ. వకుళ కేవలం సుమిత్రకే స్నేహితురాలుకాదు. కృష్ణమూర్తికి క్లాస్‌మేట్‌కూడా ... కృష్ణమూర్తి అభిమానుల్లో వకుళ ఒకర్తె. ఆమె అభిమానానికి ఆమెకారూ, మేడా అడ్డు వచ్చేవి. అంచేత కృష్ణమూర్తిని కేవలం "విష్" చేసి మాత్రం వెళ్లిపోయేది.

వకుళతో మాట్లాడుతూ వుంటే ఆవిషయాలు గుర్తువస్తున్నాయి సుమిత్రకు.

పిన్నిగారింటికి వెళ్లడానికి ప్రత్యేకంగా ముస్తాబయింది వకుళ. దోసెడు వెడల్పు జరీ అంచున్న కంజీవరం పట్టుచీరెకట్టి, అంచు రంగుకి మాచ్ అయ్యే తిరుచూర్ణం రంగు బ్లవుజు వేసుకుని, రెండు వరసల ముత్యాల హారం ధరించింది. చీరెమీదకి పొడవుగా వ్రేలాడుతున్న ముత్యాలహారాన్ని బరువుగా అంటిపెట్టుకుని వుంది పెద్ద లాకెట్. చెవులకి కెంపుల దుద్దులు పెట్టుకుంది.

సుమిత్ర షర్బత్ కలిపి యిచ్చింది. షర్బత్ అందుకుంటున్నప్పుడు వకుళ తెల్లని వ్రేలుకి ధరించిన కెంపుల వుంగరం కాంతి తెల్లని గాజు టంబ్లర్ మీదపడి వింతగా మెరవడం చూసింది సుమిత్ర. వకుళని చూస్తూ వుంటే పూర్వంలా నవ్వురాలేదు సుమిత్రకి.

"ఇంత ఖరీదైన అలంకారమా?" అని ఆశ్చర్యపడలేకపోయింది. వకుళని యింకా యింకా చూడాలనిపించింది. అంతేకాదు, ఆమెధరించిన లాంటి నగలూ, దుస్తులూ తను ధరిస్తే వకుళ కన్న తనేఅందంగా వుంటుందనే భావంకూడా ఆమెమనస్సులో మొలిచింది. వకుళా, శ్రీనివాసరావూ చాలా హుషారుగా మాట్లాడుతున్నారు కృష్ణమూర్తితో. సుమిత్ర చాలా యిబ్బంది పడిపోయింది. స్వేచ్ఛగా వుండలేక పోయింది.

శ్రీనివాసరావు పెళ్లిచూపులకి రావడం దగ్గర్నుంచి, అతనికి తన తండ్రి కట్నం, కానుకలు, అతనికున్నఆస్తిపాస్తులు అతని తెలివి తేటలు అతని ప్రతిభావిశేషాలు తెగ వివరిస్తోంది వకుళ.

మొగవాళ్ల మనస్సుని ఆకట్టుకోడానికి ఆడవాళ్లు చేసే గమ్మత్తులలో వాళ్ల ప్రతిభను పొగడడం ఒకటి అనుకుంది సుమిత్ర అసూయగా.

"మీ మామగారు చాలా మంచివారండి. శ్రీనివాసరావ్‌గారూ—అలాంటివాళ్లు వుండడం అరుదు" అన్నాడు కృష్ణమూర్తి. కృష్ణమూర్తి ముఖంలో వచ్చిన మార్పుని స్పష్టంగా గుర్తించింది సుమిత్ర. కృష్ణమూర్తి అక్కడితో ఆగలేదు. తను సుమిత్రని కావాలనుకోడం దగ్గర్నుంచి, ఇప్పుడు సుమిత్రకి వాళ్లనాన్నగారు ఒక 'కార్డు ముక్కైనా' వ్రాయక పోవడందాకా సవివరంగా చెప్పుకు పోయాడు. సుమిత్ర పడుతున్న యిబ్బందిని ఏమాత్రం గ్రహించని వాడై.

ప్రసంగం మార్చడానికన్నట్లు వకుళ అన్నది "త్వరలో మావారు అమెరికా వెడతారు— నేనూ వెళ్లాలని వుంది"అని వూరుకోలేదు. విమానం టికెట్లు మానాన్నగారే కొంటారు సుమా అని కూడా అన్నది.

వాళ్లు అమెరికా వెళ్లడం ఎందుకో అర్థంకాని సుమిత్ర మవునంగా కూర్చుంది. పెళ్లిసుముహూర్తం వేళవుతోందని వాళ్లు బయలు దేరారు. కృష్ణమూర్తికూడా కుర్చీలోంచి లేవగానే "అమ్మయ్యా" అనుకుంది సుమిత్ర.

వకుళకీ తనకీమధ్య పెద్ద ఇనపగోడ అడ్డం వున్నట్లూ, తనూ ఆమే పూర్వంలా మెలగడానికి ఏమాత్రం వీలు లేనట్లూ అనుకుంది సుమిత్ర. అంతేకాదు 'వకుళ వంటి అమ్మాయిని, వకుళ నాన్నగారి అంత గొప్పవాడికూతుర్ని చేసుకోలేక పోయినందుకు కృష్ణమూర్తి విచారిస్తున్నాడేమో యిప్పుడు?' అని కూడా అనిపించింది. ఈ భావం వచ్చిన వెంటనే ఆమెకి పట్టరానంత కోపం వచ్చింది.

"ఛీ! ఏం మనుష్యులు" అనుకుంది. అలా అనుకున్నవెంటనే ఆమెకి భూతకాలంలో తానుచేసిన త్యాగాలన్నీ ఒకటి తరువాత ఒకటి కళ్లముందుకు వొచ్చి, క్వెశ్చన్ మార్కు ముఖాలు వేసుకుని నిలబడ్డాయి. 'మాకు దొరికిన ప్రతిఫలం ఇదన్నమాట" అన్నట్లుగా.

చాలా నీరసంగా ఫీలయింది సుమిత్ర. ఈ ప్రపంచంలో మంచికి చోటులేకుండా పోయిందని విచారపడింది ఆమె. సమయం రాత్రి ఏడుగంటలని చెబుతున్నట్లుగా రేడియోలో ఎవరో అమ్మాయి దిగులు గొంతుతో వార్తలు చదువుతోంది. బహుశా రైలు ప్రమాదాలకీ అగ్నిప్రమాదాలకీ విచారపడి ఆమె కంఠం అలా అయిందేమో! "అలావున్నావేం, సుమీ! వంట్లో బాగా లేదూ! నాకు చెప్పకూడదా, డాక్టరుకి కబురు చేసే వాడిని" అన్నాడు కృష్ణమూర్తి ఇంటికి వస్తూనే....

"నావొంటికేం చాలా బాగుంది. థాంక్స్" అని విసురుగా అక్కడనుంచి వెళ్లిపోయింది.

తెల్లబోయిన కృష్ణమూర్తి కూలబడ్డాడు. ఇటువంటి కోపాలూ, అలకలూ అతనికింత వరకూ అనుభవం లేవు— కొంచెం చిలిపిదన్న మాటేగానీ సుమిత్ర చాలా మంచి పిల్ల.

లోపల వంటచేసుకుంటూన్న సుమిత్ర ఎప్పటికిమల్లె కూనిరాగం తీయడంలేదు. డైనింగ్ టేబిల్ దగ్గరకూడా సుమిత్ర చాలాముభావంగా వుంది. రాత్రి పన్నెండు ఒంటిగంట సమయంలో కూడా ఆమె కళ్లు తెరచుకుని సీలింగ్‌ఫ్యాన్‌కేసి దీక్షగా చూస్తూ వుండడం కృష్ణమూర్తి గమనించాడు. ఆమెని అంతగా కలత పెడు

తూన్న ఆలోచన ఏమిటో అతనికి అర్థం కాలేదు.

మరునాడు నిద్రలేస్తూనే పాత పేపర్లు ముందువేసుకుని ఏదో వెతుకుతోంది సుమిత్ర..... ఏదో ఉద్యోగం తాలూకు ప్రకటన అని కనిపెట్టడానికి ఎక్కువ సమయం పట్టలేదు కృష్ణమూర్తికి. అతనిమస్తిష్కాన్ని అనేక ఆలోచనలు చుట్టివేశాయి ...... 'వానలో తడిసిన మాత్రానే వారంరోజులు జ్వరం కాస్తుంది సుమిత్రకి. రెండు మూడుగంటలు ఫ్యాన్ ఎదురుగా కూర్చుంటే తలనెప్పిరావడం తథ్యం. రెండున్నరకి కాఫీ త్రాగక పోతే మతేవుండదు. ఐదు గంటలకి వరండాలో చల్లగాలికి పడక కుర్చీలో కూర్చుంటేగానీ తోచదు. ఉద్యోగం చేస్తాననడం బింకం కాక మరేమిటి అనుభవాన్ని మించిన గురువులేదని సామెత. ఒకమాటు చెయ్యి కాలితేగాని నిప్పు జోలికి వెళ్ళకుండా వుండరు పిల్లలు' అనుకుని నవ్వుకున్నాడు కృష్ణమూర్తి.

అతను ఆఫీసుకు వెడుతూంటే సాయంత్రం కార్యక్రమం ఏమిటో చెప్పలేదు సుమిత్ర. పెన్నూ, తాళంచెవులూ దాచలేదు. ఈ డ్రస్ బాగాలేదు, అషర్టు కుదరలేదు అంటూ ఏడిపించలేదు. చాలా గంభీరంగా అతనికి అవసరమైన వన్నీ అందించింది.

"నేను వెడుతున్నాను సుమిత్రా" అంటే "ఊ" అంది.

"వెళ్ళగానే ఉత్తరం రాయండి" అనకుండా ....

సాయంత్రం అతను వచ్చేసరికి కిటికీ వూచల్లో దూరి వున్న చీటీ పలకరించింది.....

"నేను కుముదిని యింటికి వెడుతున్నా— ఎన్నిగంటలకు వస్తానో చెప్పలేను"

కుముదిని మంగపతి రావుగారి అమ్మాయి. ఆయనకి బెజవాడలో పెద్దమేడా, రెండు కార్లేగాక పెద్దపెద్ద కంపెనీల్లో షేర్లూ కావలసినంత పలుకుబడీవున్నాయి. మంగపతిగారు రికమెండ్ చేసిన అభ్యర్థికి ఎక్కడైనాసరే ఉద్యోగం శపీమని వేసితీరవలసిందే. కుముదిని యింటికి వెళ్ళడంలో సుమిత్ర ఆంతర్యం అర్థం అయింది కృష్ణమూర్తికి. ఆమె ఉద్యోగం కోసం చాలా గట్టిగా ప్రయత్నిస్తోందన్న మాట!

ఎనిమిదిన్నరకి యింటికి వచ్చిన సుమిత్రని అతను ఏమీ అడగనూలేదు, ఆమె ఏమీ చెప్పనూలేదు. చాలా మామూలుగా భోజనానికి రమ్మని పిలిచింది. కొత్తవాళ్ళకి వడ్డించినట్లు వడ్డించింది. అతను అడగకుండానే కుముదినికి పెళ్ళి సంబంధం కుదిరిందనీ, పెళ్ళికొడుక్కి నయవేలిలో ఉద్యోగం అనీ చెప్పింది.

"నీకిప్పుడు ఉద్యోగం దేనికీ! నిన్నంతా అలా వున్నావేం! నేను ఏమైనా అన్నానా? లేక వంట్లో బావుండలేదా! మనిద్దరి మధ్యా దూరం పెంచుతున్నావెందుకూ!" అని అడగాలనిపించింది. కృష్ణమూర్తికి. ఇప్పుడిప్పుడే మంచిమూడ్‌లోకి వస్తున్న సుమిత్ర మళ్ళీ కదిలించడం ఎందుకని, ఆమె చెప్పేదంతా సీరియస్‌గా విన్నట్లు నటించాడు. నిజానికి అతని బుర్రలోకి ఏమి దూరలేదు. కుముదిని పెళ్ళికొడుకు ఫారిన్ రిటర్న్‌డ్ అయితే తనకి వొరిగిందేమిటి! కుముదిని పెళ్ళికి బాలమురళీ కృష్ణసంగీతకచేరీ ఏర్పాటు చేయాలనుకుంటే తనకేమిటి! పైకి ఎన్ని కబుర్లు చెప్పినా డబ్బూ,దానితోపాటువచ్చే డాబూదర్పంఅంటే యిష్టపడని ఆడవాళ్ళు వుండరు. అవన్నీ యిష్టం లేదని చెప్పి తమని తాము మోసం చేసుకుని ఏవో ఆదర్శాలుఅంటూ బయలుదేరి, చివరికి తాము అశాంతితో బాధపడి, ఎదుటి వాళ్ళని బాధపెట్టడం ఎందుకో! ఆత్మవంచన అనటడంకన్న గత్యంతరంలేదు. ఈవిషయంలో వకుళని అభినందించాలి. వకుళ బి. ఏ చదివే రోజుల్లో సత్యానందం అనే కుర్రవాడు ఆమెని ప్రేమిస్తున్నానని వుత్తరం వ్రాస్తే అతన్ని నిలదీసి ఆమె అడిగిన మాటలు యివి, 'ఆడవాళ్ళకి రకరకాల చీరెలంటే యిష్టం, విలువైన నగలంటే యిష్టం. అలంకరణ అన్నా విందులన్నా, వినోదాలన్నా యిష్టం. మొగవాళ్ళు తమమాట వినడంలేదన్నా, తమ కోర్కెలు తీర్చక పోయినా కష్టం. అందులోనూ అతిగారాబంగా అష్టయిశ్వర్యాలమధ్యా పెరిగిన నాలాంటి అమ్మాయిని భార్యగా కోరే వాడికి పైన చెప్పినవన్నీ ఎదుర్కొగలిగే ధైర్యం వుండాలి. అబ్బాయ్ సత్యానందం, నువ్వు ఇంకా బి. ఏ. లోనే వున్నావ్. ఇంతకన్నాపైకి వెళ్ళగలవంటే నేను నమ్మను— ఈకాలంలోగానీ, మరేకాలంలోనైనాగానీ బ్రతకడానికి కావలసింది డబ్బుగానీ, ప్రేమకాదని తెలుసుకో........'

ఆదెబ్బతో సత్యానందం వారం రోజులు జ్వరపడ్డాడంటే అతిశయోక్తికాదు. మనుస్సులోమాట చెప్పేధైర్యం వకుళకుంది. మనస్సుని మోసంచేసుకునేకన్న అదిమేలు కాదా!

సుమిత్ర యింత బలహీనురాలవుతుందని అతనెప్పుడూ అనుకోలేదు. మనస్సుకి సుశిక్షణలేక పోవడమే యిందుకు కారణం కావచ్చు. ఆలోచించడానికి, 'అయ్యో'అని విచారించడానికి కావలసినంత తీరిక వుండడమే మూలహేతువు. ఉద్యోగంలో చేరడమూ ఒకందుకు మంచిదే అనుకున్నాడు కృష్ణమూర్తి. ప్రపంచ పరిస్థితులూ, వ్యక్తుల మనస్తత్వాలు, సంఘం, వీటన్నిటినీ గురించి తెలుసుకోడం మనోవికాసానికి ఎంతో అవసరంకదా! విభిన్న వ్యక్తులతోపరిచయంకూడా అందుకు దోహదం చేస్తుంది.

నెలరోజులు మామూలుగా గడిచిపోయాయి. సుమిత్రకి కుముదినితో సినిమాకి వెళ్ళడం, షాపింగ్‌లకి వెళ్ళడం అలవాటయి పోయింది.

ఎప్పుడైనా తనురమ్మంటే, "సారీ డియర్, వంట్లో అంత బావున్నట్లు లేదు."అనేది ఎవరో పరాయివాళ్ళకి చెప్పినట్లు..

వకుళా శ్రీనివాసరావు మళ్ళీవొచ్చి రెండు రోజులుండి వెళ్ళారు.

"చెవులకింకా ఆపాత మోడలు దిద్దులే వుంచుకున్నావేం— ఇప్పుడు ముత్యాలు కదా ఫ్యాషన్— ఆమధ్యలో ఒకరకం చీరెలొచ్చాయి చూశావా—అలాంటివి నీవు కొనలేదా—ఈడోర్ కర్టెన్ పాతరకంది. ఇప్పుడొస్తున్నాయి చూడు—అలాంటిదైతే మీకు బావుంటుంది. మేం ఈమధ్య కొన్నాం గార్డెన్‌చైర్స్—చాలాబావున్నాయి. అమెరికా నుంచి మంచి గాగుల్స్ తెమ్మంటున్నా మావారిని......."

వకుళ ఎప్పుడు మాట్లాడినా యింతే. ఆమాటలకి సుమిత్ర ఎలా సమాధానాలు చెబుతుందోనని ఆత్రంగా చెవులురిక్కించేవాడు కృష్ణమూర్తి. చాటుగుండా వినడం తప్పని అతనికి తెలుసు. ఒక్కచిరునవ్వుతో యిన్ని మాటలకి సమాధానం యిచ్చే సుమిత్ర గడుసుదనం చూసి సంతోషించాడతను. ఆమెని గురించి తను చాలా పొరపాటుగా అంచనా వేసుకున్నాడేమో— ఎంతైనా సుమిత్ర అందరిలాంటిది కాదు అనుకున్నాడు మళ్ళీ.

ఓ అందమైన సాయంత్రాన తనకికాఫీ టిఫిన్‌లతోపాటు ఓకవరూ, అంతకు పూర్వం ఎన్నడూ నవ్వి ఎరుగని చాలాఅందమైన చిరునవ్వూ అందించింది సుమిత్ర. ఆమెకళ్లల్లో మెరుస్తున్న విజయగర్వం చూసి అది ఎపాయింటుమెంట్ ఆర్డరని పోల్చుకుని, కవరు విప్పకుండానే.

"కంగ్రాచ్యులేషన్స్ సుమిత్రా— మరి నాకు పార్టీ యివ్వవూ—" అన్నాడుబుద్ధిమంతుడికి మల్లె—

"ఏ ఆఫీసులోనో ఏమిటో చూడకుండా....." అంది సుమిత్ర కళ్లు చిట్లించి.

"మలేరియా శాఖలో మాత్రం కాదని నా నమ్మకం........"

అతనితోపాటు మనస్ఫూర్తిగా నవ్వేసింది సుమిత్ర. ఆమె అంతహాయిగా నవ్వి చాలారోజులై వుండవచ్చును..

ఉద్యోగం కోసం ఆమె చాలా ప్రయత్నించి, చాలా ఆత్రుత చూపిందన్నమాట! ఇటీవలే ప్రారంభించిన ఎయిర్‌కండిషన్డ్ హోటల్లో ఐస్‌క్రీం తినిపించింది సుమిత్ర. విమానంలో ప్రయాణం చేస్తున్నట్లు వుంది అందులోకూర్చుంటే— ఆక్షణంలో సుమిత్ర మనస్సులో ఏంఆలోచనలు వుంటాయా అని వూహించాడు కృష్ణమూర్తి. బహుశా ఆమె, వకుళా శ్రీనివాసరావూ విమానంలో అమెరికా వెడుతూ ఎయిర్ హోస్టెస్‌తో చమత్కారాలు విసురుతూ వుండే దృశ్యాన్ని వూహించుకుంటోందేమో......

సుమిత్ర చాలా సంతోషంగా వుంది. హోటల్లోనుంచి బయటికి వస్తూనే సంపంగి పువ్వులమ్మే కుర్రాణ్ణి పిలిచి డజను పూలు తీసుకుంది. తనకి సంపెంగలంటే, అందునా కొమ్మ సంపెంగలంటే ప్రాణం. మిల్క్ చాక్లెట్లూ, రోజ్‌ఎసెన్సు వేసిన ఐస్‌క్రీం, బంగినపల్లి మామిడిపళ్లూ, విరజాజులూ, కొమ్మసంపెంగలూ—ఇవన్నీతనకి చాలా యిష్టం. వీటన్నింటికన్న సుమిత్ర యింకా ఎక్కువ యిష్టం.


ఆమెప్రక్కన నడిచి ప్రకాశం రోడ్డు వెంట వెడుతూ వుంటే అతని మెదడులోని జ్ఞాపకాల గదులన్నీ ఒక్కమాటు తలుపులు తెరుచుకున్నాయి........

విజయవాడంటే లారీలనీ ఒకరూ, పందులూ బురదా తప్ప ఇంకేం వుందని ఒకరూ ఎక్కడచూసినా రిట్రెడ్‌చేసే టైర్లేనని ఒకరూ, ఇక్కడ జీవించడమే వ్యాపారమైపోయిందని మరొకరూ అంటారు. కానీ తనకి విజయవాడంటే ఎందుకో చాలా యిష్టం....

కృష్ణాబ్యారేజి దగ్గరవున్న చిన్న పార్కులోకూర్చుని సిగరెట్లు వూదిపారేస్తూ సుమిత్రకోసం గంటలకి గంటలు తపస్సు చేసినరోజులు, విజయవాడ రైల్వేజంక్షన్‌లో ఆమెదిగనున్న రైలుకోసం నిరీక్షిస్తూ హిగిన్ బాథమ్స్‌లో డజన్లకొద్దీ పుస్తకాలు కొన్నరోజులు, కనకదుర్గ దేవాలయం దగ్గర కోనేటి మెట్లమీదకూర్చుని కబుర్లాడిన ఘడియలు. అన్నీ అన్నీ అతని మెదడు చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. సినిమా నిర్మాతలూ, చిల్లర కవులూ 'ప్రేమ' అనే మాటకి విలువ లేకుండా చేశారుగాని ఒక్కమాటలో చెప్పాలంటే సుమిత్రని తను ఎంతగా ప్రేమించాడని!

ఇదంతా ఊహాప్రపంచమనీ, వాస్తవికంగా ఆలోచించడం చేతకాదనీ వకుళ అనుకోవచ్చు. ప్రేమా, అనురాగం, సానుభూతి, క్షమ వంటి మానవత్వపు లక్షణాలను పూర్తిగా మరిచి, మరీ 'వాస్తవిక' దృష్టితో ఆలోచించడం మొదలు పెడితే హృదయం శిలే అవుతుందేమో సుమిత్ర అన్నట్టు.

మరి సుమిత్ర ఇలా ఎందుకు ప్రవర్తించింది! తన వాస్తవికతా దృక్పథాన్ని కొంచెం సుమిత్ర తలలో ఎక్కించి వెళ్లిందేమో వకుళ! భోజనాలయాక "నేను చాలా అలసిపోయాను నిద్రవస్తోంది" అంటూ పడుకుని నిద్రపోయింది సుమిత్ర. ఆమెని ఎన్నో అడగాలనీ "మనిద్దరి మధ్య తెరలు దింపకు, ప్లీజ్" అని చెప్పాలనీ అనుకున్నాడు కృష్ణమూర్తి. ఆ అవకాశం యివ్వడం యిష్టం లేని సుమిత్ర నిద్రపోయిందని గ్రహించాడతను — సుమిత్ర ముందు తనెప్పుడూ ఓడిపోతూనే వున్నాడు. ఆ శక్తి ఆమె కళ్లల్లోనే వుండి వుండాలి. మరునాడు ఉదయం ఆఫీసుకు వెళ్లడానికి సుమిత్ర పడుతున్న హడావుడి చూసి నవ్వుకున్నాడు. కొత్తలో అన్నీ అందంగానే వుంటాయి. "సుమిత్రగారు వర్క్ చేస్తున్నారటగా!" అని సోమసుందరం వీలైనంత హేళనగా అడిగినా, "మీకే మోయ్ పట్టిందంతా బంగారమే. ఇద్దరూ చెరి రెండుచేతులా సంపాదిస్తున్నారుగా!" అని సుందరమూర్తి అసూయపడినా, "ఇప్పుడు వదినెకి పని చేయాల్సిన అవసరమేమిటన్నయ్యా? ఆవిడమరీ సుమబాలవంటిది. స్ట్రెయిన్ కదా పాపం!" అని చెల్లి అనసూయ సానుభూతి కురిపించినా అతనికి సుమిత్రమీద కోపం రాలేదు, పైగా ఆమె పట్టుదల, ఓర్పు, దీక్షచూసి ఆశ్చర్యపడ్డాడు కూడా. అతని ఆశ్చర్యం అంతటితో అంతం కాలేదు. ఫస్టుతారీకు సాయంత్రం చాలా ఆలస్యంగా దాదాపు ఏడుంబావుకి యింటికి వచ్చి చేతిలో ప్యాకెట్‌ని టీపాయ్‌మీద పెట్టి అలసటగా సోఫాలోకి చేరబడింది సుమిత్ర. టీపాయ్‌మీద అందంగా ఆసీనమైన ఆపొట్లాంలో [illegible] వూహించగల [illegible]



బోరున్న అంచుగల పట్టుచీరె అయివుంటుంది అనుకున్నాడు కృష్ణమూర్తి. నెల రోజులుగాతన జవరాలి నుదుటికిపట్టిన స్వేద బిందువులన్నీ ఘనీభవించగా తయారైన చీరె అది! ఎంత అందమైనదోగదా! అంత క్రితమే హోటల్‌నుంచి తెప్పించిన కాఫీ ఫ్లాస్కులోనుంచి కప్పులోకి వొంచి ఆమె కందిస్తూ "చాలా అలసి పోయావు". అన్నాడు ప్రేమగా.

ఫస్టుక్లాసు రావాలని చాలా కష్టపడి చదివి, పరీక్షలు చాలా సంతృప్తికరంగా వ్రాసి ఇంటికి వచ్చిన విద్యార్థిలో వుండే అలసటా, తృప్తీ, సంతోషమూ సుమిత్రలో కనిపిస్తున్నాయి. నిజానికి జరీ హంసల బోరున్న పట్టుచీరె కోసం సుమిత్ర యింత కష్టపడే అవసరం లేదు. తనతో మాటమాత్రం అంటే వెంటనే కొనితెచ్చేవాడు. యాభై రూపాయలకన్న ఎక్కువ ఖరీదుగల చీరెలుకట్టకూడదని అది తన ఆదర్శానికి విరుద్ధమనీ సుమిత్ర ఎప్పుడూ చెబుతూ వుండడం వలన ఆమెకి ఇంత ఖరీదైన చీరెలు యిష్టం వుండదనుకున్నాడు. స్త్రీ బుద్ధి అతి చంచలమని పూరికే అన్నారా పెద్దలు!

కాఫీకప్పు టేబిల్‌మీద వుంచి, బట్టల ప్యాకెట్ విప్పడం మొదలు పెట్టింది. సుమిత్ర. గారడీవాడు టోపీలోనుంచి కుందేలుని తీసినట్లు అందులోంచి గచ్చకాయరంగు టెరిలిన్ సూటింగ్ తీసి అతని వొడిలోకి విసురుతూ, "ఎలావుంది నా సెలక్షన్?" అంది గర్వంగా.

దాదాపు ఆమె జీతమంత ఖరీదైన ఆ సూటింగ్‌క్లాత్‌ని చూస్తూ నీళ్లు కారిపోయాడు కృష్ణమూర్తి.

"ఇదేమిటి సుమీ. ఇదేమిటిలా చేశావు? నేనెప్పుడైనా ఇలాంటివి వేసుకున్నానా? ఎందుకు తెచ్చావు చెప్పకుండా!...ఎందుకు. ఎందు......" ఇంకేమీ అనలేకపోయాడు.

"మీకు పెళ్లయిన తరువాత మూనాన్న ఏముచ్చటా తీర్చలేక పోయారు..... అంచేత మీకోరిక నేను తీరుస్తున్నాను. నామూలంగా మీకు కలిగిన నష్టాన్ని పూర్తిచేసే బాధ్యతని నేను పైన వేసుకున్నాను.." సుమిత్ర తలవంచుకుని చాలా నెమ్మదిగా గంభీరంగా ... .

ఆమెవ... ట్లాడుతోందో అర్థమయ్యేసరికి స... అక్కడలేదు. గదిలో అద్దం ముందు ...బడి కళ్లు తుడుచుకుంటోంది.

అతనివొళ్లో అచేతనంగా పడివున్న గచ్చకాయరంగు టెరిలిన్ గుడ్డ అతన్ని పరిహసించింది. దానిబదులు ఆపొట్లంలో హంసల బోరు జరీ అంచు పట్టుచీరె వుంటే అతనెంతో సంతోషించేవాడు. తన ముచ్చట తీర్చడానికి సుమిత్ర యింత కష్టపడుతోందన్నమాట! తనముచ్చట ఖరీదు ఒక అమాయకురాలి స్వేదబిందువులా. సుమిత్ర తనకింత శిక్ష ఎందుకు విధించినట్లు?

గబగబవెళ్లి ఆమెభుజాలు పట్టుకుని వూపుతూ "ఏం జరిగిందోచెప్పవ్? ఎందుకు ఏడుస్తున్నావ్? నాతో చెప్పక ఎన్నాళ్ళు దాచుకుంటావ్! చెప్పవూ? నాసుమిత్రవి కాదూ? "అన్నాడు.

ఆక్షణంలో సుమిత్ర చాలా చిక్కిపోయినట్లు అనిపించిందతనికి.

సుమిత్ర అతని చేతులు విడిపించుకుని వెనక్కి జరుగుతూ అన్నది, "ఆరోజుమీరు వకుళతో మీ కష్టసుఖాలన్నీ చెప్పుకున్నారుగా! మీ మనసు, నాకర్థం అయింది. మీముచ్చట....." ఆమె కంఠం వొణికింది.

అతనికి గుర్తువచ్చింది.. అవును వకుళతో.....కానీ, సుమిత్ర తనని ఎందుకిలా అపార్థంచేసుకుంది! తనకామె అంటే విముఖత్వం ఎప్పుడూ కలగలేదు. అప్పట్లో ముచ్చట్లపై మమకారం అసలు లేదు.

"ఆరోజేమిమ్మల్ని అడగాలను కున్నాను. కానీ అడగాలనిపించలేదు. నామూలంగా మీకు జరిగిన నష్టానికి......"

"ఛవ్" కృష్ణమూర్తి అసహనంగా అరిచాడు,

"మీ ఆడవాళ్లకి హృదయాలుండవ్— మీరు పాలని నీళ్లంటారు—నీళ్లని పాలంటారు —" అన్నాడు.

సుమిత్ర మళ్లీ కళ్లు తుడుచుకున్నది.

"అపార్థం చేసుకోడం తేలిక.. అర్థం చేసుకోడం కష్టం—" అన్నాడు కృష్ణమూర్తి. అక్కడున్న మంచంమీద కూర్చుని సుమిత్రవైపు తీవ్రంగా చూస్తూ....

"మిమ్మల్ని అపార్థం చేసుకున్నన్ని రోజులూ హాయిగానే గడిచి పోయాయి. అర్థం చేసుకున్నప్పటినుంచే బాధగా వుంది. మేకప్ చెరిగిన సినీ తారని చూసినంత బాధగా వుంది.!....."

"నీకు తెలీదు సుమీ! నేను చాలావుంచి వాణ్ణి కనుకనే నీమూడ్‌ని అనుసరించి నడుస్తున్నాను. ఇంతగా ఎడ్జస్ట్ అయిపోయే భర్త ఎన్నివేలు గుమ్మరించినా దొరకడుగాక. దొరకడని తెలుసుకో! లక్షలతో వ్యాపారం చేస్తూ పట్టుచీరెలే ధరించే వకుళకి నీకు దొరుకుతున్నంత హాయి దొరకడం లేదనీ ఆమెకన్న నువ్వే సుఖంగా వున్నావనీ తెలుసుకుంటే యింకా సుఖపడిపోతావు— లేకపోతే మనిద్దరికీ అశాంతి తప్పదు" హితబోధ చేస్తున్నట్లు అన్నాడు కృష్ణమూర్తి.

"నేను వకుళని చూసి అసూయపడుతున్నాననుకున్నారు కాబోలు! నాకదేం లేదు మీరే శ్రీనివాసరావు మామగారిలాంటి మామగారు దొరకలేదని చింతపడుతున్నారు"నీకైనంత కోపంగా అంది సుమిత్ర.

"మళ్లీ చెబుతున్నాను— అపార్థంచేసుకుంటున్నావ్!" బెదిరించాడుకృష్ణమూర్తి."

"మీరే నన్ను అపార్థంచేసుకున్నారు!"

"నేను శ్రీనివాసరావుని ఫ్లాటర్‌చేద్దామనీ, ఏడిపిద్దామనీ అలాఅన్నానుగానీ, నీసాక్షిగా నాకలాంటి అసంతృప్తి ఏదీలేదు సుమీ—" అన్నాడు కృష్ణమూర్తి జాలిగా.

ఈసారి సుమిత్ర వెనక్కి తిరిగి అతని ముఖంవంక చూసింది. "అతనుచెప్పేది నిజం—నమ్ము" అంటోంది. అతనివదనం.

"ఏమో మీ దిష్టమనీ నాకేంతెలుస్తుంది నేనలా అనుకున్నాను—"అన్నది జాలిగా రిపోతూ....

స్నేహితుడు జగన్నాథం ఒకసందర్భంలో అన్నమాటలు జ్ఞాపకంవచ్చాయి కృష్ణమూర్తికి "స్త్రీలు చాలా సుకుమార హృదయం కలిగి వుంటారు భాయ్! ప్రతి విషయాన్ని భూతద్దంలో చూసి ఆలోచిస్తారు. విద్యావంతులు మరీను. అంచేత వాళ్లతో మాట్లాడేటప్పుడు మనం చాలా జాగ్రత్తగా వుండాలి. వాళ్ళని మనం చాలా అపురూపంగా చూసుకోవాలిసుమా" అని!


వకుళనుచూసిన అసూయతో నామనస్సు నిజంగా చెదరలేదా? అని తనని తాను ప్రశ్నించుకుని కృష్ణమూర్తివైపు చూసింది సుమిత్ర. ఆక్షణంలో 'నిజంగా శ్రీనివాసరావుని ఫ్లాటర్ చేయాలనే తాను మామగార్ని గురించి చెప్పాడా?' అని అంతరాత్మని అడుగుతున్నాడు కృష్ణమూర్తి.

ఏమైనా వాళ్లిద్దరి మనస్సులూ అపుడు పశ్చాత్తాపంతో నిండి పోయిన మాట నిజం.

రూపానికీ గుణానికీ సంబంధం

- వి. శేఖర్ -


వైజ్ఞానిక గాథావళి-69. డాక్టర్-



1914 నుంచి 1918 వరకూ జరిగిన జర్మను యుద్ధము పూర్తి అయ్యేముందు జెప్లిను అన్న జర్మను యుద్ధనౌక ఇంగ్లీషు దిగ్బంధమునుంచి తప్పుకుని హిందూమహా సముద్రములోకి వచ్చి, మద్రాసుమీదా సింగపూరుమీదా ఫిరంగులు పేల్చింది. తన పొగ గొట్టాల సంఖ్యని మార్పిడిచేస్తూ, దాన్ని చూసిన విదేశీ నౌకకి దేనికేనా "ఇది జెప్లిన్ కాదు. దానివి రెండుకదూ గొట్టాలూ !" అన్న ఏమార్పు కలిగించింది. గొట్టాల సంఖ్య మారగానే ఓడయే మారిందనే అపోహ కలిగింది శత్రు నావికులకు కూడా. మన ఇళ్ళలో ఆడవారు వారి చీర వీరు కట్టి మసలుతూన్నప్పుడు, వీరువచ్చి వెళ్ళినప్పుడు వారేవచ్చి వెళ్ళేరనుకోడము అప్పుడప్పుడు జరుగుతూంటుంది. చీరె రంగుల పోలిక అసలు మనిషి ప్రత్యేకతని ఆచ్ఛాదించేస్తుంది అన్న మాట. మారీచుడు 'హా సీతా, హా లక్ష్మణా' అని అరిచినప్పుడు, శ్రీరాముని గొంతు బాగా ఎరిగిన సీతమ్మే ఉపడి లక్ష్మణుణ్ణి పంపేసింది. ఆ కేక యొక్క అర్థము రేపిన భయము, కంఠము యొక్క ప్రత్యేకతని కప్పేసింది. ఈ ఉదాహరణలలో కన్నూ చెవీ అన్న రెండింద్రియాలు రూపసాదృశ్యమూ, వాక్య సాదృశ్యమూ బట్టి వస్తుతత్వాన్ని గుర్తించడములో పొరపాటే పడ్డాయి.

అయితే, వాసన దగ్గరకు వచ్చేసరికి ఇలాటి ఏమార్పు సాధ్యమా? అన్న ప్రశ్న చిత్రమైనది. కొత్తిమిరి నల్లివాసన అనీ, నీళ్ళచారు మూత్రపు వాసన అనీ అన్నవారున్నారు. వీరి ఏ మార్పుకి కారణము ఏమిటీ అని ఆలోచిస్తే రెండు జవాబులు సాధ్యము. [కొత్తిమిరి వాసనకు కారణమైన అణువులు (molecules) గాలిలో తేలుతూ దాన్ని పీల్చినవారి ముక్కులో వాసనను పట్టే నరాల కొసలకు తగులుతాయి. ఈ అణువులు—మాట సామ్యానికి—అంటింతల వలె అక్కడ అంటుకుని వాసన జ్ఞానానికి కారణమైన కలతని రేపుతాయి అందాము. మన శరీరానికి చీపురుముల్లు బాధా అంటింతల బాధా పల్లేరుముల్లుబాధా వేర్వేరుగా తెలిసేటట్లే ముక్కులోని వాసన నరాలకు కూడా వేర్వేరు వాసన అణువుల 'జిల' వేర్వేరుగా తెలుస్తుంది అందాము.] "కొత్తిమిరి వాసన అణువులూ నల్లివాసన అణువులూ సంఖ్యలోనే భేదముకాని అసలులో అవేనూ, అందువల్లనే ఆ వాసనకీ ఈ వాసనకీ సాదృశ్యము కనపడుతుందీ" అన్నది పై ప్రశ్నకు ఒక జవాబు. రెండో జవాబు చాలా చిత్రము: "కొత్తిమిరి వాసన అణువులకూ, నల్లివాసన అణువులకూ రూప సాదృశ్యమేదో ఉన్నదీ, ఆ సాదృశ్యాన్నిబట్టి వాసన నరాలకు ఈ రెండు కలిగించే జిలా ఒక లాగే తోచుతోందీ" అన్నది రెండో జవాబు.

ఎమిల్ ఫిషర్ అన్న అంగార రసాయనజ్ఞుడు రోగకారక జీవులూ, మందులూ, వేక్సీనులూ ఏ రీతిగా పనిచేస్తాయీ అన్న సమస్యకు చిత్రమైన జవాబు వూహించాడు. రోగ కారక క్రిములకూ, అవి తగులుకుని క్షీణింపచేసే శరీర జీవకణాలకూ, తాళము చెవికీ తాళము కప్పకూ వున్న సంబంధము లాంటిది ఏదో వున్నదన్నాడు. ఆ తాళపు కప్పకు ఆ చెవిమాత్రమే పట్టి విడదీసేటట్టుగా, రోగ కారకక్రిమి తాళముచెవియై తనకు అనుకూలమైన శరీర జీవకణాల్ని పట్టి విడదీసేస్తుందట. ఇక మందు లోని కణాలు—'అణువుల'నీ, 'పరమాణు కుటుంబాల'నీ కూడా అనవచ్చును—శరీర జీవకణాలతో రూప సాదృశ్యము కలిగి, రోగకారక క్రిములకు తాము అవే అన్న అపోహ కలిగించి గాలపు సూది చేప నాకర్షించగలిగినట్లుగా ఆ క్రిములను ఆకర్షించి, హత మారుస్తాయట! ఈ వూహని డాక్టర్ విలియమ్ ఎఫ్. కీఫరు సానబట్టేడు. హారతి కర్పూరము అణువుల నిర్మాణము బొమ్మలో చూపించాము. ఇదీ ఆ అణువుల పరమాణు



వ్యూహము. (అయితే సేనా వ్యూహము పొడవూ వెడల్పూ వుండే నేలమీద పరుచుకుంటుందీ అణువుల పంజరము పొడవూ, వెడల్పూ, ఎత్తూలతో ఆకాశము (space) లో కొంత పరిమాణము (volume) ఆక్రమిస్తుంది.

పటములో 'క', 'ఉ', 'ఆ' లు కర్బన, ఉదజని, ఆక్సిజను పరమాణువులు. 'మి' అన్నది మిథేనుగుంపు. 'క' అన్న కర్బన అణువు చతుర్బాహువు. నాలుగు చేతుల లోనూ నాలుగు ఇతర 'చేతుల'ను పట్టుకుంటుంది. గీతలు స్నేహ బాహువులు. ఈ మొత్తపు గుంపు హారతి కర్పూరపు అణువు. ఏ బాహువు అవతలి కొసనైనా ఒకే బాహు వున్న పరమాణువు ఉండడము సాధ్యము. కీఫరు ఈ బృహదణువులోని 'మి' థేను గుంపునకు బదులు ఒకే బాహువున్న క్లోరీను అణువును నిలిపి కృతక 'హారతి కర్పూ

రవు' అణువును నిర్మించడానికి శ్రమించి కృత కృత్యుడయ్యాడు. ఆ పదార్థాన్ని వాసన మాస్తే అది హారతి కర్పూరపు వాసనే వేసింది! అంటే ఏమన్నమాటా? రూప సామరస్య మున్నచోట వాసనా సామరస్యము కూడా ఉన్న దన్నమాట. విన్యాస నిర్మాణములో—అంటే పరమాణు రకాలలోనూ వాటి సీట్లలోనూ భేదమున్నప్పటికీ, ఘ్రాణేంద్రియము మీద, రూపసామ్యముగల ఆ అణు పంజరాల ప్రభావము సమమే నన్నమాట. ఈ లెక్కని కొత్త శర్కరలూ, రంగులూ, మందులూ—కృతకంగా తయారు చేయవచ్చునూ, చేస్తున్నారుకూడానూ. పెనిసిలీను పనిచేయక మొద్దుబారిన శరీరఘులలో ఉపయోగించడానికి, పెనిసిలీను శక్తికుమించిన శక్తిగలిగిన క్రిములను నాశనము చేయడానికి ఈకృతక నిర్మాణ పద్ధతి—కీఫరు ప్రారంభించినది—బాగా పనికివస్తుంది. ●

సీరియల్

మూలం. రామచంద్ర ఠాకూర్

ఆమ్రపాలి

అనువాదం ఆకెళ్ల సీతారామం

జరిగిన కథ

ఆమ్రపాలి అందచందాలను గురించి విన్న మగధరాజు బింబిసారుడు ఆమె నెలాగైనా తన దాన్ని చేసుకోవాలనే ఉద్దేశ్యంతో సంజయుడు, మరికొంతమందితో కలిసి వైశాలీ నగరంలో పుత్తళికల సూత్రధారుడుగా ప్రవేశిస్తాడు. రేవా ఆదేశానుసారం పాలి భవనంలో ప్రవేశిస్తాడు పుత్తళికల సూత్రధారుని వేషంలో ఉన్న బింబిసారుడు. ఆ కర్షకుడగు పుత్తళికల సూత్రధారునిపై పాలి దృష్టిపడుతుంది. బింబిసారుడు నేర్పుతో ఆనందుడినీ, పాలినీ ఆపదనుంచి తప్పిస్తాడు. పాలి, బింబిసారులు ఉద్యానవనంలో కల్సుకుంటారు. ఇరువురిహృదయాలలో ప్రేమ అంకురిస్తుంది. పాలిని గురించిన తగాదాలో ముగ్గురు లిచ్ఛవీయులు, అయిదుగురు పరదేశీయులు ప్రాణాలు విడుస్తారు. పాలి, బింబిసారుల హస్తాల్ని పరీక్షించి కోర్కెలు నెరవేరుతాయని చెప్తాడు వేదాంతి. అభిరాముడు వేదాంతిని గౌతమునివద్దకు తీసి కెళ్తాడు.

10

వేదాంతి ఒగరుస్తూ ఇటూ అటూ చూశాడు. ఎవరూ కన్పించకపోవడంవల్ల అతడు అభిరామునివైపు వ్యంగ్యపూరిత నేత్రాలతో చూశాడు. అభిరాముడు వ్యాకులంతో అటూ యిటూ పరుగెత్తసాగాడు. అతడు దేవాలయాన్నీ, దేవాలయానికి సమీపంలో బలహీనమైన గోడలతో నిర్మితమైన ధర్మశాలలోనూ తిరిగి వచ్చాడు. కాని అతని కెవ్వరూ కన్పించలేదు. వేదాంతుడింకా అభిరాముని వైపు నిశితదృష్టితో చూస్తున్నాడు. అతడన్నాడు—

'అభిరాముడా, నీవు నేటి మాట చెప్పుతున్నావా? లేక నాలుగు నెలల్కిందటి మాటా?'

'నే నేమి తాగి మత్తెక్కి ఉన్నాననుకుంటున్నావా? నాలుగు నెలల్కిందటిమాట చెప్పడానికి నేడెందుకు పరుగెత్తుకొని వస్తాను?'

'నీ పని ఏది సాధారణంగా ఉంటుంది? ఐదు సంవత్సరాలనాటి విషయం నీ వొకసారి రాత్రి నన్ను నిద్రలేపి చెప్పసాగావు!'

'అది ఆత్మను గురించిన విషయం. ఆధ్యాత్మికమైన అసంతృప్తికి చెందిన విషయం.

'మంచిది. ఒక్కసారిగా, ఒక్క క్షణంలో నీ జీవితంలోని ఆధ్యాత్మికమైన అసంతృప్తి దూరమవునట్లూ, దానికై నన్ను కూడా ఇక్కడికి ఈడ్చుకొని వచ్చునట్లూ చేసిన శాక్యముని మాటలేవో నాకు చెప్పు!'

'వేదాంతి, నీవు వేదములలోని మాటలు స్వీకరిస్తావుకదా?'

'నీ శాక్యముని ఒప్పుకుంటాడా?'

'ఒప్పుకోడు.'

'ఆత్మను స్వీకరిస్తాడా?'

'నీవు దేనిని ఆత్మ అనుకుందువో దాన్ని అతడు సమ్మతించడు..'....'

'పరలోకముందని ఒప్పుకుంటాడా?'

'ఒప్పుకుంటాడు, ఒప్పుకోడు కూడా.'

'అయితే నే నా మనుష్యుడి ముఖం చూడను. పాలను గురించి తర్కించపగోరేవాడు పాలనైనా చూడకపోతే వానితో వాదించడం ఎలాగ, అభిరామా?'

'కాని, సోదరా, పాలను చూడకయే పాలను గురించి తర్కించు తెలివిలేని పని నీవు చేస్తున్నావు. నీవు శాక్యమునితో సంభాషించావా?.....లేదు. తర్కించావా? లేదు! అయితే నీవు నిన్నే ద్వేషించుకుంటున్నావు. దేన్ని చూడలేదో, దేన్ని గురించి కొంచెమైనా వినలేదో, ఎవరి సిద్ధాంతాలను అర్థం చేసుకోలేదో వానితో అకస్మాత్తుగా 'నీకేమీ తెలియదు' అని అనడం తెలివిలేమిని ఎంతగా చాటుతుందో నీవే చెప్పు'

వేదాంతి అభిరామునివైపు ఒక క్షణం పాటు చూస్తూ ఉన్నాడు అభిరాముని ముఖం మీద అతని కేదో అలభ్యమైన వస్తువు దొరికినట్లు అతని కళ్లల్లో అభిమాన పూరితమైన జ్యోతి వెలుగుతోంది.అతడుచూస్తూనే ఉన్నాడు. అతడు శూన్య యక్ష మందిరం వైపు చూశాడు. మనుష్యహీనమైన సత్రం వైపు చూశాడు. చంద్ర విహీనమైన ఆకసం వంక చూశాడు. సప్తర్షులు ఒకవైపు పారిపోగోరుతున్నారేమో అన్నట్లుంది. మెల్లగా అతడు తలవాల్చి, 'శాక్యముని గౌతమబుద్ధుడు..... గౌతమబుద్ధుడు.....' అన్నాడు.

అప్పు డతని కేదోమాట తలపుకి వచ్చినట్లయింది. అతడు లేచి నిలబడ్డాడు. సాంధ్యకర్మకు పర్ణశాల దిక్కుగా సాగాడు.

అభిరాముడు నిర్నిమేషదృష్టితో వేదాంతి వేపు చూస్తున్నాడు. అతని పెదవులు విజయంవల్ల గంభీరహాస్యంచేత కదలుతున్నాయి. జీవితంలో మొదటిసారిగా వేదాంతి విజితుడు అవుతున్నట్లు కన్పించాడు. వేదాలను మన్నింపని, ఆత్మపరమాత్మల వివేచనాన్ని వేర్వేరు విధాలుగాచెప్పే శాక్యముని వేదాంతిని పెద్ద చిక్కులో పడవేశాడు. ఆలోచనలనెడి ఈ ప్రవాహంలో—వేదాంతి ఎక్కడ ఆగిపోయాడో—ఆ చోటుకు నిన్నమొన్నటి శాక్యముని— ఒక క్షత్రియకుమారుడు దాటిపోయాడు. అభిరాముడు వేదాంతి మనస్సులోని అసమంజస భావాలను తెలుసుకున్నాడు. అందుచేత అతడు వేదాంతి వీపువైపు రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

ఆనందుడు సరిహద్దులోని తగవుల్ని పరిష్కరించడానికి అన్య గ్రామీణులతో కలిసి వెళ్లాడు. అత డెప్పుడు వచ్చి తన పాదాల చెంత కూర్చున్నాడో అభిరామునికి తెలియదు. ఆనందుడు మెల్లగా ఏదో మాట్లాడడానికి మొదలు పెట్టగానే అతనికి తెలిసింది.

'తాతా, నేను శాక్యమునిని చూశాను. అతనికి శ్రావస్తినగరంలో అనాథ పిండికుడి దగ్గరనుండి పిలుపు వచ్చింది. అత డక్కడికి పోయాడు. చాలా విచిత్రమైన పురుషుడు తాతా! నే నతణ్ణి కత్తితో చంపడానికి వెళ్లాను. కాని చంపలేకపోయాను'

'ఆఁ, దుష్టుడా. ఏమన్నావు? నీవు నా ప్రభువుపై చెయ్యి ఎత్తావా?'

'అవునుతాతా, మల్లరాజు గోపాలుడు సరిహద్దు తగాదాలో నా యెదుటికివచ్చి నిలబడ్డాడు. చూస్తూండగానే పరిస్థితి ముదిరింది. రెండు గ్రామాల పంచాయతీదారులు దీనిమధ్య పడ్డారు. కాని, గోపాలుడు ఒప్పుకోలేదు. అతడావేశంతో నిండిపోయాడు. ఆ సమయంలో శాక్యముని తన మిత్రమండలితో అక్కడికి వచ్చాడు. అతడు మమ్ము

శాంతింప చేయడానికి యత్నించాడు. 'తుచ్ఛ విషయాలకై మనుష్యులను హింసించడం అజ్ఞానుల—మూర్ఖుల పని' అంటూ అతడేవో చెప్పాడు. నాకు కోపం వచ్చింది. కత్తి తీసుకొని అతనివైపు పరుగెత్తాను. కాని, ఆహా, నేను అతని ప్రబలమైన చిరునవ్వును నశింపచేయలేకపోయాను. నాకాళ్లు హఠాత్తుగా వణకసాగాయి. నా చేతులు ఆకాశంలోనే ఉండిపోయాయి.....'

'అప్పుడు, దుష్టుడా, నీవేం చేశావు?'

'అప్పుడు మందహాసంచేస్తూ అతడు ముందుకుసాగాడు. అతడు నా చేతిలోనుంచి కత్తితీసుకొని ఒరలో ఉంచాడు. ఆ చిరునవ్వు ముఖంతోటే అతని వైపు చూచి అత డా కత్తిని కూడా ఒరలో ఉంచి చెప్పసాగాడు—'

'ఏమి చెప్పను ఆనందా? అతడేం చెప్పాడు?'

'వైరంచేత వైరం ఎన్నటికి నష్టం కాదు. ప్రేమ మూలంగానే సమస్త వస్తువుల మీదా అధికారం ప్రాప్తిస్తుంది. ఇదే సనాతన ధర్మం' అని అతడన్నాడు.

'ధన్యుడను ప్రభూ .... తరువాత చెప్పుబిడ్డా!'

'ప్రేమతో వశ మొనర్చుకునే మాటలు నేను ఎప్పటినుండో వింటూ వస్తున్నాను. కాని శబ్ద చమత్కారం అతని ముఖంలో ఎంతగా తోచిందో దాన్ని నే నెక్కడా ఎన్నడూ చూడలేదు. అతని చిరునవ్వు నా హృదయాన్ని పరిశోధిస్తూ ఉన్నదేమో అని నాకు అనిపించింది. నా శక్తినంతా ఆ మందహాసం హరించింది. నేను తెలివి తప్పాను. నా తల ఆ సన్యాసి.....'

'మునియొక్క—' అని అభిరాముడు పొరపాటు సరిచేశాడు.

'ఆ ముని పాదాలపై బడింది.....' ఆనందుడు తన తప్పు దిద్దుకొని అన్నాడు—'మల్లరాజు గోపాలునితోపాటు నేనూ నా తలను ఆ సన్యాసియొక్క.....'

'శాక్యమునియొక్క—'

'శాక్యముని కాళ్లమీద వంచాను. అప్పుడాతడు మమ్మాశీర్వదించాడు. మా ఇద్దరినీ ఎత్తి హృదయానికి హత్తుకున్నాడు. మేము విరోధాన్నంతా మరచిపోయి ఒకరి నొకరు ఆలింగనం చేసుకున్నాం. మేము ఒకరి బాహుపాశాలనుండి ఒకరు విడువడ్డాము. శాక్యముని తన శిష్యులతోకూడా నదికి అవతల వైపుకి—నదిలోని శాంత జలంమీద, కిరణాలను వెదజల్లేజాజ్వల్యమానమైన సూర్యుని వైపు—దూరంగా పోతున్నప్పుడు మాకు తెలిసింది. తాతా, కన్నీటితెర నన్ను అంతకంటె స్పష్టంగా చూడనివ్వలేదు. 'అతడు మనలను విడిచి వెళ్లాడుకాని, మన హృదయాల్ని తీసుకుపోయాడు' అని మల్లరాజు సత్యాన్నే పలికాడు. నీవు అతణ్ణి కలుసుకొన్నావా, తాతా?'

జేసి వెళ్లిపోయాడు. ఒక్క సంఘటనతో అతడు అభిరాముణ్ణి, ఆనందుణ్ణి, గోపాలుణ్ణి తనవాళ్లనుగా చేసుకున్నాడు. ఆనందుడి ప్రశ్నకు ఉత్తరంగా అభిరాముడు తల వూపాడు. అతడి కళ్లు అశ్రుపూరితాలవుతున్నాయి. అతడు మెల్లగా నిలబడి, ఉన్మత్తావస్థలో, దగ్గర కూర్చున్న ఆనందుని



అభిరాముని కళ్లనుండి అశ్రువులు చిందుతున్నాయి. నిబిడాంధకారంలో విద్యుత్కాంతి కిరణం ఒకటే చతురుడైన మనుష్యునికి మార్గం చూపిస్తుంది. అలాగే శాక్యముని అభిరాముని హృదయాన్ని ప్రకాశింప

చెయ్యి పట్టుకుని మహలువేపు సాగాడు.

* * *

ఆ చంద్రుడే, ఆ ఉద్యానమే, ఆ పాలీ బింబిసారులే. కాని అది అర్ధరాత్రికాదు. అది మూడు దినాలు—కాదు ఏడుదినాలు

గడచిననాటి రాత్రి.

వేదాంతి భవిష్యవాణి చెప్పిననాటి సాయం కాలంనుండి నేటివరకు పాలీ బింబిసారుల మధ్య హృదయాలలోని భావాల ఉత్థాన పతనం విచిత్రరూపం ధరించింది. వేదాం తిని కలిసికొన్న రెండవనాటినుండే పాలి బింబి సారుణ్ణి ప్రేమ, భయాల మిశ్రితభావంతో చూడసాగింది. ఒకవిధమైన సంశయం, ఒకవిధమైన వియోగంయొక్క పూర్వాభా భాసం క్రమంగా పాలి హృదయంలో ప్రక టితం కాసాగింది. పాలి ఇటువంటి భావాలను సమూలంగా నష్టపరచడానికి ప్రయత్నిం చింది. అవి అప్పుడప్పుడు అంతర్హితం అవు తున్నాయి. కాని అప్పుడప్పుడవి మళ్లీ వెలువడి ఇద్దరికీ అశాంతి కలిగిస్తూం టాయి.

ఈ ప్రేమికులిరువురి మధ్య సరస సంభాషణం ప్రారంభమైనప్పుడు పాలి తన శక్తులన్నింటినీ కూడలీసుకొని మనస్సును బలవంతంగా అణచి సగం విషయాన్ని వదలి లేచి పోతూండేది. ఒకప్పుడు మహలు వెలు పలకైనాపోదు. ఒకప్పుడు బింబిసారుడికి కన్పించకుండా ఉండడానికి ఏదో పని వంక పెట్టి ఆనందుని దగ్గరకో, అభిరాముని దగ్గరకో, లేక వేదాంతి దగ్గరకో పారి పోతూండేది. కాని ఆమె మనస్సును అతి కఠినంగా అణచినప్పుడుకూడా అభయంతో కూడిన ప్రేమ కలుగుతూనే ఉండేది. హృదయం అప్పుడు వశంలో ఉండదని ఆమెకుతోస్తూండేది. నిజం కూడాఅంతే!

ఉదయంనుండి మిషతో దాగివున్న పాలి మరోవంక వెదకి బింబిసారుణ్ణి కలియడానికి పరుగెత్తివస్తూండేది. మనస్సును ఎంత కఠి నంగా కట్టివేసేదో అది అంత సరళంగా అయిపోయేది. బింబిసారునిలో అటువంటి విశేషం ఏముందో ఎవరి కెరుక. అతని కళ్లల్లో కళ్లు కలియగానే పాలికి ప్రతి అంగమందూ ఒక అననుభూతమైన కంప నం కలుగుతూండేది. అతని ముఖంలో హాస్యరేఖచూచి నిశ్చిత విషయాన్ని నిర్వ ర్తింపలేకపోయేది. బింబిసారుని ప్రేమ పూరితాలైన మాటలు ఆమె ఆత్మాభి మానాన్ని అపహరిస్తున్నాయి. బింబిసారుణ్ణి కలుసుకోకూడదని అనేకసార్లు నిశ్చయించు కొని కూడా పాలి తరచు అతణ్ణి చూడగానే అది మరచిపోయి అతనితో మాట్లాడడానికి కూర్చుంటుంది.....మరి బింబిసారుడు?.....

అతడు స్త్రీనీ, యవ్వనాన్నీ బాగా మర్దించాడు. కాని స్త్రీ ప్రేమ—విశు

ఆమ్రపాలి

ద్ధమూ, యవ్వన సులభం అయిన మైకంతో పరివేష్టితమైన యువతియొక్క నిర్మల ప్రేమ—అతనికి ఆమ్రపాలిలోనే లభించింది.

పాలి ప్రథమ దర్శనంతోనే పాలి తనదని అతడు తెలుసుకున్నాడు. ఈ విషయం అత నికి అనుభవానికి వచ్చింది మొదలు, అతనికి ఉన్న జ్ఞానంకూడాపోయింది. ఎవడిని ప్రశం సించడానికి ప్రజలు అలసట చెందకుండా ఉన్నారో ఆ చపలుడూ, బుద్ధిమంతుడూ అయిన బింబిసారుడు కిశోరావస్థలో కాలు పెట్టగానే సామాన్య యువకునివలె పిచ్చి వాడై రాజ్యమునూ, దేహమునూ, దేశమునూ సర్వమునూ మరచిపోయాడు. పాలీ, తనూ రెండు కాకుండా ఒకటే అనే ధృఢ విశ్వాసం అతనికి కలిగింది. నవ్య ప్రభాతంలో ఎవరై అయినా చంచలమైన దాసి వీణాగానం పాలి పాదాలను కూడా చలింపచేస్తాయి. సువా సనగల సుకుమార కుసుమాలనుకోస్తూ, పక్షులను పట్టుకొని, మయూరీ మయూ రాలనూ, హరిణాలనూ పిలిచి పిలిచి పాలి నాట్య మాడడానికికూడా ఆరంభించినప్పుడు ఆ వీణాగాన నాదాలకు ముగ్ధుడై బింబి సారుడు వృక్షము మాటునుండి నర్తకిపాలిని చూచేవాడు. పాలి నిస్పందేహంగా ఒక నేర్పు గల నర్తకి.

పాలి నిర్భీతి, ఆమె బుద్ధి కౌశలం ఆమె సంపూర్ణ వికసిత శరీర సౌష్ఠవం బింబి సారుణ్ణి ఓడించివేశాయి. అప్పుడప్పుడు అతడు పాలిని చూడగానే ఆమెను బాహు పాశంలో బంధించడానికి ఉన్మత్తుడవుతూం టాడు.

అప్పుడప్పుడు పాలి గాఢ నిద్రలో మునిగిఉండగా ఆమెను గంటల కొలదీ అట్లే చూడ్డానికి ఉవ్విళ్లూరుతాడు. ఒకప్పుడు రాత్రి మేలుకొని, తోటలో ఆ కొయ్యతిన్నెమీద కూర్చుండి పాలి శయనా గారంవైపు ఎంతోసేపటివరకూ రెప్ప వాల్చ కుండా చూస్తాడో తెలియదు. నిరంతరం జాములకొద్దీ పాలితో సంభాషించడానికి అతడు వ్యాకులపడతాడు...... పాలిహాస్యాని కతడు ప్రఫుల్లుడవుతాడు. పాలి ఎడ బాటుకి కలతపడతాడు. పాలి రోషానికి ముగ్ధు డవుతాడు. పాలి కోపాని కతడు ఆత్మా ర్పణ చేస్తున్నాడు....

ఇద్దరూ కలవగానే వాళ్ల మనో నిశ్చ య్యాలేమయ్యేవో తెలిసేదికాదు. వారిద్దరి మనస్సులు కలసికోడానికి ఆకులపడేవి. అట్టి స్థితిలో దేశ కాలాలే వాళ్లకి ప్రతిబంధ కాలు అవుతున్నాయి.

నేటిరాత్రి, వెనకటి రాత్రులతో సమాన మైనదైనా, విభిన్నమైంది. నేడు బింబి సారుడు చాలా వ్యాకులుడయ్యాడు. పాలి తన సాధారణమైన చాపలం విడిచి గంభీర అయింది. ఇదే తక్కిన రాత్రులకు నేటి రాత్రికీ భేదం.

పాలి గాఢాలోచనలలోనిమగ్నురాలయింది. ఇప్పుడు ఆమె ఆనుకొనికూర్చుంది. ఆలోచ నలు వరసగా రాసాగాయి—వంశ దేశాలజాడ నిశ్చితంగా తెలియని పరదేశ పురుషునిమీద ఈ లిచ్ఛవీయకన్య—మహానాముని పుత్రిక ఎలా అనురక్త అయింది? వివాహానికిముందే ప్రేమోన్మత్తలైనకన్యల నెందరనో పాలి అనేకసార్లు పరిహసించింది. ఒకానొక యువ కునిముందు ఒక వనిత ఆకస్మికంగా ప్రేమ చేత ద్రవించి వంగి ఉండడంచూచినప్పుడు ఆమెకు అపారమైన కోపం వచ్చేది. ఏ స్త్రీ అయినా అలా ప్రవర్తిస్తే ఆమె తనకే అవ మానం జరిగినట్లు అనుకొని సమయానికీ ఆమె ఆ స్త్రీని దూషించడానికి స్వయంగా ఆమె దగ్గరకుపోయేది.

'పురుషుణ్ణి చూచి స్త్రీ అబల ఎందు చేత అవుతుంది?' అనే విషయాన్ని గురించి ఆమెకి అన్నిటికంటె అధికకోపం కలుగు తుంది. అప్పు డామెకు ఆ విషయానికి సరి యైన కారణం వెదకినా కన్పించేదికాదు. నేడు ఆమెకీ విషయమే ఆగి ఆగి మన స్సులోఏదో ఒక మూల గిలిగింతపెట్టి 'స్త్రీ యొక్క ఈ శక్తే — స్త్రీ పురుషుల ప్రణయం, ప్రకృతియొక్క దానం' అని చెప్తోంది.

ఈ ఉత్తేజనవల్ల అధికంగా అశక్తుడైం దెవరు?......స్త్రీయా, పురుషుడా? లేక ఇద్దరూనా?......స్త్రీ పురుషులు రాత్రిం బగళ్లు ఏ ఆనందాన్ని కాంక్షిస్తారో అదే నిజమైన సుఖమా?......ఈ విషయంలో 'ఎందుకోసం', 'ఎంచేత' అనే గాఢ ఆలోచ నలో పాలి చిక్కుపడి ఉంది.

ఆ సమయంలోనే చాలా దగ్గరనుండి ఆయాసంతో కూడిన స్వరంతో బింబిసారు డన్నాడు—'పాలీ'

'అతి......' అతిథి శబ్దం పూర్తికాలేదు. పాలి ఉలికిపడింది.

'అతిసుందరం......' అని బింబిసారుడు పాలి శబ్దం పూరించాడు.

'ఏది అతిసుందరమయింది......?'


మేలిరకం "డస్ట్" టీలలో సాటిలేనిది
లిప్టన్స్
హిమాలయన్
గోల్డెన్ డస్ట్ టీ
HIMALAYAN
FINEST
GOLDEN DUST TEA
LIPTON'S
FINEST
GOLDEN DUST TEA
ఈ టీతో మీరు కమ్మని, చిక్కని బంగారు ఛాయగల టీ కప్పుల
వెంబడి కప్పులు అతి త్వరలో తయారుచేయగలుగుదురు. ఈ
సాహియమును మీరే త్రాగి చూడండి. మీ అతిధులకుకూడా
౨ ౧. మీరు తప్పక సంతోషముతో వికసిస్తారు. అవును.
మీ ధరితులైన అతిధులుకూడాను లిప్టన్స్ హిమాలయన్
గోల్డ్ స్ట టీ మేలిరకం టీలలో నిజంగా అద్వితీయమైనది..
LIPTON
లిప్టన్స్
అంటే
మంచి టీ

ఆమ్రపాలి

'నీవు చెప్పేది, స్వీకరించేగిని' అని బింబి సారుడు జవాబిచ్చాడు. పాలి కొంతసేపు అతనివైపు చూస్తూవుంది— 'నీ విక్కడ కెందుకు వచ్చావు?'

'.....మరి నీవో?'

పాలి వెంటనే జవాబు చెప్పలేకపోయింది. బింబిసారుడూ మవునంగా ఉన్నాడు. ఇద్దరూ ఒకరి నొకరు అర్థం చేసుకొన్నట్లుంది, ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో పాలివక్షం కంపిస్తోంది. ఏదో చెప్పాలను ప్రయత్నంలో ఆమె పెదాలు కంపిస్తున్నాయి. బింబిసారుని మదించిన కళ్ళలోనూ హృదయంలోనూ లేచు తుపాను కొంతసేపు ఇద్దరినీ జ్ఞానహీనులుగా చేసింది.....ఇంత రాత్రివేళ వారు ఉద్యానానికిఎందుకువచ్చారో దానికి వారిద్దరి మనస్సులే సాక్ష్యం. పాలిబలవంతంగా తన మనోభావాల్ని అణచింది. ఆమె అకస్మాత్తుగా నిలబడి, 'నీవు రేపటినుండి వెళ్ళిపో' అంది.

'ఎందుచేత?' అని బింబిసారుడు మందహాసంచేసి అడిగాడు.

'నీవు రేపు తప్పకుండా పోవాలి.'

'ఎంచేత?'

'వెడతావా లేదా?'

'ఏం......'

'ఎంచేత అని అడగకు' అని పాలి మధ్యలోనే అంది. 'వెడతావా లేదా?'

'నేను పరదేశిని, అతిథిని. ఇంతవరకూ నాకు స్వస్థత చేకూరలేదు.'

'నేటి సాయంకాలం నన్నెత్తుకొని గంగ ఒడ్డున పైఉన్న గుట్ట ఎక్కడంతోటే స్వస్థత కలుగుతుంది. అంతేనా?'

'కాదు, ఒక గోవత్సాన్ని తీసుకొని, ఒక్క గుక్కలో గుట్టపై కెక్కినప్పుడే నేను స్వస్థుణ్ణి అని చెప్పవచ్చు. ఇదే నాహితుల అభిప్రాయం. నిన్నెత్తుకుపోయే శ్వాస ఇంత వరకూ ఆగిపోలేదు.....నేను స్వస్థుణ్ణికాను.

'నేను గోవత్సంకంటె కూడా భారంగా ఉన్నానని చెప్పకూడదూ?'

'నే నలా ఎప్పుడన్నాను?' అని బింబిసారుడు అతి మృదువుగా పాలి హస్తాన్ని తన హస్తంలోకి తీసుకొని అన్నాడు. ఈ స్పర్శ పాలిని వూపివేసింది. బింబిసారుడు మళ్ళీ నాడుల్లో విద్యుత్ ప్రవాహాన్ని పుట్టించాడు. అతడు మందస్వరంతో 'పాలీ' అన్నాడు

'నటుడా' అని ముఖం ఎత్తి ఆస్వరంలోనే పాలి జవాబిచ్చింది. ఆమె కళ్ళు వాలిపోయాయి. పాలి చెయ్యి ఒకటి బింబిసారుని చేతిలోనేఉంది. అతడు రెండు చేతులతోటీ పాలిని తనవైపు లాక్కున్నాడు. పాలి విస్ఫారిత నేత్రాలతో అతణ్ణిచూస్తూ ఉంది.

'పాలీ హృదయంలో భావం వెలపలికొచ్చి మాట్లాడితే మన ఇద్దరి హృదయాలూ ఒకే విషయాన్ని చెప్తాయి. ఈ విషయం నీవూ ఎరుగుదువు. నేనూ ఎరుగుదును.'

బింబిసారుడు 'నీవు' అనడం వరకూ వచ్చింది. పాలికి ఈ 'నీవు' అన్నది బహుశా అమృతంలాగ తోచిఉంటుంది. ఏమంటే, ఆమె దీనికి ఇసుమంతైనా అభ్యంతర పెట్టలేదు. బింబిసారుడు మాట్లాడుతూండగానే పాలి కళ్ళుమూసింది. బింబిసారుని ఈభావం ఉత్తేజమవుతోంది.....

'పాలీ' నన్ను నీవు సుఖపెట్టు, నన్ను వివాహమాడనీ' నీవు లేనిదే నేనిప్పుడు నీరసుణ్ణి అవుతాను' అని నీతో ఎలా చెప్పనా అని నేను ఇక్కడికి వచ్చినప్పటినుండి మనస్సులో మాటి మాటికీ అనుకొంటూ, యోచిస్తున్నాను. కాని నేను చెప్పలేకపోయాను. పాలీ, నేను ఎవరిముందూ నిరోషినవడానికి అభినయించలేదు. శుద్ధమూ, స్వచ్ఛమూ, సుందరమూ అయిన వస్తువు నీ దగ్గర ఉంది. అది నా దగ్గరలేదు. కేవలం శక్తికాని, బుద్ధికాని ఎన్నటికీ ఆకర్షణంకాలేదు. కేవలం సౌందర్యంకూడా ఎన్నడూ సంపూర్ణంకాని, ఆకర్షకంకాని కాలేదు. అనేక మంది సౌందర్యమూర్తులు నా చరణాల మీద దొర్లుతూండడం నేను చూశాను. కాని వాళ్ళనిచూచి నవ్వుతూండేవాణ్ని. నేను కేవలం వినోదిస్తున్నాను. ఇదే నా హాసంలోని రహస్యం. కాని నిన్ను చూచింది మొదలు నేను వెదకుతున్నది నాకు దొరికినట్లనిపించింది. నా కిప్పుడు నేను పరిపూర్ణుడననేఅనుభావంకలుగుతుంది.నీవే నన్ను పూర్ణుణ్ణి చేయుగలవు. పాలీ, నీవు నాదానవు సంఘ నియమాలూ, లోక మర్యాదా, కాలరక్షణకోసం మనం విధి పూర్వకంగా వివాహమాడదాం. కాని మన వివాహం జరిగేపోయింది. నిన్ను ఈ సంఘంలో ఏవిధంగానూ అవమానితురాలినిగా చూడడానికి నే నిష్టపడను. నీవు నాతో వివాహబందంలో కట్టుపడు.'

పాలి ఉన్మత్తురాలిలాగ బింబిసారుణ్ణి రెప్పవాల్చకుండా చూస్తోంది. ఇంతవరకూ పాలి మౌనంగా ఉండి ఉండకపోతే బింబిసారుడు ఏమి చెప్పాడో దాన్నే ఒక్క అక్షరమైనా తప్పకుండా చెప్పివుండేది. కాని పాలి బుద్ధిమంతురాలు. ఆమెలో నారీ హృదయంలో ఉండే సంవేదనతోపాటు లిచ్ఛవీయ స్వాభిమానం, తండ్రి ఇచ్చిన విద్యా కూడా పెళితమై ఉంది. ఆమె బింబిసారుడికి దూరమైంది. దూరదృష్టి సారించి, లగవివైపు సంకేతం చేసూందో అన్నట్లు పాలి అంది—

'నీవు పరదేశివి.!

'నేను రాజకుమారుణ్ణి.'

'నటుడవు.'

'కాని పుట్టుకచేతకాదు.'

'గూఢచారివి.'

'దుష్టుణ్ణికాను.'

'విదేశిని తగుమాత్రమే విశ్వసించాలి' కాలు చాచి పాలి అంది—'ఏ పురుషుడు తన్ను గూఢచారిగా ఉంచుకొనకోరితాడో, సత్యం పలకడానికి ఎప్పుడు సంశయిస్తాడో, రాత్రింబగళ్ళు తన రహస్యమయ జీవితానికై జాగత్తకలవాడై ఉంటాడో అట్టివాడి ఏ



నూటన్నైనా విశ్వసించడం విలాగ?'

బింబిసారు డామె దగ్గరకు పరుగెత్తి వచ్చాడు. పాలి తీక్ష్ణదృష్టితో తన మాటల ప్రభావాన్ని కొలవసాగింది. ఆమె తెలియని దానిలాగ అవైపు వీపుపెట్టి నిల్చుంది. అందువల్ల ఆమె బింబిసారుని రాక తెలిసికో లేకపోయింది. ఆమె బలవంతంగా తన ముఖంలో వైరాగ్యం తెచ్చుకోడానికి యత్నిం గింది. కాని బింబిసారుడు ఇదంతా చూడలేక పోయాడు. అతడు పాలిని ఒక్కసారిగా తన రెండు చేతులతో తనవైపు తిప్పు కున్నాడు. ఆమెవైపు పిచ్చివాడిలా చూచి 'పాలీ, 'నాకు నీమీాద విశ్వాసంలేదు' అని నా కళ్లవైపు చూచి చెప్పు' అన్నాడు. పాలి చూసింది. పూర్తిగా పాపలలోకి చూసింది. బింబిసారుడు చూస్తూనే ఉన్నాడు. పాలి అతణ్ని వదిలిందో అన్నట్లు, 'నాపై నీకు విశ్వాసముందా? లేదు. అవునా?' అని ఆ ఆసనంమీాద కూర్చుంది. బింబిసారుడు ఆమె పనక్కిపోయి కూర్చున్నాడు. పాలి అతని వైపు చూడకుండానే చెప్పసాగింది—'నామీాద విశ్వాసమేవుంటే నీ వెవడవో చెప్పియుండే వాడవే ప్రేమలో అవిశ్వాసానికి అవం తైనా చోటులేదు. ప్రేమ కర్థమేవిశ్వాసం.

బింబిసారుడు ద్రవించి అన్నాడు—'పాలీ నీ ఈ కఠోర ఆఘాతంకూడా నాకు అమృ తంలా ఉంది. ఇప్పుడు నే నింకేమీా చెప్పను. ఒక్కటే ఎన్నువించుకోవాలి' అని అతడు అత్యంతావేశంతో, పాలిని తనవైపు లాక్కొని అన్నాడు—'పాలీ, నన్ను మళ్లీచూచి నన్ను విశ్వసిస్తున్నావో లేదో నిజమైన హృద యంగా చెప్పు. అంతే. నేను ఈ క్షణం లోనే ఇక్కడినుండి వెళ్లిపోతాను. పాలీ. నిన్ను నమ్మడంలేదంటే, నిజంగా నమ్మి, నన్ను నేనే నమ్ముకోడంలేదన్నమాట. నేను— నేను పలవలేను'

ఈసారి పాలి కరిగిపోయింది. హఠా త్తుగా ఆమె బింబిసారుని హస్తాన్ని తన హస్తంలోకి తీసుకుంది. ఆమె అతణ్ణి తన వైపు లాగుకో కోరుతోందో అన్నట్లుంది. బింబిసారు డింకా దగ్గరికి వచ్చాడు. పాలి ఇంకాజరిగివచ్చింది. ఆమె! ప్రేమదృష్టి సారించి, 'నీకు నామీాద విశ్వాసముంటే— నీ వెవడో చెప్పు. నాకు చెప్పవా?....!' అంది. పాలి ప్రశ్న వినగానే బింబిసారుడు తన దృష్టి మళ్లించి మెల్లగా అన్నాడు—'నే నిప్పుడే చెప్పలేను, పాలీ.'

(సశేషం)

మితభాషి

(19వ పేజీ తరువాయి)

భరిణను ప్రసన్న కిస్తూ, "అక్కడ త్రివేణి వక్కపొడి బాగుంటుంది. మే మొక సారి నీ వూరొచ్చాములే, మావరిది పెళ్లికి."

ఎదురింటి ఆడ పిల్లల వూసే ఎరుగని ప్రసన్నకు అంగడిలో అమ్మే ఆ వక్కపొడి వూసేమెరుక. 'అలవాటు లేదండా' మను కుంటుండగానే ప్రక్క గదిలో నుండీ ప్రవేశించారు రాజమ్మగారు. ఆమె వెనుకగా చిన్నగా నవ్వుకుంటూ కృష్ణవేణి, రోజారాణీ. వాళ్ల వెనుకగా షరా మామూలే— బొచ్చుకుక్క!

"కుంజ కుదిరిందాబాబా?" వూల గ్లాసులో పాయసం తెచ్చి ప్రసన్నకిస్తూ అడిగారు, రాజమ్మగారు.

వూసలగ్లాసులో పాయసం పూర్తి చేస్తూ, "కుదిరిందండీ, కుంజగుత్తి, టార్చి, ఆ బల్లపై నుంచాను. మీకొంచెం శ్రమ గల్గించా నను కుంటాను?" కొంచెం బిడియంగానే పలికాడు ప్రసన్న. ఖాళీ గ్లాసు రాజమ్మగారి కిస్తూ.

"దాని దేముందిలే బాబూ! ఇరుగూ పొరుగూ అన్నాక ఇలాంటి సహాయాలు చేసుకోకుంటే సాగేదెలా?"

'అవును మరి' అన్నట్టుగా చూస్తోంది ప్రసన్నకేసి కృష్ణవేణి.... లంగా అంచును నోటితో కరచి లాగుతుంది రోజారాణిని వాళ్ల బొచ్చు కుక్క—టామీ

ప్రసన్న వాళ్ల దగ్గర నుండి సెలవు తీసుకొని తన క్వార్టర్‌కు చేరాడు. నిద్ర వచ్చేవరకూ ప్రేమించడం చేతగాని వాళ్లకు అంకిత మిచ్చిన ఒక రచయిత నవలేదో చదువుతూ, నిద్రా దేవిలో ఒరిగి పోయాడు.

ప్రసన్నకు మెలకువ వచ్చేసరికి లోకనాథంగారి రేడియోలోనుండీ - వినిపిస్తుంది స్వర్గీయ సైగల్ సోలో "సాహేకో రాడవు చాహి....." అంటూ.

తలుపు తెరిచి బయటకు చూసాడు ప్రసన్న!

బళ్లకు పోతున్నారు బడి పిల్లలు. ప్రసన్న కెందుకో ముచ్చటను పించింది వాళ్ల యూనిఫామ్ చూస్తుంటే. అప్పుడే వెళ్తున్నారు కృష్ణవేణి, రోజారాణి. తెల్లని రవికమీద పచ్చని పరికిణీ అదే రంగులో లంగా వేసింది కృష్ణవేణి. మొయ్యలేనన్ని పుస్తకాల్ని పొందికగా హృదయానికి అదిమి పట్టు కొంటూ, జారుతున్న పైటను సదురుకుంటూ నడుస్తుంది. ఎందుకోమరి— విషాద చిహ్నంగా నల్లని రంగు రిబ్బనులు వేసింది. రోజారాణి కూడా అలాంటి రిబ్బనులే వేసింది. తెల్ల రవికమీద పచ్చలంగా— షరా మామూలే!!

మిగిలిన పిల్లలుకూడా అదేకోవలో ఉన్నారు "ఇదేగామోసు వీళ్ల యూనిఫామ్! రిబ్బన్లకు కూడా నిర్దుష్టమైన రంగున్న నిర్ణయించినవాళ్లు, చేతి గాజుల కెందుకు నిర్ణయించలేదో?" అనుకున్నాడు— వంచ రంగుల్లో వున్న వాళ్ల చేతి గాజులకేసిచూస్తూ.

అలా ఆలోచిస్తూ నిలుచున్న ప్రసన్నను బళ్లకు పోతున్న పిల్లలు ఇటుగా చూస్తున్నారనీ, అందునా కృష్ణవేణి, రోజారాణి తననుచూసి నవ్వుకుంటూ పోతున్నారనీ గమనించనేలేదు.

ఎందుకనో మితభాషిగావుండే ప్రసన్నకు వలువుగోలుగావుండే కృష్ణవేణి ప్రతిక్షణం కళ్లల్లో మెదులుతుంది. వీణ తీగెలు మ్రోగినట్టూ, హృదయ తంత్రులు మీటినట్టూ "మీరా?" అంటూ పిలిచిన ఆ పిలుపే మళ్లీ మళ్లీ వినాలనుపిస్తుంది. 'మంచిపిల్ల' అనుకున్నాడు మనస్సులో నిష్కల్మషంగా.


ఉంగరాలజుత్తు ఒత్తుకొంటూ వంచిన తల ఎత్తకుండాపోయే ప్రసన్నను చూసి రోజా, రాజమ్మగారు మురిసిపోయేది. రోజల్లా ప్రసన్న విషయమే ప్రస్తావిస్తుండేది. "ప్రసన్నను గురించి మీ ఉద్దేశం?" రాజమ్మగారిప్రశ్నకు లోలోన నవ్వుకునే వారు లోకనాథంగారు.

"బుద్ధిమంతుడు. పైగా, బాగుంటాడు. విద్య, వినయం, ఒకింత బిడియం అన్నీ సమపాళ్లలో రంగరించిపోశారు అతనిలో వాళ్ల తల్లిదండ్రులు!!" ప్రసన్నమీద వున్న గౌరవం ఒక్కసారి కట్టలు త్రెంచుకొని ప్రవహించింది లోకనాథంగారి పెదాల మీదుగా.

ప్రసన్నను అడిగి వాళ్ల తల్లి చిరునామా తెలుసుకొని తాయారమ్మకు వో ఉత్తరం వ్రాశారు, రాజమ్మ లోకనాథంగారు— ప్రసన్న కళ్యాణ విషయం—వాళ్లమ్మాయి హెచ్. ఎస్సీ చదువుతుందనీ—పేరు కృష్ణవేణనీ—పదహారేళ్లనీ—ప్రసన్నకు ఈడనీ....

మంచి కుర్రాడనీ! మంచి కుటుంబమనీ! కంపెనీలోనే ఉద్యోగం కావడం మూలంగా లోకనాథంగారికి ప్రసన్నపై వో వడి గౌరవం పెరిగింది.

దినదినానికి ప్రసన్నపై పెరుగుతన్న గౌరవం పరోక్షంగా ఉంచలేకపోయాడు లోకనాథంగారు. మొదట్లో కాదూ కూడదన్నా హొటల్ మానిపించి వాళ్లింటిలోనే భోజనం ఏర్పాటు చేశారు. భోజనం వడ్డించి ఎదురుగ్గా కూర్చున్న రాజమ్మగారినిచూస్తే వాళ్లమ్మతాయారమ్మ జ్ఞప్తికి



వచ్చి, ఒక్కనిట్టూర్పు విడిచేవాడు ప్రసన్న. లోకనాథంగారి కుటుంబం తనపై చూపిస్తున్న ఆప్యాయతకు ప్రసన్న లోలోన ఎంతో కృతజ్ఞత తెలుపుకొనేవాడు. ఒక్కోసారి అవధులుదాటుతున్న వాళ్ల అనురాగానికి అసలు కారణం తెలియక విస్తుపోయేవాడు.

రోజారాణి తన్నుచూసి ఏదో చిలిపిగా నవ్వుతుంటే చిత్తయిపోయేవాడు. కృష్ణవేణి తనను క్రీగంట చూస్తుంటే ప్రసన్న హృదయంలో జయగంటలు మ్రోగేయి!!! ఆ జయ గంటల సవ్వడి ప్రతినిత్యం అతని మస్తిష్కంలో ఏదో తెలియని అలజడిని రేపేది. రానురాను ఆ అలజడే వో అనుభూతిగా మారింది???

ఆరోజు ఆఫీసునుండే రాంగానేపోస్టులో వచ్చిన కవరుచించి, చదవసాగాడు ప్రసన్న. తల్లిచేతివ్రాతను గుర్తించి మరీ తొందరగా చదవసాగాడు.....

"ప్రసూ!

మితభాషివి. నీకు నీవుగా ఏ విషయంలోనూ ముందడుగు వేయలేవని నాకు బాగా తెలుసు. తెలిసికూడా నిన్నలా పెంచడం నాపొరబాటేనేమో.....

ఇంతవరకూ ఒంటరిగా ఉంటున్నావని నీ విషయంలోనే ఎక్కువ ఇదయిపోయే దాన్నిగాని, లోకనాథంగారి ఉత్తరం చదివి ఎంతగానో సంబరపడిపోయాను. వాళ్లపెద్దమ్మాయి కృష్ణవేణిని నీ కివ్వాలనుందంటూ వ్రాశారు. నీకూ సమ్మతమంతే, త్వరలోనే తాంబూలాలు తీసుకుందాం.

ఒక్క విషయం.....

సంసారం అనేది వో సాగరం అంటారు. సాగరం నడుమ ఎంత ప్రశాంతంగా అగుపించినా అడుక్కుపోతున్నకొద్దీ అతీ,గతీఉండదు. ఆణిముత్యాలకయినా, క్రూరమత్స్యాలకయినా, ఆ అంధకారమే ఆలవాలం! అంధకారమే సాగరస్వర్గం! గాని, సంసార స్వర్గం అంతకంటే అంధకారంగానూ, అగమ్యగోచరంగానూ అగుపిస్తుంది. ఆ అంధకారంగుండానే కాంతి కిరణాన్ని చొప్పించాలి. ఆ కాంతికిరణంగుండానే సంసారపు సుఖాన్నీ అందుండే స్వర్గాన్నీ చవిచూడాలి— సంసారాన్ని సస్యశ్యామలం చేసుకోవాలి. అలాంటి ఘడియకోసం అనుక్షణం నిరీక్షించు.

నీ జాబుకొరకై ఎదురుచూస్తున్న,

నీ, తల్లి."

ఆ ఉత్తరం అలానే హృదయానికిహత్తుకున్నాడు!

ఆ తల్లి ప్రేమతో వ్రాసిన ఆ లేఖ ఆ తనయుని హృదయంలో కలసిపోయింది. కాదు, కరగిపోయింది—

ప్రసన్న జీవితంలో రెండవ ప్రకరణం కూడా ముగియబోతోంది!! .....మూడుముళ్లేయడం తరువాయి, మూడవ ప్రకరణం మొదలవుతుంది!!! ●



నిరుద్యోగ పర్వం.....ఏడవ కథ. రాయబారం..ఉద్యోగవిజయాలు

——వేళ్లపల్లి వెంకటలక్ష్మీనారాయణ

నిరుద్యోగి నిద్రలోంచి లేచినా మంచం మీంచి లేవలేదు. ఎటో చూస్తూ పడుకున్నాడు. చుట్టవో కాయ నొచ్చాడు. వూరిదీ అని కచ్చితంగా చెప్పలేం. తిరపాతి. ఊరూ, వాడా చెడ తిరుగుతూంటాడు. పేరు తిరపతయ్య. పని వూళ్ళు తిరగటం. వాళ్లనీ, వీళ్లనీ కలుసుకోవటం. ఎక్కడికైనా ఎంత వాళ్ల దగ్గరకయినా సునాయాసంగా పోవటం దార్లో అడ్డమైన వాళ్లందర్నీ కలుసుకోవటం, పల్కరించటం, పరిచయం చేసుకోవటం, యింకెప్పుడో అడ్డం వేసుకోవటం, ఏడాది కోసారి తిరపతెళ్లటం, పరపతీ అదీ కాపాడమని మొక్కుకోవటం..... వ్యవహారం దగ్గిర మొహమాటం మచ్చుకైనాపడ్డు. ఆహారం దగ్గిర మరీనూ. వ్యవహారజ్ఞుడు. ప్రతి నాయకుడికీ ఎలక్షన్లప్పుడు వోట్లూ, ఎప్పుడూ మాటలూ సరఫరా చేస్తూంటాడు. వోర్పూ, నేర్పూ ఉన్నయ్. తీగ దొరికితే డొంకంతా కదులుస్తాడు. ఆఫీసుల్లో ప్యూన్ని పరిచయం చేసుకుని ఆఫీసర్లతో కాసేల్తాగుతాడు. చమత్కారంగా మాట్లాడ్తాడు. ఫార్సుగాకూడామాట్లాడ్తాడు.

సిఫార్సులు చెయ్యడం ముఖ్యోద్యోగం. ఉద్యోగదానం ముఖ్యాశయం. ప్రతిఫలంగా రుణమో, ఫణమో పుచ్చుకుంటాడు. అయినా డబ్బుదేవుంది, మాటుండాలంటాడు. డబ్బు లేకపోయినా మాటమీద బతకొచ్చంటాడు. తను దానిమీదే బతుకుతున్నాట్ట.

వస్తూనే వరండాలో కుర్చీలో కూర్చున్నాడు. కూర్చోమనకుండానే కూర్చుంటాడు. మన్లో మనకి మర్యాద లేవిటంటాడు పైగా. ముసలాయ నొచ్చాడింట్లోంచి. వస్తూనే 'ఎప్పుడు రాక, మూడు లోకాల్లో అంతా కులాసానా' అన్నాడు.

'ఆహా! అంతా కులాసా.....మీ వాళ్లూ కులాసా, మావాళ్లూ కులాసా. మిగతా వాళ్లెట్లాపోతే మనకేం' అన్నాడు.

.....అవీ యివీ అయ్యాక "మీ నిరుద్యోగెట్లా ఉన్నాడం"టూ అడిగాడు. నిరుద్యోగీ మాట విని తల దుప్పట్లో దాచేసుకున్నాడు. కళ్లు గట్టిగా మూసుకున్నాడు. తనమీద సానుభూతీ, విసుగూ వినటం నిరుద్యోగికీ చికాకు. కొందరు గడుసువాళ్లు 'ఆఁ, సరిగ్గా వెదికితే దొరక్కేం చేస్తాయ్. వాళ్లకి ఒద్దికంగానీ' అంటారు. నిరుద్యోగికి కోపంవచ్చి 'అయ్యా, ఎవరేం ఉద్యోగాలు పారేసుకున్నారో చెప్పండి. నే వెతుక్కుంటాను' అంటాడు...యిలాంటిగడుసువాళ్లుంటారనే ముసుగుపెట్టాడు.

'మీవాడేఁ వంటున్నాడు. ఏఁవన్నా పనీ పాటూ...' అర్ధోక్తిలో ఆపాడు తిరపతయ్య. ముసలాయన మొదలెట్టాడు 'ఆఁ. ప్రస్తుతం పనేంలేదు. పాటలు బోలెడొచ్చు. పాడ్తూనే ఉన్నాడు. ఉద్యోగంకోసం తిరిగాడు. దొరక లేదు. యిపు డింట్లోనే ఉన్నాడు. నిద్దరోతున్నాడు.'

తిరుపతయ్య హాచ్చెరపోయాడు. 'మీ వాడికి పాటలొచ్చినా ఉద్యోగం దొరకలేదా' అన్నాడు.

'మీరు భలేవారే. పాటలొస్తే ఉద్యోగాలిస్తార్టండీ' అన్నాడు ముసలాయన.

"నే నా మాటన్నానా? పాటలొస్తే వారు. పాటలు వినిస్తారు. అందుకని పాటల్నిట్లా తీసి పారెయ్యకండి. డిగ్రీల్ని తీసవతల పారేసినా వూరుకుంటానుగానీ పాటల్ని తీసిపారేస్తే వూరుకో' నన్నాడు తిరపతయ్య. 'ఏం లేకపోతే కొడ్తావా?' అన్నట్టు చూశాడు ముసలాయన. తిరపతయ్య వో కథందుకున్నాడు. ప్రద్దీ సోదాహరణంగా చెప్పటం తిరపతయ్య తీరు.

'అదివరకోసారి ఉద్యోగం అంటూ వో కుర్రాడొచ్చాడు నాదగ్గరికి. 'అబ్బాయ్, నీకేఁ వొచ్చు'అన్నాను. 'బి. ఎ. పేసయ్యాను అన్నీ వచ్చు.....ఇంగ్లీషు లెక్కలు.....' అంటూ చెప్పుకుపోతున్నాడు. ఆ కుర్రాడు మనక్కావల్సినవాడు. లేకపోతే 'అబ్బాయ్, నీకు హిస్టరీ, సోషియాలజీ రాదుకదా. ఎట్లామరి? ఇంటికెళ్లు' అని పంపించేవాణ్ణి. మనవాడన్నాను కదూ. అందుకని, 'అబ్బాయ్, యీరోజుల్లో కావాల్సిందవి కావు. యివి ఎలక్షన్ల రోజులు. నీకు పాటొచ్చా' అన్నా, 'వచ్చ'న్నాడు. ఆపాట్ను ఎలక్షన్ల మీటింగుల్లో పాటలు పాడమన్నాను. నామాట మీదే నిలబడ్డాడు. మీటింగులన్నీ వాడి పాట్లమీదే నడిచిపోయినై. మనకాండిడేటు గెలిచాడు. మంత్రి కూడా అయ్యాడు. సన్మానసభ జరుగుతూండగా యీ పా(పో)ట (టు) గాణ్ణి పిల్చి తనమెళ్లో దండ వాడి కేశాడు. 'ఏఁవీ అనుకోకు. యింకో దండ యీ సభవాళ్లు తయారుగా వుంచుకోలేద'న్నాడు. నీ పాటే నాకు కోటయ్యిందన్నాడు. వీళ్లవోట్లెంత జేసు, వీళ్లెంతజేసు. నీపాటే నాకు రక్షయ్యింది. నీకేం కావాలో కోరుకో..... నీ గుణం మెచ్చాను. నీ రుణం ఉంచుకోనన్నాడు. కుర్రాడు కోరుకున్నాడు. ఉద్యోగంఅయ్యింది.. అదీ కథ. అతని కుద్యోగం యిచ్చింది డిగ్రీల్చూశా? పాటలు వినా? చెప్పండి.... మాట్లాడరేం' అంటూ ఘొల్లుమన్నాడు

తిరపతయ్యా. ముసలాయన విస్తుపోయాడు. 'అయినా అంత చేటు నవ్వు పనికిరా దన్నాడు.'

'అయితే మావాడికి పాటలు చెప్పించి ఎలక్షన్లోకి పంపమంటావా?' అన్నాడు మళ్లీ.

'తక్షణం పంపించండి....అయినా 'వో మాటేటు పిలవండి. ఎట్లాగున్నాడో చూసి విందాం' అన్నాడు.

దుప్పట్లో దూరినా లాభం లేదనుకుని నిరుద్యోగి మొహం కడిగేసి కాఫీతాక్కుండా వరండాలోకొచ్చి కూర్చున్నాడు..... 'వో పాట పాడబ్బీ' అన్నాడు తిరుపతయ్య అవీ ఇవీ అడిగి. పాటయ్యాక 'అయితే మీ వాడికి పనేలేదన్నమాట. పాటుంది· అది చాలు. బాగానే పాడ్తాడు' అన్నాడు.

'..సరే, రేపొచ్చే ఎలక్షన్లలో పాడు. ఎలక్షన్లతర్వాత కాకుండా ముందేవోవుద్యోగం వేయిస్తాను..... నన్నెరుగున్న మంత్రి గారున్నాడు...... ఆమాటకొస్తే నన్నందరు మంత్రులూ ఎరుగుదురనుకో. కానీ వీడికినాకూ చిన్నప్పట్నించే.....అంటే గోలీలాడేటప్పటి నుంచే స్నేహం. యిద్దరం ఒకేకంచంలో తినేవాళ్లం. వకేమంచంలో పడుకునే వాళ్ళం...వాడికప్పుడు కంచం మంచం రెండూ వుండేవి కావు పాపం...సరే, ఆగోలీలాడేటప్పుడు ఎప్పుడూ ఓడిపోయేవాడు....యిప్పుడు ప్రతి ఎలక్షన్లోనూ గెలుస్తున్నాడనుకో....అట్లా గోలీ లాటల్లో ఓడుతుంటే ప్రతివాడు వాడు తెలివి తక్కువ వాడన్నాడు. కానీ నేనప్పుడే అను కున్నా" వీడికి గోలీల్లో తెలివిలేదు కానీ, గోళాలు తిప్పే తెలివుంది. ఏసెంట్రలు మినిష్టరో అవుతాడని' వాడిప్పటికీ అంటూంటాడు. 'నువ్వుచెప్పినట్టే అయ్యిందిరా తిరపతీ' అని..... ఆc, వాడట్లా గోలీల్లో వోడిపోతూంటే నేను వాడాట ఆడి గురి పెట్టి అవతలివాడి కాయని కొట్టేవాణ్ణి. గెలిపిస్తూవుండేవాణ్ణి. అప్పటినుంచీ వాడికి నామీద గురి. నేనేంచెప్పినా చేస్తాడు. వాడితోచెప్పి మీవాడికి వో మూడొందలుద్యోగం వేయిస్తాను. ఆబాధ్యత నానెత్తి నేసుకుంటాను. నాకొదిలెయ్యండి... అబ్బాయ్ నువ్వీలోగా పాటలుమాత్రం మానొద్దు. బాగా ప్రాక్టీసుచెయ్యి' అని కుర్చీలో జారగిల పడ్డాడు తిరుపతయ్యా.

'భోజనాలు చేద్దాం' అని లోపలి కెళ్లాడు ముసలాయన...... నిరుద్యోగి మాట్లాడలేదు.... నిరుద్యోగి తనంతట తనేం మాట్లాడ్డు. అవతలివాడు పలకరిస్తే సమాధానాలు చెపుతాడు.

నిరుద్యోగి బామ్మొచ్చింది," 'ఎవరా కూర్చున్నదంటూ' ముస లాళ్ళ మాటలు మెద లెట్టితే వోపట్టానొద్దులు. అందుకని లేచి నిలబడ్డాడు తిరపతయ్య, 'కూర్చున్న దెవర'ని గదా అడిగింది మనం నుంచుంటే సమాధానం చెప్పక్కర్లేదని. అయినా ముసలమ్మొదల్లేదు. 'ఎవరా నుంచున్న మనిషంటే' అంది మళ్లీ. యిహ లాభం లేదనుకున్నాడు తిరపతయ్య, కుర్చీలో కూర్చుంటూ 'నేనమ్మా, తిరపతిని' అన్నాడు.

'హారి తిరపతీ, నువ్వా! ఎంతవాడివయ్యావ్'.

'ఆ ,చాలాపెద్దవాణ్ణయ్యాను.... కులాసాగావున్నావా' అన్నాడు తిరపతయ్యా.

'ఏం ఖులాసాలే. యిట్టా వున్నాను. ఆ నువ్వేదో పెద్ద వుద్యోగం చేస్తున్నావని విన్నాను. కలెక్టరీ చేస్తున్నావా?' అంది బామ్మ. 'కలెక్టరీ చేసే ఖర్మనాకేం....వాళ్ళకు కుద్యోగాలిప్పిస్తున్నాను' అన్నాడు తిరపతయ్య.

ముసలావిడ సంతోషించింది. హాచ్చెర పడింది. యింతవాడంతయినందకు. బుగ్గల్నొక్కకుంది హాచ్చెర్యం అభినయించేందుకు. 'అసలే లోపలికి పోయాయ్, యింకేం నొక్కుకుంటావు, వూరుకో' అని వారించాడు తిరపతయ్యా. ఆమాటనీ, యీమాట వినీ యింకోమాటుంది అంది ముసలావిడ. 'ఏవిట'న్నాడు తిరపతయ్య.

"మామనవడికో పిల్లని చూసి పెళ్లి చేద్దా. వాడిపెళ్లిచూసి 'హరీ' అందామనుకుంటున్నాను' అంది బామ్మ.

నిరుద్యోగికి కోపం వచ్చిందీమాట వినగానే. కోపం పెళ్లిమాటెత్తినందుకు కాదు. అయినా ఆమాటెత్తితే ఏం, అదే వన్నా వోఘాయిత్యం మాట కనకా? అయినా యీ యన్దెగ్గిరెత్తింది. అందుకొచ్చింది కోపం. యీాయనేవన్నా వుద్యోగా లిప్పించేవాడనుకుందా? పెళ్లిళ్ళు చేసేవాడనుకుందా? ఈపెళ్లి గొడవలోపడి ఉద్యోగం సంగతి మరుస్తాడేమోనని నిరుద్యోగి భయం. నిరుద్యోగి బజార్లెంట తిరక్కుండా యింటిపట్టునుంటే చూసి తను 'హరీ' అనొచ్చని ముసలమ్మ వూహ.

నిరుద్యోగి మందంగా మందలింపుగా అవీ యివీ అని 'అయినాబామ్మా, నాపెళ్లికీ నువ్వు 'హరీ' అంటానికి వంతేవిటి? ఈలోగానే 'హరీ' అనగూడదూ' అన్నాడు.

'హరారా, అంది బామ్మగారు. తిరపతయ్యా కూడా పెద్దరికం చూపించివాడు. 'పెద్దళ్లనలా అనకూడద'న్నాడు.

'ఏవండీ! ఎందుకనగూడదూ? ఎప్పుడూ రామా, కృష్ణా అంటూనే వుంటుందిగదా. ఆ 'హరీ' అంటే పాపవా? మీరే చెప్పండి, నాకు తెలియకడుగుతాను'అన్నాడు నిరుద్యోగి నవ్వుతూ.

ఘొల్లుమన్నాడు తిరుపతయ్యా. ఒక సారని వూరుకోలేదు మళ్లీమళ్లీ అన్నాడు. ముసలాయన పరిగెట్టుకొచ్చాడు పోస్టుమాన్దగ్గరికి పరిగెత్తే నిరుద్యోగిమాదిరి. చేతిలో రెండు పెంకులున్నాయ్.

'ఏవిటో? పెంకులెగిరేట్టు నవ్వుతున్నారు... దొడ్లోకి రెండెగిరొచ్చాయ్' అన్నాడు ముసలాయన.

'మీరు భలేవారండీ! ఆ మాత్రానికేనా' అన్నాడు తిరపతయ్య నవ్వుమెల్లగాతగ్గిస్తూ.

'ఎంతకావాలండీ పెంకుకూడెందుకు?. మాతాతల్నాటి కొంప' అన్నాడు ముసలాయన చేతిలో పెంకులు క్రింద పెడుతూ.

'మీవాడు భలే చమత్కారి. మాంచి విట్టులుకూడా వేస్తాడు. యిలాంటివాడికుద్యోగం దొరకలేదంటే ఆశ్చర్యంగా వుంది. యిందాకోవిట్టు వేసాడు...ఆ.... అంటూ మళ్లీ మెల్లగా నవ్వు మొదలెట్టాడు. విట్టుపేర్జెప్పి మళ్లీ ఎక్కడ ఘొల్లుమని పెంకు లెగరగొడ్తాడోనని 'సరే, అన్నానికి లేవండి' అన్నాడు ముసలాయన.

తిరపతయ్య తిరుగు ప్రయాణం అయ్యాడు. వెళ్లేముందు అందరూ తలోసారి చెప్పారు వుద్యోగం సంగతి. మరీ మరీ చెప్తుంటే యిక చెప్పొద్దన్నాడు తిరపతయ్యా. 'అది నామీద పెట్టండి. యిహ దాన్గురించెత్తకండి నేనిప్పించేదాకా' అన్నాడు. 'భయపడొద్దు నేను తొందర్లోనే యిప్పిస్తాను' అన్నాడు మళ్లీ. వెళ్తూ వెళ్తూ నిరుద్యోగిని పిల్చి కాగితం కలం తెచ్చుకోమన్నాడు. నిరుద్యోగి కాగితం పెన్సిలూ తీసుకొచ్చాడు. నిరుద్యోగి పెన్నెప్పుడూ పన్జెయ్యదు. శలవుల్లో బద్దకించి దానికీ శలవిస్తాడు· పాళీవుంటే యింకుండకో, అదుంటే యిదుండకో, మొత్తానికి పెన్నార్డర్లో వుండదు. పెన్సిలు తెచ్చినా వూరుకున్నాడు తిరపతయ్యా.

'ఓఎలక్షన్ పాటలో వోచరణం చెబుతాను రాసుకో. అది పాడుకుంటూ వుండు'అన్నాడు. నిరుద్యోగి రాయటం మొదలెట్టాడు.

'ఓ ఓటరూ! నా ఓటరూ! నువ్వెంత వాడివోయ్.......' అదీచరణం. 'నువ్వెంత వాడివోయ్' అన్నచోట నొక్కి అది ఒకటికి రెండుసార్లనమన్నాడు. 'దాన్నేవుంది. మూడు సార్లంటానన్నాడు నిరుద్యోగి. 'వద్దు' అన్ని సార్లంటే అర్ధం వేరవుతుంది. మనూహాలు

బయట పడ్తాయ్,' అన్నాడు. తిరపతయ్యా బాగా నాలుగుసార్లనిపించి ఏనాయకుడో యిటుకేసొచ్చినప్పుడు ఆ సభల్లో పాడమన్నాడు. ఆమాటకొస్తే పిలవనిపేరంటానికెళ్లకూడదుట కానీ పిలవని సభకెళ్లొచ్చుట. అదీగాక యిది ప్రజాస్వామ్యం, విన్నొకడు పిలవాల్సిన పనిలేదన్నాడు.

'..యీ లోపల యీ పాటలు నేర్చుకో' అనేసి వెళ్లిపోయాడు తిరపతయ్య.

నిరుద్యోగికి పాటలు పాడటం వుద్యోగం అయ్యింది. ఎపుడూ పాడ్తూనే వున్నాడు. 'యిదెక్కడి విడ్డూరం. ఉద్యోగం దొరక్కపోతే ఏడుస్తారుగానీ ఎక్కడన్నా పాడ్తూ కూచుంటారా' అన్నారు కానివాళ్లు. అయినా అయిన వాళ్లేం అన్లేదు. 'దానికోసమే ఆ ఏడుపు' అని సర్దేశారు.

ఉద్యోగ విజయాలు

కొన్నాళ్లు పోయాక తిరపతయ్యా యింకో నాయకుడుగారూ ఆవూరొచ్చారు, 'ఎలక్షన్లుగదా. వోటర్లెట్లావుంటే మనకేం వోట్లెట్లాగున్నయ్యో చూద్దామని.' నాయకుడికి మందీ మార్బలం బాగానే వున్నారు. వున్నట్టుండి నాయకుడి మనుష్యుల్లో వుండే పాటగాణ్ణి అవతల పార్టీవాళ్లు లాగేసుకున్నారు. అతగాడు నాయకుడి పార్టీ పాటలు మర్చిపోయి అవతలి పార్టీ పాటలు పాడుతున్నాడు. 'ఆనాటి సభ ఎట్లా జరుగుతుందో' అని నాయకుడికి బెంగపట్టుకుంది. సమయం కనిపెట్టి తిరపతయ్య నిరుద్యోగిని రమ్మన్నాడు. ఆరోజంతా నాయకుడు మంచి నీళ్లు ముట్టలేదు. సాయంత్రం అయిదయ్యింది. మీటింగు ఆరింటికి. పాటలేందే మీటింగెట్లా? పాటల్లేకుండా తనెన్ని మాటలు చెప్పగలడు? తను ఎట్లాగో చెప్పినా ప్రజలు వింటారా?.... యివీ ప్రశ్నలు. నాయకుడు మంచం మీద పడుకుని విచారిస్తున్నాడు.

'అయ్యా, తమరిలా బెంబేలు పడిపోకూడదు. ఎలక్షన్లలో వోడిపోయేప్పుడు పెట్టె పోజు మీది' అంటూ వోదార్చబోయాడు తిరపతయ్య.

'చ, అప్రాచ్యం మాటలు' కసురుకున్నాడు నాయకుడు 'అదే నేననేది. మీరలా వుండకూడదు. వాడిబొంద.... ఆపాటగాడెళ్లిపోయాడని విచారిస్తారా? అసలు వాడికేం వచ్చు, చచ్చువెధవ! అసలు వాడు పాడేవన్నీ, పాడినవన్నీకూడా చచ్చుపదాలే.. ఆ , అటుచూడండి. ఓచిన్నవాడొచ్చి పాడుతున్నాడు మనమీటింగుదగ్గర' అని కిటికీ తెరచి చూపించాడు.

నిరుద్యోగి మైకుదగ్గర్నుంచుని 'ఓఓటరూ' అంటూపాడుతున్నాడు. నాయకుడికి పాట వినంగానే ఏనుగంత వుత్సాహం వచ్చింది. వుత్సాహంలో కిటికీ వూచలురెండు పీకి పారేశారు. 'అయ్యా ఎందుకంత తొందర. అటుద్వారం గుండా వెడదాం. యీ కిటికీ తొంచెందుకు.. అయినా మనం వెళ్లటం ఎందుకు? ఆ చిన్నవాణ్ణి పిలవమని శలవా?' అన్నాడు తిరపతయ్య. 'తక్షణం' అన్నాడు నాయకుడు.... నిరుద్యోగివచ్చాడు.

నాయకుడు కూర్చుని నిరుద్యోగిని కూర్చో బెట్టుకుని విన్నాడు. అంతా విని 'నీకేంకావాలి? నిన్నోయింటివాణ్ణి చెయ్యనా? నీ విరోధి యిల్లు పగల గొట్టించనా, అందుకు వీల్లేకపోతే తగలెట్టించనా? లేకపోతే వాడిల్లుపీకి నీ యింటిముందు పందిరెయ్యనా? నీ ఎగస్పార్టీమీద పార్టీగట్టనా? నీయింటిముందు రోడ్డేయించనా? లేకపోతే నీ విరోధి వీధిలో గోతులు త్రవ్వించనా?. యిలాంటివింకెన్నో నీకు మంచి చేసేవి మీ విరోధిని ముంచి వేసేవి బోల్డు చెయ్యగల్ను. నీకేదికావాలో కోరుకో' అన్నాడు (వి) నాయకుడు.

'ఉద్యోగం కావాలన్నాడు ' నిరుద్యోగి

'చాలా చిన్నకోరిక కోరుకున్నావ్.... యింకో ఛాన్సిచ్చాను. పెద్దదికోరుకో.... లేకపోతే మీ పెద్దాళ్ల నడిగిరా, ఫో' అన్నాడు నాయకుడు.

'పెద్దాళ్ల కోరికా అదేనండి. రోజూ పోరూ అందుకేనండి. అందుకని ఉద్యోగమే యిప్పించండి'అన్నాడు నిరుద్యోగి.

'సరే, నువ్వు మా ట్రూపులో చేరు. మేం యీ రెణ్నెల్లూ వూరూవాడాతిరుగుతూ వుంటాం. మావెంటతిరుగు. పాటలుపాడు. యీలోపలే నీకో ఉద్యోగం యిప్పిస్తా. శలవుపెట్టి యీ రెణ్నెల్లూ మాతో తిరుగు. ఎలక్షన్లవ్వంగానే డ్యూటీలో చేరు' అని శ్రకటరీని పిలిచి 'ఈకుర్రాడికో మూడొందలుద్యోగం వేయించు' అన్నాడు. శ్రకటరీ నిరుద్యోగి పేరూ అవీ అడిగి వ్రాసుకుని వారంరోజుల్లో ఆర్డరింటికొస్తుందన్నాడు.....నిరుద్యోగికో అనుమానం వచ్చింది. 'అయ్యా', ఉద్యోగంలో చేరంగానే రెణ్నెల్లు శలవిస్తారా' అని అడిగాడు.

నాయకుడు మీసాలమధ్య డాన్సు చేయించాడు నవ్వుని. తిరపతయ్య గొల్లుమన్నాడు. తిరపతయ్యింకా చిన్నసైజు నాజూకు డాన్సులు నేర్చుకోలేదు. అంతా కోయడాన్సే. ఎవరన్నా ఆపమన్నా ఆపడు. కానీ యిప్పుడెందుకో కాస్సేపు ఘొల్లుమని ఆపేశాడు.

'ఆ యింకా తెలియదు' అని నాయకుడితోఅని, నిరుద్యోగి వంకచూసి 'ఆ అదంతేలే' అన్నాడు. నాయకుడు నవ్వాడు. తిరుపతయ్య మళ్లీ ఘొల్లు మన్నాడు. నిరుద్యోగి నవ్వాడు యధాశక్తి. కానీ నీరసంగా వుంది.ఆనవ్వుల్లో శ్రకటరీవచ్చాడు. ఓకాగితం నాయకుడికిచ్చాడు. నాయకుడు చదివి నిరుద్యోగి కది చూపిస్తూ 'ఆఆఫీసులో ఖాళీ వుందిట చేర్తావా అన్నాడు· 'ఆ' అన్నాడు నిరుద్యోగి. 'అయితే రెండు మూడ్రోజుల్లో ఆ చేర్టం పనిపూర్తి చేసుకుని మాట్రూపుని పై వూళ్లో కలుసుకో' అన్నాడు నాయకుడు.

నాయకుడికి నమస్కారం పెట్టి మీటింగుదగ్గరకెళ్లివిజృంభించి 'ఓఓటరూ! నువ్వెంతవాడివోయ్' అంటూ పాడుతున్నాడు నిరుద్యోగి.


'భావగర్భితంగాకూడా పాడుతున్నాడే' అన్నాడు నాయకుడు విలాసంగా చూస్తూ.

'అన్నీ నేర్చుకున్నాడు. వో ఏడాది పాటు యింటిపట్టునుండి వొంట పట్టించుకున్నాడు.' అన్నాడు తిరపతయ్య.

రాత్రిపదింటిదాకా పాటలుపాడి యింటికెళ్లాడు. మూల వేసిన మంచం అరుగుమీదికి తెచ్చుకున్నాడు అందరితోనూ మాట్లాడాడు.పేరుపేరునాపిల్చి మరీ మాట్లాడాడు. వేన్నీళ్లతోడి, పెరుగేసి అన్నం పెట్టారు. రాత్రి పన్నెండింటికి మంచం మీద పడుకుని విప్పారిన కళ్లతో పైకప్పుకేసి చూస్తూ పడుకున్న నిరుద్యోగి తనివితీరా నవ్వుకున్నాడు· తనిప్పుడో ఆఫీసరు. తోటి నిరుద్యోగుల గురించి కాస్సేపాలోచించాడు. 'తను యీ కిటుకులో్త పన్నేకుండా ఉద్యోగా లివ్వాలి' అనుకున్నాడు అందరికీ. ఆలోచిస్తూండగానే నిద్రపట్టింది...... పొద్దున్నే సూర్యోదయం ముందే లేచాడు. 'ఉదయిస్తున్న సూర్యుడు బాగావే వుంటాడు' అనుకున్నాడు.

నిరుద్యోగికి వుద్యోగం వచ్చింది. అతడో వుద్యోగి.

(అయిపోయింది) ●


మీ కాలేజీ
చాలా పెద్దదంటావ్?...
ఐతే మీ కాలేజీలో ఎంతమంది
లెక్చరర్లు పని చేస్తున్నారు?
సగం మంది
అసలు పనే చేయరండి
సత్యమూర్తి

కళావీధిలో బాలతార అనిలాఖన్నా



శ్రీమతి ఇందిరాగాంధీ అనిలాకి బహుమతి ప్రదానం చేస్తున్న ఘట్టం.

బైట జోరున వర్షం పడుతోంది. కిటికీ తలుపులు మూసేసి, వరండాలో ఆడుకుంటున్న కూతుర్ని లోపలికి తీసుకు వచ్చింది తల్లి. అనూకి అప్పుడు రెండున్నర సంవత్సరం. తల్లి ఒళ్లో గోముగా తల ఆనించి బైటచినుకుల్ని చూస్తోంది.

"దాన్నేమంటారు చెప్పు?"

లేసుఅల్లుకుంటున్న తల్లి పరధ్యాన్నంగా కూతుర్ని అడిగింది.

''వాన......!!''

తడుముకోకుండా సమాధానం చెప్పింది అనూ.

"అమ్మా వానని కాయితం మీదవేసి చూపు" అడిగింది అనూ.

ఏచెట్టునో, పక్షినో, జంతువునోఅయితే చిన్నపిల్లకి గీసి చూపించటం సులభం కానీ వానని ఎలా చూపించటం?.....తల్లి ఓ క్షణం తటపటాయించింది. చివరికి ఓకాయితం ముక్క తీసుకుని, ఏటవాలుగా నాలుగు గీతలు గీసింది. కానీ ఆచిన్నపాపకి సంతృప్తి కలగలేదు. ఆకాయితంముక్కని కోపంగా అవతలికి నెట్టి, తల్లిని మళ్లీ రాయమంది.

ఆచిన్నమెదడులో ఎన్నెన్నో వూహాలు న్నాయి వర్షాన్ని గురించి, కానీ మాటలు రావుగా యింకా చెప్పేందుకు? కూతురి వంక విసుగ్గా చూస్తున్న తల్లి గడ్డం పట్టుకుని మారాం చేసింది అనూ. చేతుల్ని అటూ ఇటూ తిప్పుతూ, వచ్చీరాని మాటలతో వర్షాన్ని వర్ణించమంది. వానచినుకులు గుండ్రంగా నేలమీద పడటం నెరుగును అనూ. వానకి మట్టి బురద అవటమూ

ఉషారాణి భాటియా

చూసింది. ఒళ్ళు తడవకుండా గొడుగు వేసుకుని తండ్రి ఆఫీసుకి వెళ్ళటమూ కనిపెట్టింది. మరి ఇవన్నీ స్పష్టంగా కాయితం మీద పెడితేగానీ 'వాన' అన్న పదానికి అర్థం కనపడలేదు ఆచిన్నారికి. ఆ క్షణంలో కూతురిమీద గంపెడు కోప మొచ్చిందిగానీ, అనిలా ఒరోజు ప్రఖ్యాత బాలచిత్ర కారిణి అవుతుందని తెల్సుకో లేక పోయింది తల్లి.

*　　*　　*

ఆర్టెక్. రష్యా,
జూన్ 15వ తేదీ.

ప్రియమైన అమ్మకి,

కులాసాగా చేరాను. ఇక్కడ బాగా చలి. అయినా బాగుంది. రష్యను పిల్లలుచాలా స్నేహంగా వున్నారు. నేను రష్యాలో మాట్లాడిన నాలుగు ముక్కలకే మురిసిపోయారు. మేమున్న కాంపు చాలా అందమైనచోటు. చుట్టూ పార్కులు, తోటలు. అసలు ఈదేశంలో రోజాపువ్వు లెక్కువ. పెద్ద సైజులో రకరకాల పూలు రోడ్లకి రెండు వైపులా వున్నాయి. భోజనం ఒక్కటే కాస్త కష్టంగా వుంది. వీళ్ళతిండినాకు రుచించటం లేదు. కానీ బ్రెడ్డు, పాలు, పళ్ళు తీసుకుంటున్నాను. నాగురించి బెంగ పడక...''

తల్లికళ్ళు నీళ్ళతో మసక బారాయి, కొంగుతో ఆనందభాష్పాలు వత్తుకుంటూ. ఆరోజు వర్షంలో అనూచేసిన గోలజ్ఞప్తికి తెచ్చుకుంది. నిజానికి 'అనూ' యింతది అవుతుందని ఎవరనుకున్నారు?.

*　　*　　*

ఓరోజు అనూ నర్సరీక్లాసు టీచరువచ్చి "మీ అమ్మాయి బొమ్మలకి రంగు వేయటంలో ఆసక్తి చూపుతోంది'' అనిచెప్పి నప్పుడు అంతగా పట్టించుకోలేదు యింట్లో ఎవరూ.


"మామాష్టారు ఈబొమ్మలకి రంగు వెయ్యమన్నారు''అని ఆరేళ్ల అనూ మాష్టారి సొంత డ్రాయింగ్సు యింటికి పట్టుకొచ్చినప్పుడు, పొరపాటేదో జరిగి వుంటుందని అదరాబాదరా స్కూలుకి పరుగెత్తాడు అనూ పెద్దన్నయ్య. ఆకుటుంబంలో ఎవరికీలేదాయె యిటువంటి ఆశక్తి! రెండుతరాలు వెనుక వారిని తరిచి చూచినా ఆకుటుంబంలో వ్యాపారస్థులు, యింజనీర్లు, డాక్టర్లు వున్నారేగానీ లలిత కళాభిరుచి ఎవరికీ లేదు. అందుకే అనూ ప్రతిభ కేవలం ఒక బాల్యదశ చాపల్యం కింద జమకట్టి, ఎక్కువ పట్టించుకోలేదెవరూ.

1959 వ సం.లోఅంటే అనూకి ఏనిమి దేళ్లప్పుడు దుర్గాపూజా కాలీబారీ చిత్రలేఖనం పోటీలో మొదటి బహుమతి వచ్చింది. ఆవిషయం తెలిసి తల్లితండ్రులు పొంగి పోతూ వుంటే ఆ పసిహృదయానికి ఏమీ అర్థం కాలేదనే చెప్పాలి. కానీ పెద్దల ఆశీర్వాదం, ప్రోత్సాహం లభించాయి.

ఆతరువాత అనూకి శంకర్సుబాలల చిత్రలేఖనం పోటీలో వరుసగా అయిదు ప్రథమ బహుమతులు లభించాయి. పోయిన సంవత్సరంఅంటే 1965 నవంబరులో శ్రీమతి ఇందిరాగాంధిచేత మెరిట్ (ప్రతిభ) సర్టిఫికేటు బహూకరింప బడింది. క్రమంగా ఈబాలికపేరు దేశాంతరాలలోనూ ప్రాకింది. టోక్యో అంతర్జాతీయ బాలల చిత్రలేఖన ప్రదర్శనానికి అనూ పెయింటింగ్సుని నాలుగు ఎన్నిక చేసుకోవడమైంది. యునెస్కో ఆధ్వర్యాన జరిగిన జెకోస్లోవికా అంతర్జాతీయ బాలలచిత్రలేఖనం పోటీలో అనూ మొదటి బహుమతి నందుకుంది. అంతే కాదు., జర్మన్ డెమాక్రటిక్ రిపబ్లిక్ ఈ బాలికకు ప్రత్యేక బహుమతి ప్రదానం చేసింది.

ఈసంవత్సరం, రష్యా ప్రభుత్వంనుంచి అనూకి ఆహ్వానం వచ్చింది. నెహ్రూమరణానంతరం, రష్యా, భారత ప్రజలమధ్య స్నేహ సౌహార్ధాలు పెంపొందించి, తద్వారా, ప్రపంచ శాంతి నెలకొల్పాలన్న వుద్దేశంతో నెహ్రూ స్మారక చిహ్నంగా రష్యా ప్రభుత్వం, భారత దేశంలో సాహిత్య, సాంస్కృతిక లలిత కళల్లో ప్రఖ్యాతిగాంచిన వారికి బహుమతులు ప్రదానం చేయనిశ్చయించింది. శ్రీమతి గాంధి, శ్రీ కె. పి. ఎస్. మీనన్, శ్రీ ఎమ్. చలపతిరావు, కె. ఎ. అబ్బాస్‌వంటి ప్రభుతులు బహుమతులు నిర్ణయించే మండలికి సభ్యులు. "రష్యాలోని నాస్నేహితులకి భారతదేశంలో నేను చూడ కోరేది''అనే విషయంమీద 13 సం.లోపు బాలబాలికలు వేసే చిత్రలేఖనంకి ఈసంవత్సరం బహుమతి యివ్వ నిశ్చయమయింది.

యావత్భారతదేశం నుంచి మొత్తం 12000 పెయింటింగ్సు రష్యా ప్రభుత్వానికి అందాయి. అందులో మొత్తం అయిదింటిని ఎన్నుకున్నారు. "పల్లెసంత" అన్న అనూ పెయింటిగు అందులో ఒకటి. జూన్ మూడో వారంలో, మరో నలుగురు బాలబాలికలతో కలిసి ఒకనెల రష్యా వెళ్లింది అనూ. ఈబాలల రవాణా



మద్రాసు ఫిలింఫాన్స్ అసోషియేషన్ (మద్రాసు) వారు 1965 ఉత్తమనటీనటులను నెహ్రూ స్టేడియంలో జరిగిన సభలో సత్కరించారు. కేంద్ర సమాచారమంత్రి శ్రీ రాజబహదూర్ అవార్డు లిచ్చారు, సావిత్రి (తెలుగు ఉత్తమ నటి) జెమిని గణేశ్, రాజబహదూర్, శ్రీమతి సౌందరకైలాసం, ఆర్. ఎస్ కన్నయ్య, ఎం. జి. ఆర్. (ఉత్తమనటుడు) లను చిత్రంలో చూడవచ్చు.

ఖర్చు బని అంతా, రష్యా ప్రభుత్వమే భరించింది.

నెహ్రూకి ప్రియాతి ప్రియమైన ఆర్టెక్ అన్న ప్రదేశంలో ఈపిల్లలు బస చేశారు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలోని బాలబాలికల్ని అనూ యిక్కడ కల్సుకుంది. దాదాపు అయిదు వందలమంది పిల్లలు గుమికూడిన ఆప్రదేశంవారి ఆటపాటలతో, నృత్య గానాలతో మారుమ్రోగింది. దేశ, జాతి, భాష తారతమ్యాలు అడుగున పడి, పిల్లలు సరదాగా గడిపిన ఆక్షణాలు నిజంగా ఎంత మనోహరమైనవో!!

ఉదయం లేచింది మొదలు ఒక్కక్షణం తీరికవుండేది కాదు పిల్లలకి. తాముచూసిన వన్నీ డైరీలో రాసుకోవటం, పత్రికా విలేఖరులకి, స్నేహితులకి, తమ దేశంలో పాఠాలు స్కూళ్ళని గురించి చెప్పటం, వివిధ ప్రదేశాలకి వెళ్ళటం, సాయంత్రం ఖోటుషికార్లు— అనూ ఒక్కో ఘడియనీ ఎంతో ఆనందంతో తల్చుకుంటుంది.

అనూ కూడా పట్టుకెళ్ళిన గౌన్లు పట్టు బట్టలు వృధాయే అయాయి. దాదాపు నెలంతా ఆమె కాంపు బట్టలే వేసుకుంది. నీలిరంగు లాగు, షర్టు, తెల్ల టోపీ, ఆచలికి బాగున్నాయి. అక్కడ బాలలుయిచ్చిన ఎర్ర సిల్కు రుమాలు అనూ మెళ్ళో నుంచి అసలు తియ్యనే లేదు.

అనిలా రష్యను బాలలకి అనేక బహుమతులు తీసుకు వెళ్ళింది. భారతదేశపు స్టాంపులు, గాజులు, బొమ్మలు చూసి ఆపిల్లలు పరమానంద భరితులయ్యారు. అక్కడవున్న నెలలో అనూ మూడు చిత్రాలు గీసింది. క్రిమియాలోని దుబ్రావా,

అనిలా అనూ

జాల్టా, గుర్‌జుల్ఫు, అలుష్టా పట్టణాలనీ, మాస్కో కూడా చూసింది.

పిల్లల కాంపు ప్రారంభోత్సవ సమయంలో అనూ మన జాతీయపతాకం ఎగురవేసింది. రష్యనుభాషలో చిన్న ఉపన్యాసం కూడా యిచ్చింది. (ఈ బాలిక విదేశం వెళ్ళేముందు కొద్దిగా వారిభాష నేర్చుకుంది.) "భారతీయుల రోజు అని" పండుగ చేసిననాడు అనూ ఒక కథక్‌నృత్యంకూడా ప్రదర్శించింది. ఈ నృత్యానికి ముగ్ధులయి వారు ఒక బంగారు పతకాన్ని ఈబాలికకి బహూకరించారు.

నీకు రష్యాలో ఏమేం నచ్చాయి? అని అడిగితే 13 సం. లన్నా నిండని అనూ బాలిక సహజమైన ఉత్సాహంతో నవ్వింది. "అన్నీను ఒకటేమిటి! అక్కడ పిల్లలు బొద్దుగా వుంటారు. బలే స్నేహం చేస్తారు. నిజంగా రష్యానుంచి వచ్చాక నేనూ లావయాను కదూ"


బుధ, శనివారాలు అనూకి స్కూలు త్వరగా అయిపోతుంది అప్పుడే కొన్ని బొమ్మలేసుకునేందుకు వీలు నాకు అంటుంది ఈబాలిక. అనూ బొమ్మలలో "ప్రమాదం" అన పదహారడుగుల కథాచిత్రం ఒకటి చెప్పుకోతగ్గది. "పిక్నిక్" అనుమంలో ఇరవై ఏడు అడుగుల చిత్రం వేసేందుకు అనూ నాలుగు నెలలు కృషి చేసింది. పల్లెజీవనం వేడుకలు ఈబాలిక చిత్రాలలో ఎక్కువగా కనుపిస్తాయి. పురానా ఢిల్లీలో చాందినీ చౌకు జనసమ్మర్దంతో నిండిన ఒక బజారు. ఆవీధిలో నివసిస్తున్న అనూకి, ఆబజారు, మనుష్యులు, కుంచెకి ఎంతో కథావస్తువు ప్రసాదిస్తుంటాయి. దాదాపు అయిదుఅడుగుల పొడవు, గుండ్రని తీర్చైన ముఖం, ఒత్తయిన నల్లని జుత్తు,—చూడ చక్కనిది అనూ. బిగించి జడవేసుకుని, పైతళుకులు ఏమీ లేక సామాన్యదుస్తులతో ఎదురయే ఈ బాలికలో బిడియము, అమాయకత్వము ఎక్కువ కనపిస్తాయి. అనూ మితభాషి. కలుపుగోరుతనం అసలులేదు. గుచ్చిగుచ్చి అడిగితేగానీ తనవిషయం అసలు చెప్పనే చెప్పలేదు.

ఢిల్లీలోని మాడరన్ స్కూలులో ఈ సంవత్సరమే ఎనిమిదవ స్టాండర్డులో ఉత్తీర్ణురాలయింది. అనూ అంటే టీచర్లకి చాలా ముద్దు. స్కూలుమొత్తం మీద ప్రథమంగా వచ్చే పదిమందిలో అనూ ఒకతె. చిత్రలేఖనంలో యింత ప్రతిభ కనబరిచిన ఈబాలిక తనవిద్యకే ఎక్కువ ప్రాముఖ్య మిస్తుంది.

రష్యను రాయబారి వర్గం కార్యాలయంలో బహుమతులు స్వీకరించినవారికి విందు జరుగుతున్న సమయంలో, అనూ కళ్ళనీళ్ళతో గేటుదగ్గర నిలబడింది. ఆ మర్నాడు అనూకి క్లాసుపరీక్ష మరి!అసలు నెహ్రూ ఎవార్డు పోటీలో పాల్గొనేందుకి కూడా అనూ ఆసక్తి కనబరచలేదు. సలహా యిచ్చిన వారికి "నాకు క్వార్టర్లీ పరీక్షలున్నాయి"అని సమాధానమిచ్చింది. చిత్రలేఖనం కేవలం ఒక "సరదా" (హాబీ) గా వుంచుకుని చదువులో వృద్ధికి రావాలని ఆశిస్తున్న ఈబాలికని గురించి యింకా ఎంతో తెలుసుకోవలసినది వుంది. ఈబాలికకి కథలు, కార్టూనులు అంటే అమిత ఆశ. కొన్నాళ్ళపాటు బొమ్మలాటలో శిక్షణ పొందింది. మూడేళ్ళుగా కథక్ నృత్యం నేర్చుకుంటోంది. ఇటీవల గితార్ సాధకం కూడా ప్రారంభించింది.

ఈబాలిక చిత్రాలు, ప్రతిభని గూర్చి వ్యాసాలు—హిందుస్థాన్, ప్రాగ్, నందన్, సమాజకళ్యాణ్, శిక్షణ ప్రదీప్, సందేష్, యింకా అనేక ఆంగ్ల హిందీ పత్రికలలో వెలువడ్డాయి.

పంజాబులోని ఒకసామాన్య కుటుంబంలో పుట్టి పెరుగుతున్న ఈబాలిక యింకా ఉన్నత శిఖరాలనందుకుంటుందనీ, భావిలో యింకా ఎందరో అనూలు మనదేశ కీర్తి గౌరవాలు విస్తృతం చేస్తారనీ ఆశిద్దాము. ●



ఇటీవల దుర్గాపురం ఆంధ్రసమితివారు ఏర్పాటుచేసిన నృత్యప్రదర్శన సందర్భంలో కుమారి విజయలక్ష్మి, జనరల్ మేనేజర్ శ్రీ ఆర్. కె. ఛటర్జీ, సమితికార్యదర్శి శ్రీ జి.ఎల్. కృష్ణయ్య, అధ్యక్షులు శ్రీ కె. అప్పారావు.

మద్రాసులో తెలుగు సినిమాలు

"ఏమండీ, మీకు ప్రెస్‌షో వేసినప్పుడు నన్నుకూడా తీసుకెళ్లరూ?" అంటూ అడిగారొక పెద్దమనిషి. అలా అడగటంలో గల అర్థం—జేబులో డబ్బులేకకాదు. తెలుగు సినిమా చూడాలన్న తాపత్రయం, కాంక్ష ఆయన్నలా అడిగించినవి. తెలుగు సినిమాలు యిక్కడ చూడాలనివున్నా ఆడవు. ఆడినా ఉదయం ఆటలు. అవైనా పాతవి. పాపం, ఆయన స్థితిచూసి జాలివేసింది.

ఆంధ్రలో విడుదలయిన ఏడాదికో, రెండేళ్లకో యిక్కడ ప్రదర్శిస్తూంటారు తెలుగు సినిమాలు. పేపర్లో— 'ఫలానా



'పిడుగురాముడు'లో ఎల్. విజయలక్ష్మి

థియేటర్లో ఫలానా సినిమా ఆదివారం ఉదయం పది గంటలకు ప్రదర్శింప బడుతుంది' అన్న ప్రకటన చూసిన యిక్కడి ఆంధ్రులకు ఎంతో సంతోషం కలుగుతుంది. ఆ సినిమా చూడాలని యిక్కడ నివసిస్తున్న వారిలో అధికభాగం కుతూహలం కనబరుస్తారు.

ఈ నగరంలోగల మొత్తం జనాభాలో— నాలుగోవంతు తెలుగువాళ్లు ఉన్నారు. అంటే సుమారు ఐదు లక్షల మంది ఉంటారు. ఒక్క విజయవాడలో ఉండే వారికన్న ఇక్కడ నివసించే ఆంధ్రుల సంఖ్య అధికమని స్పష్టంగా తెలుస్తున్నది.

ఒక తమిళచిత్రం విడుదలయితే, ఆ సినిమా చూసేందుకు వచ్చినవారి సంఖ్యలో మూడోవంతు తెలుగువాళ్లు థియేటర్ దగ్గర కనిపిస్తారు. వ్యాపారం మీద తదితరత్రా మన వేపులనుంచి వచ్చేవాళ్లు కూడా తమిళ చిత్రాలను చూడడానికి సుముఖులుగా వుంటారు. అయితే వీళ్లందరికీ తమిళభాష అర్థమయే వెళుతున్నారా అంటే— 'కాదు' అని చప్పున స్ఫురిస్తుంది. మరెందుకు వెళ్తున్నట్టు? అనిప్రశ్నిస్తే తెలుగు సినిమాలు యిక్కడ ప్రదర్శింప బడవు గనుక వెళ్తున్నారని సమాధానం చెప్పవలసి ఉంటుంది.

ఇంతమంది తెలుగువాళ్లు తెలుగు సినిమాలను చూడాలని ఉవ్విళ్లూరుతున్నప్పుడు, మన నిర్మాతలు యిక్కడ తమ చిత్రాలను విడుదల చేసేందుకు ఎందుకు సుముఖంగా ఉండటంలేదో— ఎందుకు శ్రద్ధ చూపడంలేదో అర్థం కాదు. ...... పూర్వంకన్న యిప్పుడు కొంత నయం. క్రౌన్ టాకీస్ (మింట్) లో రాత్రి ప్రదర్శనలు వరుసగా వేస్తున్నారు. ఈ వ్యాసం వ్రాసేనాటికి "పరమానందయ్య శిష్యులు కథ" ఆ థియేటర్లో ప్రదర్శింప బడుతూన్నది .... అలా ఆ ఒక్క థియేటర్లోనే కాకుండా, తెలుగువాళ్లున్న అన్ని ప్రాంతాలలోను తెలుగు సినిమాలు విడుదలచేస్తే ఆంధ్రలో వలెనే యిక్కడ కూడ శతదినోత్సవాలు జరుపుకొనగలవనటం సందేహాస్పదమయిన విషయంకాదు.

క్రౌన్ (మింట్), బ్రైటన్ (రాయపురం), కృష్ణవేణి (టి. నగర్), కామధేను లేక కపాలి (మైలాపూర్), రామ్ (కోడంబాకం) థియేటర్లలో వరుసగా ప్రదర్శిస్తే ఒక తెలుగు సినిమాకి ఎంతో ధనంవస్తుంది. ఒక థియేటర్లో తీసేస్తే మరొకదానికి— పైన ఉదహరించిన వాటిలోకి మారుస్తూవుంటే— యిక్కడున్న తెలుగువాళ్లంతా చూసే అవకాశంకలుగుతుంది. అలాకాక ఒక్క థియేటర్లోనే ఒక చిత్రం ప్రదర్శించడం జరిగితే— నగరానికి అన్నిమూలలావున్న అయిదు లక్షల మంది ఆంధ్రులూ అక్కడికి రావడం కష్టసాధ్యమయిన విషయం.

పై థియేటర్లలో ప్రదర్శించినాడు మింట్, చాకలిపేట, జార్జిటవున్, రాయపురం, పెరంబూర్, టి. నగర్, పాతమాంబళం, సైదాపేట, కోడంబాకం, విల్లివాకం, మైలాపూర్, అభిరామపురం, రాజాఅన్నామలైపురం, అడయారు, రాయపేట మొదలయిన స్థలాలలోగల ఎక్కువ భాగం ఆంధ్రులందర్నీ కవర్ చేసినట్లు అవుతుంది.

మన నిర్మాతలు, పంపిణీదారులు యీ విషయమయి శ్రద్ధవహించి థియేటర్ల యజమానులతో సంప్రతింపులు జరిపి తెలుగు చిత్రాలను విడుదలచేస్తే— మన "ఏ" క్లాసు సెంటర్లలో మరొకటిగా మదరాసు నగరాన్ని కూడా ఎంచుకోవచ్చును.

—మోహన్‌కుమార్ ●



"గూఢచారి 116"లో కృష్ణ, జయలలిత.

గూఢచారి 116

శ్రీ జయలక్ష్మి పిక్చర్స్‌వారి "గూఢచారి 116" చిత్ర నిర్మాణం పూర్తి అయింది. కృష్ణ, జయలలిత, రాజనాల, రేలంగి, గీతాంజలి, ముక్కామల, రమణారెడ్డి, రాజబాబు, నెల్లూరు పహిల్వాన్ కాంతారావు, వేణుమాధవ్ ప్రభృతులు నటించిన యీ అపరాధ పరిశోధక చిత్రానికి ఆరుద్ర సంభాషణలు, సి. నారాయణరెడ్డి, ఆరుద్ర గీతాలు వ్రాశారు. సంగీతం: తాతినేని చలపతిరావు, కెమెరా: రవికాంత్, దర్శకత్వం: ఎం. మల్లికార్జునరావు, నిర్మాతలు: సుందర్‌లాల్ నహతా, డూండీ. ఆగస్టు రెండవవారంలో విడుదల కానున్నట్లు తెలుస్తున్నది.

మనసే మందిరం

కృష్ణసాయి ఫిలిమ్స్ వారు "నెంజిల్ ఓర్ ఆలయమ్" తమిళ చిత్రం ఆధారంగా నిర్మిస్తున్న ఈ తెలుగు చిత్రం చాలాభాగం పూర్తి అయింది. నాగేశ్వరరావు, సావిత్రి, జగ్గయ్య, గుమ్మడి, రేలంగి, చలం, శారద, నాగభూషణం, బేబి శాంతి కళ మొదలయిన వారు నటిస్తున్నారు. మాటలు, పాటలు: ఆచార్య ఆత్రేయ, సంగీతం: ఎం. ఎస్. విశ్వనాథం, కళ: గంగా, ఎడిటింగ్: యన్. ఎం. శంకర్, కెమెరా: బాలకృష్ణ, నిర్మాత: యర్రా అప్పారావు, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శ్రీధర్. హైదరాబాద్ శ్రీ సారథి స్టూడియోస్‌లో నిర్మించబడుతున్న యీ చిత్రం జూన్ 25 న ప్రారంభించి ఏకబిగిన షూటింగు జరుపుతున్నారు.

* * *


చిత్రలహరి

పద్మశ్రీ భానుమతిని భరణీ గార్డెన్స్ లోని వారి స్వగృహంలో యిటీవల కలుసుకున్నప్పుడు "మీరు రాజ్‌కపూర్ నిర్మిస్తున్న మేరానామ్ జోకర్ చిత్రంలో నటిస్తున్న విషయం నిజమేనా?" అని అడుగగా" నటించమని అడిగారు. నటిస్తానని చెప్పాను. ఇంకా నా వర్కు జరుగలేదు. బహుశా ఆగస్టు— సెప్టెంబరు మాసాల్లో ప్రారంభ మవుతుంది" అన్నారామె.

మొత్తం అయిదుగురు నాయికలున్న "మేరానామ్ జోకర్"లో భానుమతితోపాటు పద్మిని, సిమి, ముంతాజ్, హేమమాలిని నటించ గలరని తెలుస్తున్నది. ఇపుడు భానుమతి నటిస్తున్న కొత్త తెలుగు చిత్రం భరణీవారి "గృహలక్ష్మి".

గృహలక్ష్మి


ఒక బెంగాలీచిత్రం ఆధారంగా, సంపూర్ణ హాస్యరసభరితంగా రూపొందించబడుతున్న యీ చిత్రంలో నాగేశ్వరరావు, భానుమతి యస్. వి. రంగారావు, పద్మనాభం, రమణారెడ్డి, చలం, అల్లురామలింగయ్య, సూర్యకాంతం నటిస్తున్నారు. ఇంతవరకు మూడురీళ్ల చిత్రం తయారయింది, సంభాషణలు: డి. వి. నరసరాజు, గీతాలు: సముద్రాల (సీనియర్), శ్రీశ్రీ, సి. నారాయణరెడ్డి, కొసరాజు, దాశరథి, సంగీతం: యస్. రాజేశ్వరరావు కళ: రాజేంద్ర కుమార్, కెమెరా: సి. నాగేశ్వరరావు, ఎడిటింగ్: హరినారాయణ, సహకార దర్శకుడు: భీమేశ్వరరావు, నిర్మాత, దర్శకుడు: రామకృష్ణ. ప్రస్తుతం లాయరు (యస్. వి. రంగారావు) ఇంటి సెట్టుమీద పని జరుగుతున్నది. ఈ షెడ్యూలుతో సగం చిత్రం తయారవుతుంది.



"ప్రేమకానుక" లో రాజశ్రీ, శివాజీగణేశన్

హంతకులొస్తున్నారు జాగర్త!

పి. యస్. ఆర్. పిక్చర్స్‌వారి అపరాధ పరిశోధక చిత్రం "హంతకు లొస్తున్నారు జాగర్త" నిర్మాణం ముగిసింది. ఆరంభించిన నలభై రోజుల్లో పూర్తి చెయ్యబడిన యీచిత్రంలో గుమ్మడి, అంజలీదేవి, రామకృష్ణ, చలం, పద్మనాభం, బాలకృష్ణ, గీతాంజలి, ప్రభాకరరెడ్డి, ఉదయకుమార్, త్యాగరాజు, మాలి, రావి కొండలరావు ప్రభృతులు నటించారు. సంభాషణలు: టి. పి. మహారథి, గీతాలు: సి. నారాయణరెడ్డి, సంగీతం: విజయాకృష్ణమూర్తి, కళ: సోమనాథ్, కెమెరా: ఎస్. ఎస్. లాల్. దర్శకత్వం: యస్. డి. లాల్, నిర్మాత: పింజల సుబ్బారావు. అపరాజిత ఫిలిమ్స్ ద్వారా ఆంధ్రలో యీ చిత్రం ఆగస్టు



రిపబ్లిక్‌వారి 'రక్తసిందూరం'లో రాజశ్రీ (హార్స్లీకొండలపై చిత్రించిన పాటలోదృశ్యం)

ముదట వారంలో విడుదల కానున్నట్లు తెలుస్తున్నది.

గౌరి ప్రొడక్షన్స్ 7 వ చిత్రం

గౌరీ ప్రొడక్షన్స్‌వారి "ప్రొడక్షన్ నెం 7" తాలూకు రెండవ షూటింగ్ షెడ్యూలు జూలై 22 నుంచి గోల్డెన్ స్టూడియోలో ఆరంభించారు. యన్.టి. రామారావు, రాజశ్రీ, జయలలిత, పద్మనాభం, వాణిశ్రీ మొదలయిన వారు నటిస్తున్నారు. సంభాషణలు: పాలగుమ్మి పద్మరాజు, గీతాలు: సి. నారాయణరెడ్డి, సంగీతం: కోదండపాణి, కెమెరా: హెచ్. ఎస్. వేణు, కూర్పు: కె. యస్. ఆర్. దాస్, దర్శకత్వం: జి. విశ్వనాధం, నిర్మాత: వై. వి. రావ్, నిర్వహణ. యస్. భావనారాయణ.

ప్రేమకానుక

కిసాన్ ఫిలిమ్స్‌వారి ఉదాత్త ప్రణయగాధ చిత్రం "ప్రేమకానుక" విడుదలకు ముస్తాబులు సంతరించు కొంటున్నది. దేవిక, రాజశ్రీ, శివాజీ గణేశన్, నాగేష్ ప్రభృతులు నటించిన యీ చిత్రానికి మాటలు, పాటలు, అనిశెట్టి వ్రాశారు. సంగీతం: టి. వి. రాజు, కెమెరా: కర్ణన్, దర్శకత్వం: పి. మాధవన్, బి. ఏ, నిర్మాత: పసుమర్తి వెంకటరాజు. కొడైకెనాల్‌లో చిత్రీకరించిన అవుట్‌డోర్ దృశ్యాలు యీ చిత్రంలో ఒక ఆకర్షణ అని తెలుస్తున్నది.



కొత్తనటి శశిరేఖ



"లేతమనసులు"లో హరనాథ్, జమున

అమ్మా-నాన్నా

మోహన్ పిక్చర్స్‌వారు "అమ్మా—నాన్న" చిత్రం తెలుగులోకి అనువదిస్తున్నారు. జమున, కళ్యాణకుమార్, ఎం. ఆర్. రాధా, మనోరమ మొదలయినవారు నటించారు. మాటలు, పాటలు: రాజశ్రీ, సంగీతం: జె. పురుషోత్తం, ఎడిటింగ్: షణ్ముగం, దర్శకత్వం: దాదామిరాసి, నిర్మాతలు: జె. పురుషోత్తం, వి. మోహన్‌రావు.

గొల్లభామ

శ్రీ సి. పుల్లయ్య దర్శకత్వంలో శేఖర్ ఫిలిమ్స్ వారు "గొల్లభామ" జానపద చిత్రం నిర్మిస్తున్నారు. యన్. టి. రామారావు, దేవిక, రేలంగి, ముక్కామల, గిరిజ మొదలయినవారు నటిస్తారు. సంభాషణలు: సముద్రాల (జూనియర్) గీతాలు: సి. నారాయణరెడ్డి, సంగీతం టి. వి. రాజు, కళ: కుదరవల్లి నాగేశ్వరరావు, కెమెరా: రవికాంత్, నిర్మాతలు: కె. సోమశేఖర్, రాధాకృష్ణ.


పిడుగురాముడు

డి. వి. యస్. ప్రొడక్షన్స్‌వారి "పిడుగురాముడు" చిత్రం వాహినీ స్టూడియోలో త్వరిత గతిని నిర్మించ బడుతున్నది. యన్. టి. రామారావు, రాజశ్రీ, ఎల్. విజయలక్ష్మి, రాజనాల, మణిమాల, రాజ్ బాబు, వాణిశ్రీ, జగ్గారావు ప్రభృతులు నటిస్తున్న యీ చిత్రానికి సంభాషణలు: సముద్రాల (జూనియర్), గీతాలు: సి. నారాయణ రెడ్డి, కొసరాజు, సంగీతం: టి. వి. రాజు, నృత్యాలు: వెంపటి సత్యం, కెమెరా: వరదన్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: యస్. చిట్టిబాబు, పి. వి. గోపాలకృష్ణ, ఎడిటింగ్: జి. డి. జోషి, అసోసియేట్ డైరెక్టర్: వైకుంఠం బి. ఏ., దర్శకత్వం: బి. విఠలాచార్య, నిర్మాత: డి. వి. యస్. రాజు.

మోహన్‌కుమార్

దక్షిణభారత చలనచిత్ర నిర్మాతల సంఘం సమావేశం

దక్షిణ భారత చలనచిత్ర నిర్మాతల సంఘం, మద్రాసువారు కొత్తగా రీజనల్ సెన్సార్ ఆఫీసర్‌గా పదవీస్వీకారం చేసిన శ్రీ రంగరాజన్, రీజియనల్ సెన్సార్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీవిరమణ చేస్తున్న శ్రీ కపిల కాశీపతిగార్లను ముఖ్య అతిధులుగా ఆహ్వానించి మద్రాసులోని న్యూ వుడ్ లాండ్స్‌లో జూలై 12 వ తేదీ సాయంకాలం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి చిత్రనిర్మాతలు, సెన్సార్ బోర్డ్ సభ్యులు, పత్రికా విలేఖరులు, యింకా యితర ప్రముఖులు విచ్చేశారు.



'కన్నెమనసులు' లో రామ్మోహన్, సుకన్య.

చిత్రసమీక్షలు:

కన్నె మనసులు

ధనాసక్తితో తమ్ముడి భార్యను గజదొంగ పాలుచేసిన గంగాబాయమ్మ ఉరఫ్ గభరాబాయమ్మ, ఆస్తికోసం తన వ్యక్తిత్వాన్ని చంపుకుని అక్కయ్య అడుగులకు మడుగులొత్తే శేఖర్, అత్తయ్య ఆలనా పాలనల్లో పెరిగి; గర్వాన్ని, నిర్లక్ష్యాన్ని పుణికి పుచ్చుకున్న కన్నెగా సంధ్య; గజదొంగకీ హృదయపరివర్తన కలుగుతూందని నిరూపించిన శివయ్య; విద్యతోబాటు సహృదయాన్ని, సంస్కారాన్ని కలిగిన నవ యువకుడుగా మోహన్; తాత్కాలికంగా ఆవేశానికిలోనైనా ఎదటివారి ఆవేదనను అర్థం చేసుకోగల మంచి మనసున్న—చదువులేకున్నా—సంస్కారంగల మరో యువకుడుగా గంగులు; చిలిపిగా అందర్నీ కవ్విస్తూ, నవ్విస్తూ అమాయకంగా ఉన్నా తన హృదయాన్ని వేరొకరి కిచ్చానని ధైర్యంగా చెప్పగల పడుచుగా కృష్ణ మొదలైన పాత్రలను సమన్వయపరచి, ముళ్లపూడి వెంకటరమణ రూపొందించిన కథను బాబా మూవీస్ వారు 'కన్నె మనసులు'గా నిర్మించారు.

చిత్రంలోని ప్రతిపాత్రా వాస్తవికతను ప్రతిబింబింప జేస్తుంది. గభరాబాయమ్మగా సూర్యకాంతం నటన ప్రేక్షకులకే గాభరా పుట్టించే విధంగా ఉంది. శివయ్య, పెదబాబులుగా గుమ్మడి ప్రతిభావంతంగా నటించారు. రామ్మోహన్, కృష్ణంల నటనలో అభివృద్ధి, కృషి రెండూ కన్పించాయి. సంధ్యారాణి, సుకన్యలు చక్కగా నటించారు. దుర్గగా పుష్పకుమారి నటన ప్రేక్షకుల మనసులపై ముద్ర వేస్తుందనవచ్చు. మిగిలినవారందరూ పాత్రోచితంగా నటించారు. చక్కని అవుట్‌డోర్ దృశ్యాలను చిత్రీకరించటంలో ఛాయాగ్రాహకులు మంచి నేర్పును చూపించారు. ఎస్. ఆర్. నంది మాటలూ, రెండు మూడు పాటలూ బాగున్నాయి. చిత్రానికి సంగీతం: కె. వి. మహాదేవన్, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే: ఆదుర్తి సుబ్బారావు, నిర్మాత: సి. సుందరం.

డ్రమ్స్ ఆఫ్ డెస్టినీ

జార్జిమైకేల్ చిన్నప్పుడే అడవి జంతువుల్ని వేటాడటానికి చేసిన ప్రయత్నాలు పెద్ద వేటగాడవుతాడని జోస్యం చెప్పాయి. కానీ ప్రమాదకరమైన, తెలిసీ తెలియని ఆ ప్రయత్నాలను మాతుంబీ భగ్నంచేయడంతో జార్జి పెద్దవాడై చాలపెద్ద వేటగాడయాడు. పెంగా అనే అతను తటస్థపడి బైబిల్ సారాన్ని విన్పించడంతో జార్జి జంతువులను చంపడం విరమించుకొని వాటిని, వాటి చర్యలను వన్యదృశ్యాలనూ ఫోటో తీయటం ప్రారంభిస్తాడు. జంతువులపట్ల అతని ప్రేమను, వెంటవున్న అతని భార్య మార్జ్యోరీ, కుమార్తెలు జూన్, కెరోల్‌లు కూడా పంచుకుంటారు. ఎంతో శాంతియుతంగా జీవితం గడుపుతున్న మైకేల్ కొన్ని సమయాల్లో తుపాకిని పట్టటం తప్పనిసరవుతుంది. కుమార్తె జూన్ భయంకరమైనమొసలి వాత బడబోతున్నసమయంలోనూ, తన స్నేహితుడైన బ్లేక్‌ని మరికొంతమంది స్థానిక ప్రజలను పొట్టన బెట్టుకొని భీభత్సం చేస్తున్న పిచ్చి ఏనుగ విషయంలో మాత్రంజార్జి మైకేల్ తుపాకికి పని తగుల్తుంది.

ఈచిత్రంలో ముఖ్యంగా ప్రేక్షకుడి దృష్టిని ఆకట్టుకొనేది ఛాయాగ్రహణం, చక్కని దృశ్యాలతోబాటు భయంకరమైన అడవి మృగాల వేట మొదలైన వాటిని చిత్రీకరించ డానికి సంవత్సరాల తరబడి నిర్మాత, ఛాయాగ్రాహకుడు, యితర బృందం చేసిన కృషి, ధైర్యసాహసాలు, ఓర్పు, మనకు ద్యోతక మవుతాయి. ఆఫ్రికా ఖండాన్ని ఆకొసనుంచి ఈ కొన వరకూ ఆకర్షణీయమైన ఈస్ట్‌మన్ కలర్‌తో చిత్రీకరించారు. ఈచిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం, నిర్మాత: జార్జి మైకేల్. ప్రస్తుతం ఈచిత్రం మద్రాసులోని శాంతి థియేటర్‌లో ప్రదర్శింపబడుతూ ఉంది.

* • *

భారతదేశం సహజసంపదకు పుట్టినిల్లు. విదేశీ చిత్ర నిర్మాతలు మనదేశంలోనే 'హారీ బ్లాక్ అండ్ ది టైగర్' చిత్రాన్ని కొంతభాగం చిత్రీకరించారు. మెట్రోగోల్డ్విన్ మేయర్స్ వారు మైసూర్ అడవులలోని దృశ్యాలతో 'మాయా' చాలాభాగం చిత్రీకరించారు. ఇలా విదేశీ చిత్ర నిర్మాతలు భారతావనిలోని సహజసంపద విలువని గుర్తించి యిక్కడ చిత్రీకరణ జరుపుతూవుంటే, మన నిర్మాతలు విదేశాల్లో కృతక దృశ్య చిత్రీకరణకు పరుగులు తీస్తున్నారు. మన నిర్మాతలు కూడా భారతదేశం లోని ప్రకృతి సంపదను వినియోగించు కొని చిత్రాలను తీయగలిగితే ఎంతో బాగంటుంది. వాటికి విదేశాల్లో మంచి గిరాకీ ఉంటుంది. ఆచిత్రాలను విదేశాలకెగుమతి చేయటం ద్వారా "విదేశీమారకం' లభ్యం కావటమే కాకుండా భారతదేశంలోని సహజసంపద విలువ దేశదేశాలు గుర్తించగల అవకాశం కూడా లభిస్తుంది.

మాధవ్

పుస్తకాలు

సంఘర్షణ

నవల కన్నడ మూలం: త్రివేణి. అనువాదం: కళ్యాణి. ప్రచురణ: విశాలాంధ్ర ప్రచురణాలయం, ఏలూరురోడ్డు విజయవాడ—2. పేజీలు 187, సాదాప్రతి: రు. 3—50 మేలు ప్రతి. రు. 4—00

తెలుగు కన్నడ భాషలకు ఏకలిపి కావాలని భాషావేత్తలు తగు ప్రయత్నాలు సాగిస్తున్న తరుణంలో, కన్నడ సృజనాత్మక సాహిత్యం తెలుగులోకీ, తెలుగు సృజనాత్మక సాహిత్యం కన్నడంలోకీ అనువదింపబడడం సాహితీవేత్తలు హర్షింపవలసిన విషయం. అనువదింపబడిన రచన ఉత్తమ సాహిత్యమయినపుడూ, ఉత్తమంగా అనువదింపబడినపుడూ ఆహర్షం ద్విగుణీకృతమవుతుంది. 'సంఘర్షణ' నవల ఈరెండు లక్షణాలను పొదువుకున్న ఉదాత్తసృష్టి. నవలలోని సంఘర్షణ మానసికమైనట్టిది. కథావస్తువు విధవా వివాహ సమర్థనంగా సాగినట్టిది. రచయిత్రి, స్త్రీ పునర్వివాహ సమస్యను విశ్లేషించిన తీరు ఆమోదయోగ్యంగా వుంది. విధవా వివాహంలో సంఘర్షణము సంఘానికీ వ్యక్తికీ మధ్య గాక, వ్యక్తియొక్క బాహిర చైతన్యానికీ ఆంతర చైతన్యానికీ మధ్య జరుగుతుందని నిర్ధారించుకుని, శ్రీమతి త్రివేణి ఆ సంఘర్షణను ప్రతిభావంతంగా చిత్రించారు. నవల ప్రథమార్థంలో, "సన్నజాజుల పరిమళం ప్రణయ మాధుర్యంతో కూడిన దాంపత్య జీవితం" వర్ణించి ఉత్తరార్థంలో సోమ్నాంబులిజం వంటి విచిత్ర రుగ్మతలను ప్రవేశపెట్టి కథకు మెరుగులుపెట్టి, సునంద జీవితంలోని వెలుగు చీకట్లను స్పష్టంగా చూపెట్టగలిగారమె. శేఖరం సునందల ప్రణయ మాధుర్యం, సీతారాం దమయంతుల నిర్మల సాంసారిక జీవితానుభవం, శ్రీధర్ సునందల నిష్కపట రాగబంధం పాఠకుల నలరిస్తాయి. మంచివాళ్లు మిక్కిలిగా కనుపించే ఒక అపురూపపు లోకాన్ని కళ్లముందు నిలబెడతాయి. నవలలో ఒక్క చెడ్డపాత్రకు కూడా ప్రాధాన్యం లేకుండా, ఆత్మీయతా ఆదరణా, సౌందర్యం ఇత్యాదికి పాత్రలు ప్రతీకలుగా నవలను మలచడం అనితరసాధ్యమైన విషయం. పైగా స్త్రీ రచన కావడం చేత, కథనంలోనూ, వర్ణనలలోనూ ఒకవిధమైన మార్దవత కన్పిస్తోంది. 'కళ్యాణి' గారి అనువాదంలో ఆ లక్షణాలకు తోడు తెనుగుతనం కూడా కలిసి, వెన్నెలకు పరిమళం వచ్చినట్లయింది. అయితే 185 వ పేజీలోని ఆంగ్ల కవితను తప్పుగా ఉదహరించడంలో రచయిత్రుల వ్యుత్పత్తి రాహిత్యం స్పష్టంగా కనుపిస్తోంది. అట్టి పొరపాట్లు దొర్లకుండా అనువాదకురలైనా జాగ్రత్తపడి వుండవలసింది విశాలాంధ్ర అందంగా ముద్రించిన ఈ పుస్తకంలో అచ్చుతప్పులు అరుదుగా వుండడం ఆంధ్ర పాఠకుల అదృష్టం.

—శ్రీరామచంద్రమూర్తి.

'నవోదయ' వ్రాతపత్రిక

హిందూస్తాన్‌నౌకానిర్మాణ కేంద్రంలోని ఉద్యోగుల కోలనీ గాంధి గ్రామ్‌లో 11—5—66 తేదీన ముప్పైమంది యువరచయితలు, సాహిత్య అభిమానులు కలసి యువరచయితల సంఘం స్థాపించి 'నవోదయ' అను వ్రాత మాసపత్రికను సభ్యులరచనలతో నడుపుటకు నిర్ణయించుకున్నారు. శ్రీయుతులు పాలంకి అంబరీషుడు, జనమంచి సూర్యనారాయణ, కామవరపు రామమూర్తిగారలను సంపాదకవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

తే 6—6—66న పై సంఘఆధ్వర్యంలో 'నవోదయ' మొదటి సంచిక కథలు, గేయములు, పద్యములు వ్యాసములు, మొత్తము పదహారు రచనలతో వెలువడినది.

ఉత్తమమైనవిగా సభ్యులచేగుర్తించబడిన రచనలనుబహుళ ప్రచారములోనున్న ప్రముఖ తెలుగు పత్రికలకు ప్రచురణార్థముపంపి, సాహితీరంగంలో సముచిత పాత్ర నిర్వహించుటకు ఈసంఘము నిర్ణయించుకున్నది.

Edited, Printed and Published by S. Radhakrishna at the Andhra Patrika Press; 6 & 7, Thambu Chetty Street, Madras-1. Phone: Editorial 21747; Other depts: 29766. Chief Editor: S. Sambhu Prasad.

Regd. No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA